www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 22-7-2024 | పేజీలు : 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 114

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి మ. 1.12 తదుపరి విదియ; నక్షత్రం: శ్రవణం రా. 10.21 తదుపరి ధనిష్ఠ వర్జ్యం: రా.2.00-3.28; దుర్ముహూర్తం: మ.12.47-1.38, మ.3.21-4.13; అమృతఘడియలు: మ.12.45-2.14; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.47

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వైద్య శాఖ బదిలీల్లోనే ఎందుకిలా?

ఆందోళనలు ఎందుకు జరుగుతున్నాయి?

సర్కారుకు మచ్చ తెచ్చేలా ఉన్నారు!

ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వండి.. సీఎం ఆదేశం

వసూళ్ల పర్వంపై రంగంలోకి ఇంటెలిజెన్స్!

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలోని సాధారణ బదిలీల్లో గందరగోళంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. బదిలీలపై నర్సులు ఆందోళన చేయడం, సంఘాల పేరిట లేఖలకు డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు రావడంతో ముఖ్యమంత్రి

మిగతా 13వ పేజీలో...

మాజీ డీహెచ్ గడల బదిలీ!

- పలువురు డీఎంహెచ్‌వోలకూ స్థాన చలనం 13
- హైదరాబాద్‌లో ఏళ్లతరబడి ఉన్నవారు ఇప్పటికీ అక్కడే!



బై బైడెన్

అమెరికా అధ్యక్ష ఎన్నిక నుంచి జోబైడెన్ ఔట్

డెమొక్రాట్ల ఒత్తిడికి తలొగ్గిన ప్రెసిడెంట్

దేశ ప్రయోజనాల కోసమే తప్పుకొంటున్నా

అధ్యక్షుడిగా పూర్తి కాలం కొనసాగుతా

కమలా హారిస్‌కు మద్దతిస్తా: బైడెన్

వాషింగ్టన్, జూలై 21: అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ వెనక్కి తగ్గారు. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొన్నారు. "నేను అధ్యక్ష ఎన్నికల నుంచి తప్పుకోవాలంటే.. ఆ దేవుడే దిగి రావాలి. లేదంటే.. నేను అనారోగ్యం బారిన పడడమో.. రైలు ఢీకొని చనిపోవడమో జరగాలి" అంటూ.. శనివారం వరకు భీష్మించుకున్న బైడెన్.. ఆదివారం ఒక్కసారిగా మనసు మార్చుకున్నారు. దేశ ప్రయోజనాల కోసం తాను పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. "డెమోక్రాట్ సీనియర్ల ఒత్తిడిని గౌరవిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. ఈ వారాంతంలో జాతినుద్దేశించి ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. నిజానికి రిపబ్లికన్ల తరఫున బరిలో

మిగతా 14వ పేజీలో...

రేసులో కమలా హారిస్ ముందంజ

ఆమెతో పోటీ పడుతున్న మిషిగన్, కాలిఫోర్నియా గవర్నర్లు

బైడెన్‌తో పోలిస్తే.. కమలను ఓడించడం సులువన్న ట్రంప్! 14

కృష్ణమ్మ పరుగులు

గోదావరి ఉధృత రూపం.. ప్రాజెక్టుల్లో జల కళ

ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి లక్ష క్యూసెక్కులకు పైగా రాక

జూరాల 27 గేట్ల ఎత్తివేత.. శ్రీశైలానికి లక్ష క్యూసెక్కులు!

గోదావరి ఉధృతి.. మేడిగడ్డకు 5.52 లక్షల క్యూసెక్కులు..!

భద్రాచలంలో నీటిమట్టం 45 అడుగులకు..

నేడు రెండో ప్రమాద హెచ్చరిక జారీ?

రాష్ట్రంలో కొనసాగుతున్న ముసురు.. పెరిగిన చలి తీవ్రత

నిజామాబాద్ జిల్లా వేల్పులో 18 సెంటీమీటర్ల వర్షం

భద్రాద్రి, ఆదిలాబాద్ జిల్లాల్లో వరదలో ఇద్దరు గల్లంతు

మరో మూడు రోజులూ వర్షాలు.. 9 జిల్లాలకు అలర్ట్



కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు నీటి ప్రవాహం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సీజన్ మొదలై నెలన్నర దాటినా.. మొన్నటివరకు వానలు పెద్దగా లేనే లేవు.! ఈ ఏడాది వర్షాభావం తప్పదా? అన్న ఆందోళన వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో వరుణుడు కరుణిస్తున్నాడు.! తెలంగాణలోనే కాక.. ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో కృష్ణమ్మ బిరబిరా తరలి వస్తోంది. గోదావరి ఉధృత రూపం దాలుస్తోంది. ప్రాజెక్టులు జల కళ సంతరించుకుంటున్నాయి. మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడం, వరద కొనసాగనుండడంతో పంటల సాగుపై ఆశావహ పరిస్థితులు కనిపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా నదిపై ఉన్న తొలి ప్రాజెక్టు అయిన జూరాలలో ఆదివారం 27 గేట్లను ఎత్తారు. 1.29 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1.34 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు

మిగతా 12వ పేజీలో...

ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి పెదవాగు ప్రాజెక్టుకు మరమ్మతులు 12

అవసరమైతే మరో 3 గేట్లను ఏర్పాటుచేస్తాం

రైతులను ఆదుకుంటాం: మంత్రి తుమ్మల

అతివృష్టి-అనావృష్టి!

దేశంలోని 9 రాష్ట్రాల్లో జాడ లేని వానలు

ఆరు రాష్ట్రాలను ముంచెత్తిన వర్షాలు

తమిళనాట సాధారణం కంటే 83% అధికం

ఝార్ఖండ్‌లో 49% పైగా లోటు వర్షపాతం 2



సివిల్స్‌లో దివ్యాంగుల కోటా

అవసరమా?

క్షేత్ర స్థాయిలో పని చేయాల్సిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు శారీరక దృఢత్వం కావాలి

వైకల్యం ఉన్న వారిని పైలట్‌గా విమాన సంస్థలు నియమిస్తాయా?

సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఖండించిన పలువురు.. క్షమాపణకు డిమాండ్

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ లాంటి పోస్టుల ఎంపికలో దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరమా? అని సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ ప్రశ్నించారు. ఆదివారం ఆమె తన ట్విటర్ ఖాతా ద్వారా ఈ అంశంపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సివిల్ సర్వీసుల్లో ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఎక్కువ గంటలు పని చేయాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ వంటి పోస్టుల్లో దివ్యాంగ కోటా ఎందుకని ఆమె ప్రశ్నించారు. సివిల్స్ సర్వీస్ ఉద్యోగాలకు ఎంపిక చేసే విషయంలో అనుసరిస్తున్న విధానాలపై కొంతకాలంగా దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా అంగ వైకల్యం ఉందంటూ నకిలీ సర్టిఫికెట్ సమర్పించి సివిల్ సర్వీసులో ప్రవేశించారని పూజా ఖేద్కర్ అనే ఐఏఎస్ ట్రెయినీ ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆదివారం స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీసు ఉద్యోగాలకు ఎక్కువగా క్షేత్ర స్థాయిలో పని చేయాల్సి ఉంటుందని, ప్రజల కష్టాలను నేరుగా వినాల్సి ఉంటుందని, ఇందుకు శారీరక దృఢత్వం

మిగతా 13వ పేజీలో...

రాహుల్ వరంగల్ సభ 28న?



నేడు ఆయనతో సీఎం భేటీ

తర్వాత స్పష్టత వచ్చే అవకాశం

ఢిల్లీకి చేరుకున్న రేవంత్‌రెడ్డి

అక్కడే ఉన్న భట్టి, ఉత్తమ్

విస్తరణపై చర్చ అనుమానమే

కేంద్ర జలవనరుల మంత్రితో నేడు ముఖ్యమంత్రి సమావేశం

హైదరాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు నేపథ్యంలో వరంగల్‌లోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన కృతజ్ఞత సభ ఈ నెల 28న జరిగే అవకాశం ఉంది. ఆగస్టు 3న సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ లోపే సభ నిర్వహించాలన్న పట్టుదలతో ఆయన ఉన్నారు. కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా రావాలంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానించేందుకు రేవంత్‌రెడ్డి ఆదివారం ఢిల్లీకి వెళ్లారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు శనివారమే ఢిల్లీకి చేరుకున్నారు. సోమవారం ఈ ముగ్గురూ రాహుల్‌గాంధీని కలిసి కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా రావాలంటూ ఆహ్వానించనున్నారు. రాహుల్‌కు ఉన్న వెసులుబాటును బట్టి సభ నిర్వహించే తేదీ ఖరారు కానుంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి

మిగతా 13వ పేజీలో...



అనాలోచిత నిర్ణయం

'కావడి యాత్ర' వివాదం నేపథ్యంలో యూపీ సర్కారుపై ఆర్‌ఎల్‌డీ ఆక్షేపణ

ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలన్న కేంద్ర మంత్రి జయంత్ చౌధరి 2

ఇప్పటికే జేడీయూ, ఎల్‌జేపీ అభ్యంతరం

ఉద్యోగాల భర్తీలో కోటాల రద్దు 2

విద్యార్థుల నిరసన నేపథ్యంలో బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు సంచలన తీర్పు

అభివృద్ధి.. జనాకర్షకం

బడ్జెట్ రూపకల్పనలో మోదీ 3.0 సర్కార్ ప్రాధాన్యాలివే

ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చేయూతనిచ్చే వరాలు! 2

మౌలిక సదుపాయాలకు భారీగా నిధులు

ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.3.5 లక్షలకు పెంచే అవకాశం

గృహ రుణాలపై ఇస్తున్న రాయితీ పెంపు?


గ్రామీణప్రాంత ఎంఎస్‌ఎంఈలకు అండ

అగ్నివీర్ పథకంలో మార్పులు చేసే చాన్స్

మధ్యతరగతికి ఊరట కల్పించే చర్యలు

గృహ నిర్మాణ రంగానికి ప్రోత్సాహకాలు

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాల వెల్లడి!



బడ్జెట్ అనగానే ఏటా ఆదాయపన్ను శ్లాబుల్లో ఏమైనా మార్పులు వస్తాయేమోనని ఆశగా ఎదురుచూడ్డం.. ఏ మార్పులూ లేకపోవడం చూసి నిరాశపడ్డం.. గడిచిన పదేళ్లుగా ఇదీ తంతు. ఇప్పుడు మరో బడ్జెట్‌కు వేళయ్యింది. ఎన్నికలకు ముందు మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్.. రేపు పూర్తిస్థాయి బడ్జెట్‌ను సభ ముందుంచేందుకు సిద్ధమయ్యారు. దీంట్లోనైనా వేతనజీవులకు, మధ్యతరగతికి ఊరట కల్పిస్తారా? సంస్కరణలతోపాటే సంక్షేమానికీ పెద్ద పీట వేస్తారా? మౌలిక సదుపాయాలకు భారీ నిధులు ప్రకటిస్తూనే.. జనాకర్షక విధానాలను ప్రకటిస్తారా? అంటే.. ఆర్థిక నిపుణులు అవుననే అంచనా వేస్తున్నారు.

కేంద్రం కనికరించేనా!

'పాలమూరు-రంగారెడ్డి'కి జాతీయ హోదా

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులు 13

వెనుకబడిన జిల్లాలకు రూ.2,250 కోట్లు



ఐటీ ఉద్యోగులకు 14 గంటల షాక్!

బిల్లుకు కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ఓకే!

కంపెనీల ప్రతిపాదనకు అంగీకారం 2

నేడు క్యాబినెట్ ఆమోదం.. తర్వాత అసెంబ్లీలో

ఉద్యోగుల సంఘం ఫైర్.. కార్మిక మంత్రితో భేటీ

మరోసారి చర్చిస్తామని మంత్రి వెల్లడి

ఐటీలో వారానికి 70 గంటలు పనిచేయాలని గతంలో 'ఇన్ఫోసిస్' నారాయణమూర్తి సూచన

ఆర్టీసీ విలీన ప్రక్రియకు బ్రేక్!

గత ఏడాది సెప్టెంబరులో గెజిట్ జారీ

పది నెలలైనా ముందుకు కదలని ప్రక్రియ

కార్మికులు, ఉద్యోగుల్లో పలు సందేహాలు

బకాయిలతో యాజమాన్యం ఉక్కిరిబిక్కిరి



హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ఎక్కడిక్కడే నిలిచిపోయింది. గత ప్రభుత్వంలో ప్రారంభించిన ప్రక్రియ ఎన్నికల కారణంగా ఆగిపోగా.. నూతన ప్రభుత్వంలోనూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నెలలు గడుస్తున్నా ఆర్టీసీ విలీనంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడం, సంబంధిత చర్యలేవీ ముందుకు సాగకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో రకరకాల సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఎన్నికల ప్రచారంలో ఆర్టీసీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ రెండు హామీలు ఇచ్చింది. అందులో ఒకటి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం(మహాలక్ష్మి పథకం) కాగా, అధికారంలోకి వచ్చిన వెంటనే అమల్లోకి తీసుకొచ్చింది. ఇక.. రెండోది ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ కాగా, ఇది మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత అప్పటి సీఎం కేసీఆర్.. ఆర్టీసీ కార్మికులకు అనేక వరాలు ప్రకటించినా ఏ ఒక్కటీ అమలు కాలేదు. నిధులు కేటాయించకపోవడంతో ఆర్టీసీ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. నిర్వహణ లోపాలతో ఆర్టీసీ మనుగడే ప్రశ్నార్థకంగా

మిగతా 14వ పేజీలో...



మంత్రి శ్రీధర్‌బాబుతో బాల్ ఇండియా ప్రతినిధి

రాష్ట్రంలో 'బాల్ ఇండియా' యూనిట్

బీర్లు, కూల్‌డ్రింక్స్, పర్‌ఫ్యూమ్‌ల సంస్థలకు అల్యూమినియం టిన్నుల సరఫరా

రూ.700 కోట్ల పెట్టుబడి.. ప్రభుత్వానికి ఏటా రూ.280కోట్ల అదనపు ఆదాయం

500 మందికి ఉపాధి: మంత్రి శ్రీధర్‌బాబు

బీర్లకు టిన్నులను వాడాలంటే.. ఎక్సైజ్ పాలసీ మార్చాలని వ్యాఖ్య 13

కేరళలో నిఫా వైరస్‌తో

బాలుడి మృతి

కోళికోడ్‌లో పలువురి ఐసోలేషన్

ప్రత్యేక బృందాన్ని పంపనున్న కేంద్రం 2

పుణె నుంచి మొబైల్ ల్యాబ్

బాలుడికి దగ్గరగా ఉన్న 63 మందికి వైద్య పరీక్షలు

గుజరాత్‌ను వణికిస్తున్న చాందీపుర వైరస్

50 కేసులు నమోదు.. 16 మంది మృతి!

అప్రమత్తమైన ఆరోగ్యశాఖ.. నివారణకు చర్యలు

రీల్స్ మోజు.. యువకుడి బలి

వర్షంలో బైక్‌పై స్టంట్లు చేస్తూ జారి పడి మృతి 3

పెద్ద అంబర్‌పేట్‌లో ఘటన



ఐటీ ఉద్యోగులకు 14 గంటల షాక్!

బిల్లుకు కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ఓకే!

నేడు క్యాబినెట్ ఆమోదం.. తర్వాత అసెంబ్లీలో



బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రైవేటు ఐటీ కంపెనీలు, పరిశ్రమల్లో స్థానికులకు 50 శాతం నుంచి వంద శాతం ఉద్యోగాలివ్వాలంటూ బిల్లు తెచ్చిన సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఐటీ ఉద్యోగులకు పనిగంటలను 14 గంటలకు పెంచేందుకు సిద్ధమైంది. దేశంలో అత్యధిక ఐటీ సంస్థలు, వాటి అనుబంధ కంపెనీలు బెంగళూరు, మైసూరు నగరాల్లోనే ఉన్న సంగతి తెలిసిందే. 14 పనిగంటల ప్రతిపాదనలను ఐటీ కంపెనీలు ఇటీవలే ప్రభుత్వానికి పంపాయి. సిద్దూ సర్కారు మరో ఆలోచన లేకుండానే వాటి అమలుకు సిద్ధమైంది. పని సమయాన్ని 14 గంటలకు పెంచుతూ.. కర్ణాటక షాప్స్, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ బిల్లు-2024 (సవరణ)ను తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. సోమవారం కేబినెట్ భేటీలో చర్చించి.. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఐటీ, ఐటీఈఎస్, బీపీవోలో పనిచేసే ఉద్యోగుల పని గంటలను 12 నుంచి 14 గంటలకు పెంచాలని కార్మికశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం పది గంటల వర్కింగ్ అవర్స్, రెండు గంటలు ఓవర్ టైం.. మొత్తం 12 గంటలు పనిచేస్తున్నారు. దీనిని 12 గంటల వర్కింగ్ అవర్స్, రెండు గంటల ఓవర్‌టైంకు సవరించాలని బిల్లులో ప్రతిపాదించారు. ఈ పని గంటలు వరుసగా మూడు నెలల్లో 125 గంటలకు మించరాదని పేర్కొన్నారు. ఆ రెండు గంటల ఓవర్‌టైంకు జీతమివ్వరు. ఈ నిర్ణయంపై కర్ణాటక ఐటీ/ఐటీఈఎస్ ఎంప్లాయీస్ యూనియన్ (కేఐటీయూ) మండిపడింది. ఈ సవరణ బిల్లు చట్టమైతే మూడు షిఫ్టుల స్థానంలో రెండు షిఫ్టుల విధానం వస్తుందని.. ఐటీ రంగంలో పని చేసే 20 లక్షల మంది ఉద్యోగుల్లో మూడో వంతు మందిని తీసేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. ఉద్యోగులపై పనిఒత్తిడి పెరుగుతుందని, రెండు గంటలు అదనంగా పనిచేస్తే వారు పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని తెలిపింది. దీనిపై కార్మిక మంత్రి సంతోష్‌లాడ్, ఐటీబీటీ శాఖ అధికారులతో ఉద్యోగుల సంఘం కార్యదర్శి సుహాస్ అడిగ, అధ్యక్షుడు సూరజ్ నిడియం భేటీ అయ్యారు. కార్మికుడి వ్యక్తిగత జీవితాన్ని హరించేలా, ప్రాథమిక హక్కులను కాలరాసేలా నిబంధనలు తెస్తున్నారని మండిపడ్డారు. మంత్రి లాడ్ స్పందిస్తూ.. నిర్ణయం తీసుకునేముందు మరోసారి చర్చిస్తామని తెలిపారు. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కొన్ని నెలల కిందట.. వారానికి 70 గంటలు పనిచేస్తే దేశ ఆర్థిక ప్రగతి వేగవంతం అవుతుందని, పలు దేశాల్లో ఇదే అమలు అవుతోందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

'సినిమా'పైనా చూపు

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక సినిమా, సాంస్కృతిక కళాకారుల బిల్లు-2024ను శాసనసభలో ఇటీవల ప్రవేశపెట్టింది. సినిమా టికెట్ల చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని సినీ కళాకారులు మండిపడుతున్నారు. సినిమా టికెట్లు, ఓటీటీ చార్జీలు పెంచడం ద్వారా ప్రేక్షకులపై భారం మోపనున్నారన్న విమర్శలు న్నాయి. సినిమా టికెట్లపై 2% పన్ను పెంచి దోపిడీకి పాల్పడి ప్రజలకు వినోదాన్ని దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ ఆరోపించింది.

సర్వేలు ఏం చెబుతున్నాయి..?

సుదీర్ఘకాలంపాటు పనిచేసే ఐటీ ఉద్యోగుల్లో 45% మంది మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఒత్తిళ్లకు లోనవుతున్నారని కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్-ఇండస్ట్రీస్‌తోపాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ సహా పలు సంస్థలు చేసిన సర్వేలు తేల్చాయి. 55% మంది శారీరక సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందనీ వెల్లడైంది. వీరిలో 35% మంది బ్రెయిన్ స్ట్రోక్, 17% మంది గుండెజబ్బుల బారిన పడతారని కూడా వెల్లడించాయి.

అభివృద్ధి.. జనాకర్షకం

ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.3.5 లక్షలకు పెంచే అవకాశం

- గృహ రుణాలపై ఇస్తున్న రాయితీ పెంపు?
- కేంద్ర బడ్జెట్‌పై మధ్యతరగతికి ఆశలు



ఆదివారం అఖిలపక్ష సమావేశానికి వెళ్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మోదీ 3.0 ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో అభివృద్ధి-సంక్షేమంతో పాటు ఆర్థిక లోటు తగ్గించేందుకు చర్యలు ఉంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో బీజేపీ సంఖ్యాబలం తగ్గడం, మిత్రపక్షాలపై ఆధారపడాల్సి రావడం, ఈ ఏడాది ఆఖరులో మూడు కీలక రాష్ట్రాల్లో ఎన్నికల వంటివాటి నేపథ్యంలో.. సంస్కరణలకు, జనాకర్షక విధానాలకు, రాష్ట్రాల అవసరాలకు సమానంగా ప్రాధాన్యమిస్తూ ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆ వర్గాలు వివరించాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, బిహార్‌ను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో పలు చర్యలను ప్రకటించవచ్చునని సూచనప్రాయంగా వెల్లడించాయి. ఇప్పటికి వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. ఎప్పటిలాగానే ఈసారి కూడా మౌలిక సదుపాయాల కల్పనకు పెట్టుబడులను భారీగా పెంచనున్నారు. అందులో భాగంగా రైల్వే, రహదారులు, టెలి కమ్యూనికేషన్లు, ఆటోమొబైల్ రంగం, ఆరోగ్య సంరక్షణ, రేవుల అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు పెరగనున్నాయి. ఈ బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం.. జీడీపీలో 7.7 శాతానికి, మూలధన వ్యయం 3.5 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. అలాగే.. స్థూల ఆర్థిక లోటును 5.6 శాతానికి తగ్గించడం లక్ష్యంగా ఆర్థిక మంత్రి చర్యలు చేపట్టనున్నట్టు సమాచారం. మొత్తమ్మీద.. మోదీ గత రెండు ప్రభుత్వాల్లో లేనట్టుగా ఈసారి జనాకర్షక విధానాలకు కూడా పెద్ద పీట వేయనున్నట్లు ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతివారిని, మహిళలు, రైతులు, వృద్ధులను ఆకట్టుకునేందుకు చర్యలు ప్రకటిస్తారని అంచనాలు వినపడుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈసారి బడ్జెట్‌లో..

- సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి రంగాల (ఎంఎస్ఎంఈ) పటిష్ఠతకు పలు చర్యలు ప్రకటించనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ రంగానికి చేయూతనిచ్చే అవకాశాలున్నాయి. స్టార్టప్ ఇండియా సీడ్ నిధి క్రింద ఈ రంగానికి నిధులు పెరిగే అవకాశం ఉంది.
- చైనాతో సరిహద్దుల్లో తరచూ ఉద్రిక్తతలు ఏర్పడుతున్న నేపథ్యంలో.. ఈసారి రక్షణ రంగ బడ్జెట్ రూ.6 లక్షల కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా.
- అగ్నిపథ్ పథకంపై మిత్రపక్షాల నుంచి కూడా తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఆర్మీ నిపుణుల నుంచి వచ్చిన సంస్కరణలను దృష్టిలో ఉంచుకుని అగ్నిపథ్‌లో మార్పులు వచ్చే ఆవకాశాలున్నాయి.
- ఆదాయపన్ను కనీస మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు పెంచవచ్చు. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80డి కింద ఆరోగ్య బీమా ప్రీమియంలకు మినహాయింపు పరిమితిని మరింత పెంచే చాన్స్ అలాగే, మధ్యతరగతిని ఆకట్టుకునేందుకు గృహరుణాలపై సబ్సిడీని మరింత పెంచవచ్చు.
- ఆయుష్మాన్ భారత్ క్రింద రూ.5 లక్షల వరకూ బీమాను 70 ఏళ్లు దాటినవారికి కూడా వర్తింపజేస్తామంటూ బీజేపీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీని ఈ బడ్జెట్‌లో నెరవేర్చవచ్చని భావిస్తున్నారు. మహిళలకు కూడా ఈ పథకం క్రింద ఆరోగ్య సేవలను పెంచే అవకాశాలున్నాయి.
- ముద్రా యోజన పరిమితిని రూ.20 లక్షలకు పెంచడంతో పాటు సురక్షితం కాని ఎంఎస్ఎంఈ రుణాలను రూ.2 కోట్లనుంచి రూ.5 కోట్లకు పెంచవచ్చు. స్టార్టప్‌లపై ఆర్థిక భారం తగ్గించేందుకు మరిన్ని పన్ను రాయితీలు కల్పించవచ్చు.
- రియల్ ఎస్టేట్ రంగానికి పరిశ్రమ హోదా కల్పించి.. స్వదేశీ, విదేశీ సంస్థల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలను ప్రకటించే అవకాశాలు లేకపోలేదు. మెట్రో సిటీల్లో శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటుతో పాటు అందుబాటు ధరల్లో ఉండేలా గృహ నిర్మాణాన్ని ప్రోత్సహించే చర్యలు ప్రకటించవచ్చు.
- కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరల పెంపు, గిడ్డంగుల అభివృద్ధి, నీటి పారుదల ప్రాజెక్టులకు, ఆహారోత్పత్తుల పరిశ్రమలకు నిధుల పెంచే అవకాశాలున్నాయి.
- పునరుత్పాదక ఇంధన రంగానికి బడ్జెట్ లో నిధులు పెరగవచ్చని భావిస్తున్నారు. సోలార్, హైడ్రో, పవన విద్యుత్ ప్రాజెక్టులకు మరిన్ని ప్రోత్సాహకాలు కల్పించవచ్చు.
- విద్యారంగం, నైపుణ్య అభివృద్ధికి బడ్జెట్ లో కేటాయింపులు గణనీయంగా పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధికి, ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకోవచ్చని అంచనాలున్నాయి.

చిట్యాల-జగ్గయ్యపేట లైన్‌కు మోక్షం!


హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంలో ప్రతిపాదించిన పలు రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపులుంటాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా పలు కొత్త ప్రాంతాలను రైల్వేలైన్‌కు అనుసంధానం చేసేందుకు రూ.4,104 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన చిట్యాల-జగ్గయ్యపేట రైల్వేలైన్ పనులకు మోక్షం లభించే అవకాశం ఉంది. అలాగే 2,588 కి.మీ దూరానికి డబ్లింగ్, ట్రిప్లింగ్ తదితర అభివృద్ధి పనులతో పాటు మరో 11 ప్రాజెక్టులకు రూ.32,695 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది.

ఏపీ, బిహార్ కు బడ్జెట్ లో చేయూత!

సొంతంగా మెజారిటీ సాధించలేక.. లక్ష్యానికి అల్లంత దూరంలో నిలిచిపోయిన బీజేపీకి టీడీపీ, జేడీయూ అండగా నిలిచి మోదీ 3.0 సర్కారు ఏర్పడడంలో కీలకపాత్ర పోషించిన నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో ఏపీ, బిహార్‌కు ఆర్థికంగా చేయూతనిచ్చేలా కొన్ని ప్రకటనలు చేసే అవకాశాలున్నాయని అంచనా. చంద్రబాబు ఏపీ సమగ్రంగా కోలుకునేందుకు ఆర్థిక ప్రణాళికను ఆశిస్తుండగా, నితీశ్ కుమార్ బిహార్ లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. రెండు రాష్ట్రాలకూ లబ్ధిచేకూర్చేలా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక సహాయం, విదేశీ సహాయ ప్రాజెక్టులకు రుణాల చెల్లింపు ద్వారా మద్దతు, నిర్దిష్టమైన నష్టపరిహార ప్యాకేజీని రూపొందించేందుకు నిపుణుల కమిటీ నియామకంతో పాటు రైల్వే ప్రాజెక్టులకు నిధుల పెంపు వంటివాటికి బడ్జెట్‌లో చోటు ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రకటనల వల్ల ఏపీ ఆశిస్తున్న రాజధాని, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం మద్దతు ఉంటుందనే అంచనాలున్నాయి.

లోకం తీరు

కాంగ్రెస్ రాజకీయ 'పరాన్నజీవి'–నడ్డా



వీధి కుక్కలకు మైక్రోచిప్‌లు

పైలట్ ప్రాజెక్టుగా బెంగళూరులో అమలు

బీబీఎంపీ సిద్ధం.. సర్వత్రా విమర్శలు

బెంగళూరు, జూలై 21: బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) వీధి కుక్కలపై కీలక నిర్ణయం తీసుకుంది. వీధి కుక్కల్లో మైక్రోచిప్‌లు ఏర్పాటు చేసే ప్రక్రియను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించేందుకు సిద్ధమైంది. నగర పాలక సంస్థకు చెందిన పశుసంవర్ధక శాఖ అధికారులు దీన్ని ధ్రువీకరించారు. ఏడాదిలో ఒకే కుక్కకు అనేక సార్లు టీకాలు వేయకుండా ఈ మైక్రోచిప్ ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. ఈ ప్రణాళికను ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రకటించారు. ఇప్పుడు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. దీనిలో భాగంగా మూడు జోన్లలో 1000 వీధి కుక్కలకు మైక్రోచిప్‌లతో జియోట్యాగింగ్ చేయనున్నారు. వీటి కోసం రూ.5 లక్షలు ఖర్చవుతుందని బీబీఎంపీ తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా వీధి కుక్కలకు మెడ భాగంలో ఒక అంగుళం సైజు ఉండే మైక్రోచిప్‌ను అమర్చుతారు. స్కానర్ల సాయంతో దానిలోని వివరాలను స్కాన్ చేయవచ్చు. అయితే ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని పలువురు విమర్శిస్తున్నారు. జంతు హక్కుల కార్యకర్త సుజయ జగదీశ్ మైక్రోచిప్ అమర్చడాన్ని తప్పుబట్టారు. చాలా దేశాల్లో పెంపుడు కుక్కలకు చిప్‌లు అమర్చారు కానీ, ఇలా స్వేచ్ఛగా తిరిగే వీధికుక్కల్లో ఏర్పాటు చేయలేదని చెప్పారు. చిప్‌లు అమర్చే ప్రక్రియను సక్రమంగా చేయకపోతే కుక్కల్లో వెన్నెముక దెబ్బతింటుందని, అంటువ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మరో కార్యకర్త నవీన కామత్ కూడా.. మైక్రోచిప్‌లు కుక్కల శరీరంలోని నిర్దేశిత ప్రాంతం నుంచి పక్కకు జరిగితే ఆ తర్వాత వాటిని ఎవరు పర్యవేక్షిస్తారని, దీనివల్ల ప్రజాధనం వృథా తప్ప ఉపయోగం ఉండదని అన్నారు.

కేరళలో నిఫా వైరస్ సోకిన బాలుడి మృతి

కోజికోడ్‌లో పలువురి ఐసోలేషన్

- ప్రత్యేక బృందాన్ని పంపనున్న కేంద్రం



కోజికోడ్, జూలై 21 : కేరళలోని మలప్పురం జిల్లా పందిక్కడ్‌లో ప్రమాదకర నిఫా వైరస్ సోకిన 14 ఏళ్ల బాలుడు కోజికోడ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈమేరకు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ప్రకటించారు. ఆ బాలుడికి ఆదివారం ఉదయం 10.50 గంటలకు తీవ్ర గుండెపోటు వచ్చిందని, చికిత్స చేసి రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం అతడికి అంత్యక్రియలు జరుగుతాయన్నారు. ఆ బాలుడు చికిత్స పొందిన కోజికోడ్ వైద్య కళాశాలలో ముగ్గురు వ్యక్తులను ఐసొలేషన్‌లో ఉంచినట్లు మంత్రి చెప్పారు. అలాగే మంజేరి వైద్య కళాశాలలో నలుగురు హై రిస్క్ కేటగిరీలో ఉన్న వ్యక్తులు చేరారని, వారిలో ఒకరు ఐసీయూలో ఉన్నారని తెలిపారు. మృతి చెందిన బాలుడికి దగ్గరగా మసలిన 246 మందిలో 63 మందిని హై రిస్క్ కేటగిరీగా గుర్తించామన్నారు. వారందరికీ వైద్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో వారికి వైద్య పరీక్షలు చేసేందుకు తగిన ల్యాబ్‌లు ఉన్నాయని, అలాగే పుణె జాతీయ వైరాలజీ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఒక మొబైల్ ల్యాబ్ రానున్నట్లు మంత్రి చెప్పారు. నిఫా వైరస్ బయటపడిన పందిక్కడ్‌తోపాటు రెండు పంచాయతీల్లోని 33,000 ఇళ్లలో జ్వరాలపై పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. పందిక్కడ్‌కు మూడు కిలోమీటర్ల వరకు ఆంక్షలు విధించినట్లు తెలిపారు. ఆస్ట్రేలియా నుంచి తెప్పించి పుణె వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో భద్రపరచిన మోనోక్లోనల్ యాంటీబాడీలు కూడా రాష్ట్రానికి చేరినట్లు మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు. కాగా కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని పంపనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. నిఫా వైరస్ ప్రబలిన ప్రాంతంలో అందుకు కారణాలను గుర్తించేందుకు ఈ బృందం సహకరిస్తుంది. కోజికోడ్‌లో చనిపోయిన బాలుడి నమూనాలను పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపగా నిఫా వైరస్‌గా నిర్ధారించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. చనిపోయిన బాలుడికి దగ్గరగా మసలిన వారిని గుర్తించి కచ్చితంగా క్వారంటైన్ చేయాల్సిందిగా కేరళ ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపింది. గబ్బిలాల్లో(ఫ్రూట్ బ్యాట్) నిఫా వైరస్ ఉంటుంది. అవి తగిలిన చెట్ల పండ్లను తిన్న వారికి ఈ వైరస్ సోకుతోంది. కేరళలో కోజికోడ్ జిల్లాలో 2018, 2021, 2023లో, ఎర్నాకుళం జిల్లాలో 2019లో నిఫా వైరస్ ప్రబలింది. కోజికోడ్, వయనాడ్, ఇడుక్కి, మలప్పురం, ఎర్నాకుళం జిల్లాల్లోని గబ్బిలాల్లో నిఫా వైరస్ యాంటీ బాడీలను గుర్తించారు.

గుజరాత్‌ను వణికిస్తున్న చాందీపుర వైరస్

అహ్మదాబాద్, జూలై 21: చాందీపుర వైరస్ గుజరాత్‌ను వణికిస్తోంది. రాష్ట్రంలో 50 చాందీపుర వైరస్ కేసులు, ఈ వైరస్ అనుమానిత లక్షణాలతో 16 మంది మృతిచెందారని గుజరాత్ ఆరోగ్యశాఖ మంత్రి రుషికేశ్ పటేల్ వెల్లడించారు. సబర్ కాంత జిల్లాలోని హిమ్మత్‌పూర్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇప్పటి వరకు ఇక్కడ 14 చాందీపుర వైరస్ కేసులు నమోదవగా వారిలో ఏడుగురిని ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందని చెప్పారు. గుజరాత్ వెలుపల కూడా ఈ వైరస్ కేసులు మూడు కనిపించాయని, దీంతో ఈ వైరస్ కేసులు ఇతర రాష్ట్రాలకూ వ్యాపించిందని పటేల్ పేర్కొన్నారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆరోగ్యశాఖను అప్రమత్తం చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కూడా చాందీపుర వైరస్ పరిస్థితిని సమీక్షించారు. జిల్లాల్లో మలాథియాన్ పౌడర్‌ను పిచికారీ చేయాలని ఆదేశించారు. తొలిసారిగా 1966లో మహారాష్ట్రలోని చాందీపురలో గుర్తించారు. ఇది 15 ఏళ్లలోపు పిల్లల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. దీని వల్ల మెదడువాపు సంభవిస్తుంటుంది. ఈ వైరస్ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

ఉద్యోగాల భర్తీలో కోటాల రద్దు

విద్యార్థుల నిరసన నేపథ్యంలో బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు సంచలన తీర్పు

- రిజర్వేషన్లు 56 శాతం నుంచి 7 శాతానికి తగ్గింపు
- ఓపెన్ క్యాటగిరీలో 93% ఉద్యోగాలు



బంగ్లాదేశ్‌లో ఓ పోలీసుపై నిరసనకారుల దాడి

ఢాకా, అగర్తల, జూలై 21: బంగ్లాదేశ్ వ్యాప్తంగా తీవ్ర హింసాకాండకు దారి తీసిన రిజర్వేషన్లపై ఆ దేశ సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. మహిళలు, వెనుకబడిన జిల్లాలకు ఇస్తున్న రిజర్వేషన్లను పూర్తిగా తొలగించటమేగాక.. సమరయోధుల కుటుంబీకులకు ఇస్తున్న 30% రిజర్వేషన్‌ను 5 శాతానికి తగ్గించింది. మైనారిటీలకు, దివ్యాంగుల కోటాను కేవలం 2 శాతానికి పరిమితం చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలలో 93% ఖాళీలను ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలని, మిగిలిన 7 శాతంలో 5% సమర యోధుల కుటుంబాలకు, 2% దేశంలోని మైనారిటీలు, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు కేటాయించాలని ఆదివారం తీర్పు చెప్పింది. కోటాల రద్దు కోసం విద్యార్థుల ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న విద్యార్థి సంఘాలు సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూనే, రిజరేషన్లను పూర్తిగా రద్దు చేసే వరకూ తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించాయి. మరోవైపు, దేశంలో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని షేక్‌హసీనా ఆదివారం త్రివిధ దళాల అధిపతులతో సమీక్ష జరిపారు.

గతంలోనూ తీవ్ర వ్యతిరేకత

బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో 44 శాతం ఉద్యోగాలను ఓపెన్ క్యాటగిరీలో భర్తీ చేస్తుండగా, సమరయోధుల కుటుంబాలకు 30 శాతం, మహిళలకు 10 శాతం, వెనుకబడిన జిల్లాలకు 10 శాతం, మైనారిటీలకు 5 శాతం, దివ్యాంగులకు 1 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారు. అయితే, స్వాతంత్ర్య సమరయోధుల కోటా రద్దు కోసం విద్యార్థులు 2018లో పెద్ద ఎత్తున ఉద్యమించారు. బంగ్లాదేశ్ విముక్తి యుద్ధాన్ని నిర్వహించిన అవామీలీగ్ పార్టీ (ప్రస్తుత అధికారపక్షం) మద్దతుదారులకు అనుచిత లబ్ధి కలిగించటానికే సమరయోధుల కోటాను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అన్ని కోటాలనూ తొలగించి ప్రతిభ ఆధారంగా ఉద్యోగాల భర్తీని చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్ల అమలును నిలిపివేశారు. అయితే, గత నెలలో రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ హైకోర్టు తీర్పునివ్వటంతో మరోసారి నిరసనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా చోటుచేసుకున్న హింసాకాండలో దాదాపు 103 మంది మరణించారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో.. సరిహద్దుల వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న బీఎస్ఎఫ్ హై అలర్ట్‌లో ఉంది. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్ నుంచి 4,500 మంది భారత విద్యార్థులు స్వదేశానికి చేరుకున్నారు.

బంగ్లా శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తాం: మమత



కోల్‌కతా, జూలై 21: బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనల నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చే శరణార్థులకు రాష్ట్రంలో ఆశ్రయం కల్పిస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమత ప్రకటించారు. ఆదివారం కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన అమరవీరుల స్మారక దినోత్సవ మెగా ర్యాలీలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై వారు విమర్శలు గుప్పించారు. బెదిరింపుల ద్వారా అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని జోస్యం చెప్పారు. కాగా, బంగ్లాదేశ్ శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తామన్న మమత ప్రకటనను కేంద్రం ఖండించింది. ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని స్పష్టం చేసింది. మమత ప్రకటన బంగ్లాదేశ్ అక్రమ వలసదారులకు పశ్చిమబెంగాల్ నుంచి ఝార్ఖండ్ దాకా ఆశ్రయం కల్పించి ఎన్నికల్లో గెలవాలన్న ఇండియా కూటమి కుట్రలో భాగమేనని బీజేపీ ఆరోపించింది. మరోవైపు, "బెంగాల్- హిందూస్థాన్ మధ్య సత్సంబంధాలనే కోరుకుంటున్నా" అంటూ మమత చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం సృష్టిస్తున్నాయి. "భారతదేశంలో పశ్చిమ బెంగాల్ భాగం కాదని మమతా బెనర్జీ భావిస్తున్నారా" అంటూ బీజేపీ నేత నళిన్ కోహ్లీ ప్రశ్నించారు.

భూమికి చంద్రునికి మధ్య సూపర్‌హైవే!

30 ఉపగ్రహాలు.. 3 లునార్ గ్రౌండ్ స్టేషన్లతో చైనా కమ్యూనికేషన్ నెట్‌వర్క్

బీజింగ్, జూలై 21: భూమికి, చంద్రుడికి మధ్య నెట్‌వర్క్‌ను పెంచేలా, అంతరిక్ష ప్రయాణాన్ని సులభతరం చేసే దిశగా చైనా రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. కమ్యూనికేషన్ సూపర్ హైవే ద్వారా భూమిని చంద్రుడితో అనుసంధానం చేయాలని ఆ దేశం భావిస్తోంది. చైనా అకాడమీ ఆఫ్ స్పేస్ టెక్నాలజీ (సీఏఎస్‌టీ), బీజింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్‌క్రాఫ్ట్ సిస్టమ్ ఇంజనీరింగ్స్ పరిశోధకులు దీనికోసం కృషి చేస్తున్నారు. వారు ప్రతిపాదించిన ఈ సూపర్‌హైవే నెట్‌వర్క్‌లో 30 ఉపగ్రహాలతోపాటు భూమి, చంద్రుడికి మధ్య రియల్‌టైమ్ పర్యవేక్షణకు మూడు లునార్ గ్రౌండ్ స్టేషన్లు ఉంటాయి. వీటి ద్వారా.. ఆడియో గానీ, ఫొటోలు గానీ, వీడియోలు గానీ 20 లేదా అంతకంటే ఎక్కువ మంది అంతరిక్ష ప్రయాణికులు ఏకకాలంలో భూమిపై ఉన్న వారితో కమ్యూనికేషన్ చేసేలా చేయడం ఈ సూపర్‌హైవే సృష్టి ఉద్దేశం. వ్యోమనౌక భూమి, చంద్రుడి మధ్య ప్రయాణిస్తున్నప్పుడు జాబిల్లిపై జరిగే ఉపరితల కార్యకలాపాలను ఈ నెట్‌వర్క్ ద్వారా కచ్చితమైన స్థానం, నావిగేషన్, టైమింగ్‌తో సహా పొందవచ్చు. భూమికి, చంద్రుడికి మధ్య ఉన్న సిస్ లునార్ స్పేస్‌లో చిన్నగా ఒక మీటరు పరిమాణంలో ఉండే కదిలే లక్ష్యాలను కూడా ఈ నెట్‌వర్క్ పర్యవేక్షించగలదని ఈ ఏడాది జూన్‌లో వెలువడిన చైనీస్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌లో పరిశోధకులు వెల్లడించారు. మానవ కార్యకలాపాలకు సిస్ లునార్ స్పేస్ కొత్త సరిహద్దుగా మారిందని చాంగ్స్-5 మిషన్ డైరెక్టర్ యాంగ్ మోంగ్‌ఫీ తెలిపారు.


6 రాష్ట్రాల్లో వానలు.. 9 రాష్ట్రాల్లో కరువు

దేశంలో చిత్రమైన వాతావరణ పరిస్థితులు

న్యూఢిల్లీ, జూలై 21: దేశంలో ఈ ఏడాది చిత్రమైన వాతావరణం కనిపిస్తోంది. జూన్-జూలై మధ్యకాలంలో కొన్ని రాష్ట్రాల్లో అతివృష్టి, మరికొన్ని రాష్ట్రాల్లో అనావృష్టి ఏర్పడింది. ఉత్తరాది సహా 9 రాష్ట్రాల్లో లోటు వర్షపాతం నమోదుకాగా, తమిళనాడు సహా 6 ఆరు రాష్ట్రాల్లో కుంభవృష్టిగా వానలు కురుస్తున్నాయి. ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణ, ఒడిశా, బిహార్ సహా తొమ్మిది రాష్ట్రాల్లో 20 నుంచి 49% మేరకు లోటు వర్షపాతం నమోదైంది. ఝార్ఖండ్‌లో అత్యధికంగా 49% లోటు వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. అదేసమయంలో నాలుగు దక్షిణాది రాష్ట్రాలు సహా మొత్తం ఆరు రాష్ట్రాల్లో అత్యధిక వర్షాలు కురిసినట్టు తెలిపారు. జూన్ 1 నుంచి జూలై 20వ తేదీ వరకు అందిన సమాచారం మేరకు తమిళనాడులో సాధారణ వర్షాలకంటే 83 శాతం ఎక్కువగా కురిశాయి. ఇక, దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో 1% మేరకు లోటు వర్షపాతం నమోదైంది. వాయవ్య రాష్ట్రాల్లో 14%, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో 12% లోటు వర్షపాతం నమోదైనట్టు అధికారులు వివరించారు. ప్రాంతాల వారీగా చూస్తే మధ్య భారతంలో లోటు తగ్గింది. దక్షిణాది రాష్ట్రాలలో ఇప్పటి వరకు సాధారణం కన్నా 26 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దక్షిణాదిలో కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మెరుగుపడవచ్చని తెలిపింది. కాగా, వర్షాభావ పరిస్థితులతో పలు రాష్ట్రాల్లో కొత్త సాగు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు.

కావడి యాత్ర మార్గంలో పేర్లపై యోగిది తొందరపాటు నిర్ణయం

- బీజేపీ మిత్రపక్షమైన ఆర్‌ఎల్‌డీ పార్టీ అధినేత జయంత్ చౌధరి ఆక్షేపణ
- ఇప్పటికే జేడీయూ, ఎల్జేపీ అభ్యంతరం



ముజఫర్‌నగర్(యూపీ), జూలై 21: ఉత్తరప్రదేశ్‌లో కావడి యాత్ర సాగే మార్గంలో అన్ని తినుబండారాల దుకాణాలపై వాటి యజమానుల పేర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కూడా తప్పుబడుతున్నాయి. ఈ నిర్ణయాన్ని ఇప్పటికే జేడీయూ, ఎల్‌జేపీ వ్యతిరేకించగా.. తాజాగా ఆర్‌ఎల్‌డీ అధినేత, కేంద్ర మంత్రి జయంత్ చౌధరి కూడా గళం కలిపారు. కావడి యాత్ర ఏ మతానికో, కులానికో సంబంధించింది కాదని ఆదివారమిక్కడ తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఏ మాత్రం ఆలోచించకుండా నిర్ణయం తీసుకున్నట్లు కనబడుతోందన్నారు. సోమవారం యాత్ర మొదలవుతోందని.. ఇంకా సమయం మించిపోలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అయితే యోగా గురువు రాందేవ్ బాబా ఈ నిర్ణయాన్ని గట్టిగా సమర్థించారు. 'తానెవరో చెప్పడానికి రాందేవ్ బాబాకు ఎలాంటి సమస్యా లేదు. మరి రెహమాన్‌కు ఇబ్బందేంటి? ఎవరూ పేరు దాచుకోవలసిన అవసరం లేదు. తమ పేర్లను ప్రదర్శించి గర్వపడాలి' అని పేర్కొన్నారు. ఓవైపు కావడి యాత్ర వివాదం కొనసాగుతుండగా.. మధ్యప్రదేశ్‌లో ప్రాచీన నగరమైన ఉజ్జయినిలో కూడా షాపుల యజమానులు తమ పేర్లు, మొబైల్ నంబర్లతో కూడిన నేమ్ ప్లేట్లు ప్రదర్శించాలని నగర మేయర్ ముకేశ్ టట్వాల్ ఆదేశించారు. దీనిని మొదటిసారి ఉల్లంఘించినవారికి రూ.2 వేలు, మళ్లీ చేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

27 మంది భారతీయులకు సైబర్ ఉచ్చు నుంచి విముక్తి

- కాంబోడియాలో 14.. లావోస్‌లో 13 మందిని కాపాడిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ, జూలై 21: ఉద్యోగాల పేరుతో సైబర్ నేరాలు చేయించే చైనా ముఠాలకు చిక్కిన మరో 27 మంది భారతీయులను విదేశాంగ శాఖ కాపాడింది. కాంబోడియాలో 14 మంది, లావోస్‌లో మరో 13 మందిని కాపాడినట్లు ఆయా దేశాల్లోని భారత రాయబారులు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. ఇప్పటి వరకు 650 మంది బాధిత భారతీయులను సురక్షితంగా స్వదేశానికి పంపినట్లు కాంబోడియాలోని రాయబార కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది. 518 మంది భారతీయులను సైబర్ నేరాల ముఠాల ఉచ్చునుంచి రక్షించినట్లు లావోస్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. చైనాకు చెందిన సైబర్ ముఠాలు భారతీయులకు ఉద్యోగాల ఎరవేసి.. కాంబోడియా, లావోస్ వంటి దేశాలకు తరలించి అక్కడ వీరి పాస్‌పోర్టులను లాక్కొని, సైబర్ నేరాలు చేయిస్తున్నాయి.

పొలిటికల్ కార్టూనిస్టులు కనుమరుగయ్యే ముప్పు

» తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

» నర్సింకు కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డు ప్రదానం



కార్టూనిస్ట్ పి.నర్సింకు కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డును అందజేస్తున్న మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

పంజాగుట్ట, జూలై 21(ఆంధ్రజ్యోతి): పొలిటికల్ కార్టూన్లు, కార్టూనిస్టుల వృత్తి అంతరించి పోయే ప్రమాదం ఉందని మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఒకప్పుడు పత్రికల్లో కార్టూన్లు మొదటి పేజీలో వచ్చేవని, ప్రస్తుతం లోపలి పేజీల్లోకి పోయాయని తెలిపారు. పొలిటికల్ కార్టూన్లు, కార్టూనిస్టులను కాపాడుకోవాలన్నారు. కార్టూనిస్ట్ శేఖర్ మిత్రులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డు-2024 ప్రదానోత్సవ సభ జరిగింది. ప్రముఖ కార్టూనిస్ట్ పి.నర్సింకు కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డును కె.శ్రీనివాస్‌రెడ్డి.. జర్నలిస్ట్, కవి ప్రసేన్, విమలక్క, మాజీ సంపాదకుడు ఎస్.వీరయ్య, చంద్రకళా శేఖర్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ భూమి సమస్యకు సంబంధించిన ఫైల్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంతకం పెట్టారని, ఇంకో 3 వేల పైచిలుకు మంది జర్నలిస్టులుంటారని, వారికి నగరం నలు వైపులా స్థలం కేటాయించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదన్నారు. మీడియా అక్రెడిటేషన్ గౌరవం పెంచుతామని, ఎవరికి పడితే వారికి అక్రెడిటేషన్ ఇవ్వబోమని అన్నారు. అక్రెడిటేషన్ల మార్గదర్శకాల కోసం త్వరలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బాత్‌రూమ్‌లో శవాలై కనిపించారు...

» హైదరాబాద్‌లో ఓ కుటుంబం అనుమానాస్పద మృతి



వెంకటేష్ కుటుంబం (ఫైల్)

బంజారాహిల్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏం జరిగిందో ఏమో.. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబంలోని ముగ్గురు తమ ఇంటి బాత్‌రూమ్‌లోనే శవాలై కనిపించారు. సనత్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన వెలుగు చూసింది. బెంగళూరుకు చెందిన ఆర్.వెంకటేష్ (59), తన భార్య మాధవి(52), కుమారుడు హరికృష్ణ(25)తో కలిసి కొన్నేళ్లుగా హైదరాబాద్, సనత్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. వెంకటేష్ సైనోడ్ అనే సంస్థలో బిజినెస్ యూనిట్ హెడ్‌గా పని చేస్తుంటారు. అయితే, వారి ఇంటి పనులు చేసే వరలక్ష్మి ఎప్పట్లాగే ఆదివారం ఉదయం కూడా రాగా ఫ్లాట్ తలుపు తీసి ఉండగా ఇంట్లో ఎవరూ కనిపించలేదు. వెంకటేష్, కుటుంబసభ్యులు గదిలో ఉన్నారని భావించిన వరలక్ష్మి వంట గదిలోకి వెళ్లి పని చేసి వెళ్లిపోయింది. మళ్లీ సాయంత్రం రాగా ఎవరూ కనిపించకపోవడంతో ఇల్లంతా వెతికి వెళ్లిపోయింది. కాసేపటి తర్వాత అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్, మరికొందరితో కలిసి వచ్చిన వరలక్ష్మి.. బాత్‌రూమ్ తలుపు బలవంతంగా తెరిచి చూడగా వెంకటేష్, మాధవి, హరికృష్ణ విగతజీవులుగా పడి ఉన్నారు. హరికృష్ణ శరీరంపై దుస్తులు లేవు. పోలీసుల ఆధారాలు సేకరించారు. కాగా, హరికృష్ణ మానసిక స్థితి సరిగా లేకపోవడంతో తల్లిదండ్రులే అతనికి స్నానం చేయిస్తుంటారని తెలిసింది. హరికృష్ణకు స్నానం చేయించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మరణించి ఉంటారని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.





మహంకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న దృశ్యం

ఘనంగా లష్కర్ బోనాలు

» మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

» తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం

» అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

హైదరాబాద్ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. నెత్తిన బోనమెత్తి వచ్చిన ఆడబిడ్డలు, అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో లష్కర్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. తెల్లవారుజామునుంచే మహాకాళి అమ్మవారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. లష్కర్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో తెల్లవారుజామున 3.30 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్తల కుటుంబానికి చెందిన సురిటి రామేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు అమ్మవారికి బంగారు బోనం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 8.45 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని కోరుకున్నానని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి పూజలు చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే అమ్మవారికి ఘనంగా బోనం సమర్పిస్తానని మొక్కుకున్నానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు.

దేశంలో ఏటా లక్ష మంది మహిళల మిస్సింగ్

» ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్‌పర్సన్ విజయభారతి

పరిగి, జూలై 21: దేశంలో ఏటా లక్ష మంది అమ్మాయిలు, మహిళలు కనిపించకుండా పోతున్నారని జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ) ఛైర్‌పర్సన్ విజయభారతి తెలిపారు. ఈ కేసుల పరిష్కారానికి ఎన్‌హెచ్‌ఆర్సీ పని చేస్తోందని, ప్రభుత్వ వర్గాలు పట్టించుకోకున్నా బాధితులకు బాసటగా నిలుస్తోందన్నారు. ఈ మిస్సింగ్ కేసులకు సంబంధించి అన్నిరాష్ట్రాల ప్రభుత్వ కార్యదర్శులకు పూర్తిస్థాయి నివేదికలు పంపాలని ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఆదివారం పరిగిలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో మాతృభూమి ఫౌండేషన్, ప్రముఖ రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూర్ణిమ మహోత్సవానికి విజయభారతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. దేశంలో అణగారిన వర్గాల హక్కులపై అణచివేత ధోరణి ఇంకా కొనసాగుతోందని, పశ్చిమబెంగాల్‌లో వివక్ష ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వివక్షకు సంబంధించి రోజుకు 500 లకుపైగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. డాక్టర్ భాస్కరయోగి రాసిన 'మన పండుగలు' పుస్తకాన్ని ఈ సందర్భంగా విజయభారతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, జిల్లా అధ్యక్షుడు కె.మాధవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతల గుర్తింపునకు యాప్!

ఫొటో తీసి అప్‌లోడ్ చేయగానే మరమ్మతులు.. తొలుత జీహెచ్‌ఎంసీలోనే అమలుకు యోచన

» ఆ తర్వాత మునిసిపాలిటీల్లో

» ఇప్పటికే ఒక యాప్‌ను తీసుకొచ్చిన కర్ణాటక సర్కార్

» అధ్యయనానికి అధికారులను పంపనున్న ఆర్అండ్‌బీ

» మరింత పకడ్బందీగా యాప్‌ను తీసుకొచ్చేందుకు కసరత్తు



హైదరాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రహదారులపై గుంతలను గుర్తించడంతోపాటు సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేపట్టడంపై రోడ్లు, భవనాల శాఖ దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇందుకు సాంకేతిక అంశాలపై కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. రహదారులపై గుంతల గుర్తింపు, వాటి మరమ్మత్తులకు సంబంధించి ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం ఒక యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఆ యాప్ ఎలా పనిచేస్తుంది, అమలు విధానం ఎలా ఉంది? వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు శాఖ నుంచి అధికారుల బృందాన్ని ఆ రాష్ట్రానికి పంపాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. రోడ్లపై గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఆ ప్రమాదాల్లో మరణిస్తున్నవారికి పరిహారం సరిగా అందడంలేదని, రహదారి భద్రతపై సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఇటీవల హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. రోడ్లపై గుంతల సమస్య పరిష్కారానికి ఓ యాప్‌ను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ యాప్ విధానం ఇప్పటికే కర్ణాటకలో అమలవుతోందని వెల్లడించింది. ఈ క్రమంలోనే అప్రమత్తమైన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ సమస్య పరిష్కారానికి యాప్‌ను తీసుకువచ్చే పనిలో నిమగ్నమైంది. ఇదే విషయాన్ని త్వరలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిసింది.

ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే చాలు..

కర్ణాటక ప్రభుత్వం ఒక యాప్‌ను తీసుకొచ్చింది. గుంత ఉన్న ప్రదేశాన్ని ఫొటో తీసి అందులో అప్‌లోడ్ చేస్తే సంబంధిత శాఖ మరమ్మతుకు చర్యలు తీసుకుంటుంది. ఒక వేళ ఆ పనులు ఆలస్యమైతే.. కారణాలను పొందుపర్చేలా యాప్‌ను రూపొందించారు. ఈ క్రమంలో రాష్ట్రంలోనూ మరింత పకడ్బందీగా యాప్‌ను రూపొందించాలని ఆర్అండ్‌బీ అధికారులు నిర్ణయించారు. గుంత ఉన్న ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయగానే గుంత ఉన్న ప్రాంతం, అది ఏ అధికారి పరిధిలోకి వస్తుంది, ఆ రహదారి పూర్తి వివరాలు వెంటనే డిస్‌ప్లే అయ్యేలా యాప్‌ను రూపొందించనున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా యాప్‌ను తీర్చిదిద్దనున్నారు. పనులు పూర్తయ్యాక సదరు కాంట్రాక్టర్లు బిల్లుల కోసం తిరిగే పని లేకుండా.. యాప్‌లో వివరాలు పొందుపర్చగానే చెల్లించేందుకు వీలవుతుందా? లేదా? అని కసరత్తు చేస్తున్నారు.

తొలుత జీహెచ్‌ఎంసీలో..

యాప్‌ను తొలుత జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలు చేయాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, ఆర్ అండ్ బీ రోడ్ల పరిధిలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో 28,278 కి.మీ. మేర రోడ్లు ఉన్నాయి. ఇవి కాక పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోనూ ఉన్నాయి. ఈ యాప్‌ను రోడ్లు, భవనాల శాఖ పరిధిలోనే అమలు చేస్తారా? లేదా అన్ని రోడ్లను అందులో నమోదు చేసి.. శాఖల వారీగా విభజిస్తుందా? అన్నది తెలియాల్సి ఉంది.

శునకంపై కర్కశం!

» ద్విచక్రవాహనానికి కట్టి లాక్కెళ్లిన వ్యక్తి

» ఉడుపి జిల్లాలో దారుణం.. పోలీసులకు ఫిర్యాదు



బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లాలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనానికి కుక్కను కట్టి లాక్కెళ్లడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జంతు ప్రేమికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఉడుపి జిల్లా కాపు తాలూకా శిర్వాలో శనివారం ఈ ఘటన జరిగింది. కుక్కను ద్విచక్రవాహనానికి కట్టుకుని సుమారు 6 కిలోమీటర్ల మేర లాక్కెళ్లిన వ్యక్తిని అబ్దుల్‌ఖాదర్‌గా గుర్తించారు. శిర్వా గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుటే ఈ సంఘటన జరిగింది. ప్రాణిదయా సంఘం సభ్యురాలు మంజుల కర్కేరా ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలను కాపు తాలూకా పోలీసులకు సమర్పించి, ఫిర్యాదు చేశారు. కుక్కను సెయింట్ మేరీస్ జంక్షన్ నుంచి మంచకల్ దాకా లాక్కెళ్లినట్టుగా ఆ వీడియోల్లో రికార్డైంది. ఈ ఘటన అమానుషమని, కుక్కకు తీవ్ర గాయాలైనట్టు మంజుల పేర్కొన్నారు. కుక్కను చంపేందుకే ఇలా లాక్కెళ్లారని, ఆ వ్యక్తి అమానవీయంగా వ్యవహరించాడని, హెల్మెట్ లేకుండా వాహనం నడిపాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రీల్స్ మోజు.. యువకుడి బలి

» బైక్‌పై స్టంట్లు చేస్తూ జారి పడి మృతి

» మరొకరికి గాయాలు.. పెద్ద అంబర్‌పేట్‌లో ఘటన

హయత్‌నగర్, జూలై 21 (ఆంధ్ర జ్యోతి): ఆ యువకుల ఇన్‌స్టా రీల్స్ మోజు వారి తల్లిదండ్రులకు తీవ్ర శోకం మిగిల్చింది. వర్షంలో బైక్‌పై స్టంట్లు చేస్తూ జారిపడి ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ శివారు పెద్ద అంబర్‌పేటలో ఈ ఘటన జరిగింది. వరంగల్ జిల్లా వర్దన్నపేట మండలం కోనాపురం గ్రామానికి చెందిన మేడ శివ (18) దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో అతడు తన స్నేహితుడు సంపత్‌తో కలిసి పెద్ద అంబర్‌పేట్ జేసీబీ జంక్షన్‌లో రీల్స్ కోసం కేటీఎం బైక్‌పై స్టంట్లు చేస్తున్నాడు. వీరి స్టంట్లను మరో బైక్‌పై నుంచి వారి స్నేహితులు వీడియో తీస్తున్నారు. ఈ క్రమంలో అదుపుతప్పి జారి కిందపడగా వెనుక కూర్చున్న శివ తలకు దెబ్బతగలడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న సంపత్‌కు తీవ్రగాయాలవడంతో స్నేహితులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శివ మృతి చెందిన విషయం తెలియడంతో అతని తల్లిదండ్రులు సంఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

2050 నాటికి భారత్‌లో వృద్ధులు డబుల్

» హెల్త్ కేర్, హౌసింగ్, పెన్షన్ రంగాల్లో మరింత పెట్టుబడి పెట్టాలి: యూఎన్ఎఫ్‌పీఏ



న్యూఢిల్లీ, జూలై 21: దేశంలో 2050 నాటికి వృద్ధుల సంఖ్య రెట్టింపు కావచ్చని ఐక్యరాజ్య సమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) భారత్ చీఫ్ ఆండ్రియా వోజ్నర్ అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని హెల్త్ కేర్, హౌసింగ్, పెన్షన్ రంగాల్లో మరింత పెట్టుబడి పెట్టాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఓ జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధిని వేగవంతం చేసేందుకు భారత్ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న ఒంటరి వృద్ధుల సంఖ్య 2050 నాటికి 346 మిలియన్లకు చేరుకోవచ్చన్నారు. భారత్‌లో గణనీయ సంఖ్యలో యువత ఉన్నారని, 10-19 ఏళ్ల వారు 252 మిలియన్ల మంది ఉన్నారని తెలిపారు. 2050 నాటికి భారత్‌లో 50 శాతం మంది పట్టణాల్లో ఉంటారని పేర్కొన్నారు.

కారు సరిగా నడపమన్నందుకు మహిళపై దాడి

» ముక్కుపై పిడిగుద్దులు గుద్దిన దుండగుడు... పుణెలో ఘటన

పుణె, జూలై 21: కారు సరిగ్గా నడపమని చెప్పినందుకు ఓ మహిళపై వీరావేశంతో రెచ్చిపోయాడో 57 ఏళ్ల పెద్ద మనిషి. ఆ మహిళ ముక్కుపై రక్తం వచ్చేదాకా పిడిగుద్దులు గుద్దాడు. దీనికితోడు అతని భార్య కూడా ఆమెపై చెయ్యి చేసుకుంది. ఈ ఘటన శనివారం పుణెలో జరిగింది. బాధితురాలు జెర్లిన్ డిసిల్వా తనపై జరిగిన దాడి గురించి సోషల్ మీడియాలో పంచుకోవడంతో వైరల్‌గా మారింది. "నేను నా ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం బనెర్ వైపు వెళ్తున్నాను. అయితే మా వాహనాన్ని ముందుకు వెళ్లనివ్వకుండా ఓ కారు అడ్డంపడుతుండటంతో... కారు నడుపుతున్న వ్యక్తికి సరిగా కారు నడపమని చెప్పాను అంతే! వెంటనే కారు అద్దం దించి నన్ను దూషించాడు. నేను వెళ్లిపోతున్నా సరే... వెంబడించి మా వాహనం రోడ్డు పక్కన ఆపేలా చేశాడు. అటుపై కారులోంచి దిగి నాపై దారుణంగా పిడి గుద్దులు గుద్దాడు. అతను పారిపోబోతుండగా... కారు తాళంచెవి తీసుకోవడానికి యత్నించాను. అప్పుడు అతని భార్య కూడా నాపై దాడి చేసింద"ని డిసిల్వా వీడియోలో వివరించారు. అనంతరం రోడ్డుపై వెళ్తున్నవారు కలుగజేసుకొని డిసిల్వాను ఆస్పత్రిలో చేర్పించారు. చతుశృంగి పోలీసులు దాడి చేసిన భార్యాభర్తలపై భారత న్యాయ

అనుమానం పెనుభూతమై..

» భార్యను, చంటిబిడ్డను హతమార్చిన భర్త.. ఆపై ఆత్మహత్య



గణేశ్, స్వప్న దంపతులు (ఫైల్)

బోయిన్‌పల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం.. ఆపై ఆర్థిక ఇబ్బందులతో సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో ఓ భర్త భార్యను, ఊయాలలో నిద్రిస్తున్న తన 11 నెలల కన్న కూతురిని ప్లాస్టిక్ వైర్‌తో ఉరేసి చంపి.. ఆపై తానూ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మహారాష్ట్ర నాందేడ్ డెగ్లూర్‌కు చెందిన గణేశ్ సంగ్రామ్ కొలనూరె(34) తన భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు త్రివేణి(6), తనుశ్రీ(4)తో కలిసి రెండున్నర సంవత్సరాల క్రితం సికింద్రాబాద్‌కు వచ్చి బోయిన్‌పల్లిలోని ఓ ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్నాడు. గణేశ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 11 నెలల క్రితం వారికి నక్షత్ర అనే పాప జన్మించింది. నక్షత్ర విషయంలో భార్యాభర్తల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం తెల్లవారు జామున అందరూ నిద్రిస్తున్న సమయంలో భార్య స్వప్నతో పాటు పసికందు నక్షత్రను ప్లాస్టిక్ కేబుల్ వైరుతో దారుణంగా హత్యచేశాడు. అనంతరం బోయిన్‌పల్లిలో ఉన్న రైలుపట్టాల వద్దకు వెళ్లి పోలీసులకు ఫోన్‌చేసి తాను తన భార్య, కూతురిని హత్య చేశానని తెలిపాడు. వారు వివరాలు అడిగేలోపే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అటుగా వస్తున్న ఓ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు వెంటనే గణేశ్ ఇంటికి వెళ్లి చూడగా అతని భార్యతోపాటు 11 నెలల చిన్నారి నక్షత్ర చనిపోయి కనిపించారు. స్వప్న, చిన్నారి మృతదేహాలతో పాటు గణేశ్ మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనాథలైన గణేశ్, స్వప్న దంపతుల మరో ఇద్దరు కూతుళ్లు త్రివేణి, తనుశ్రీని వారి బంధువులకు అప్పగించారు.

వైద్యం కోసం వచ్చి విగత జీవులై..

» రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు మృతి


» నలుగురికి తీవ్ర గాయాలు.. ఖమ్మం జిల్లాలో ఘటన

» మృతులు ఎన్‌టీఆర్ జిల్లా వాసులు

చింతకాని, జూలై 21: వైద్యం కోసం ఖమ్మం వచ్చి.. చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా అనూహ్యంగా దూసుకొచ్చిన కారు వారిపాలిట మృత్యుశకటమైంది. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో జగన్నాథపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామానికి చెందిన కరిసే సుజాత అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స అనంతరం ఆదివారం కుటుంబసభ్యులంతా ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో చింతకాని మండలం జగన్నాథపురం దాటిన తరువాత ఎదురుగా వచ్చిన కారు బలంగా ఢీకొనడంతో వారు ప్రయాణిస్తున్న ఆటో రోడ్డు పక్కకు ఎగిరి పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు చెల్లాచెదురుగా పడిపోయారు. పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ఉన్న కరిసే వెంకటరత్నం(50) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ చెరుకుపల్లి హైమావతి(45) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆటోడ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మృతి చెందిన వెంకటరత్నం, హైమావతి వరుసకు అన్నాచెల్లెల్లు.

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్



అద్భుతమైన ముద్దు

ఓ నా ప్రియమైన సహ యాత్రికుడా
ఎడారిలో దప్పిగొన్న బాటసారినై
నేను నీ వలే, మృగతృష్ణ చెంత నిలిచి కనే
పగటికలలను నీ స్వప్నంలో దర్శించు

వీలైతే ఒక అద్భుతమైన
ప్రేమగల ముద్దును, జీవితేచ్ఛను
సుగంధ పుష్పాన్ని చేసి
నేను నిదురించే సమయాన
నా చెంత విడిచి వెళ్ళు

నా నుదుటిపై ప్రేమగా ముద్దుపెట్టు
వేదనామయ పురా జ్ఞాపకాల
మరుభూముల ఎడారైన నా శిరస్సుపై
హిమనదులు ప్రవహించి
కొత్త ఆశలు చిగురు వేస్తాయేమో

నా దిగులు కళ్లపై వెచ్చటి ముద్దుపెట్టు
లోలోన ఉప్పొంగే కన్నీటి సముద్రాలు
మాయమై, కాసిన్ని కమ్మటి కలల్ని
ప్రగాఢ సుఖ నిద్రను ఇవ్వగలదేమో

నా పెదవులపై ముద్దుపెట్టు
ఎన్నో మార్లు గాయపడి మౌనమై
మాయమైన నా మాటలు
ప్రణయపూరిత జీవ రహస్యాన్ని కనుగొని
చిరునవ్వై వెలుగుతాయేమో

నా అరచేతులపై ముద్దుపెట్టు
చిక్కుబడి, అగమ్యగోచరమైన
నా జీవన రేఖలను చెరిపివేసి
నీలాకాశాన్ని అందుకునే సత్తువగల
కొత్త రెక్కలు వికసిస్తాయేమో

నా పాదాలపై ముద్దుపెట్టు
నడచి నడచి అలసినా ఆగని
గమ్యరాహిత్యాపు పరుగులను వీడి
మరో అద్భుత సాహసోపేత
నూతన ప్రయాణానికి
దారులు కనుగొనగలవేమో

■ విమల

సాహిత్య విమర్శకి కొత్త దిశ

రెండేళ్ళ క్రితం వెలువడిన సాహిత్యవ్యాసాల సంపుటి 'దిక్చక్రం' లోని మొత్తం 48 వ్యాసాల్లో పర్యాప్తమై వున్న రచయిత విస్తృత విషయ పరిజ్ఞానం, దేశవిదేశాల సాహిత్య అధ్యయనసారం మనల్ని ఆశ్చర్య పరుస్తుంది. రెండు కథాసంపుటాలు వెలువరించిన కథారచయితగా, అనువాదకుడిగా మాత్రమే మనకు పరిచితుడైన, ఒక నాన్ అకడెమిక్ ఐన ఆడెపు లక్ష్మీపతి, అకడెమిక్ పండితులకు, పరిశోధకులకు తీసిపోని స్థాయిలో, వివిధ సాహితీప్రక్రియలు- కవిత్వం, కథ, నవల, నాటకం- గురించి, నూతన, పాశ్చాత్యసాహితీ ధోరణులైన మ్యాజికల్ రియలిజం, పోస్ట్ మోడర్నిజం, ఎగ్జిస్టెన్షియలిజం గురించి... పలు రచనల ప్రస్తావింపులతో అనేక అంశాలు సులభశైలిలో చెప్పినతీరు, వర్తమాన తెలుగుకవిత్వం, కథ, నవలలని- కొందరి రచనలు దృష్టాంతంగా తీసుకుని- కొత్త కోణంలో, కొండొకచో నిర్మొహమాటమైన వ్యాఖ్యానాలతో విశ్లేషించిన పద్ధతి అనన్యసామాన్యం. ఎంతో జ్ఞానతృష్ణ వుంటే తప్ప ఇంత లోతైన, విస్తారమైన అధ్యయనం సాధ్యం కావు.

రచయిత పాశ్చాత్య సాహిత్యాన్ని, విమర్శ గ్రంథాల్ని విరివిగా చదివి ఉండటమే కాక ఆ అధ్యయన ప్రభావంతో అలవడిన సరికొత్త చూపుతో తెలుగు సాహిత్యాన్ని విశ్లేషించేందుకు చేసిన ప్రయత్నం 'దిక్చక్రం' ప్రతి పేజీలో మనకు కనపడుతుంది. లక్ష్మీపతి ఈ గ్రంథాన్ని చాలా విశిష్టమైన తెలుగు పదజాలంతో రాశారు. కొన్నివ్యాసాలు చదువుతుంటే ఈ తెలుగు కంటే ఇంగ్లిష్ లోనే హాయిగా ఉంటుందేమో అనిపించేలా తెలుగులోని పారిభాషిక పదాలు వాడారు. కానీ కించిత్ శ్రమ తీసుకుని చదివితే సగటు పాఠకులకు, విద్యార్థులకు ఈ పుస్తకం నుంచి అపురూపమైన సాహిత్య సమాచారజ్ఞానం లభిస్తుంది.


'దిక్చక్రం'లోని వ్యాసాలు కవిత్వం, కథలు, నవలలు, కొత్త రచనా రీతులు, వాదాలు, తాత్విక ధోరణులు అని నాలుగు విభాగాలుగా విభజించి ఉన్నాయి. మొదటి మూడు విభాగాల్లో తెలుగులో తనకు నచ్చిన కొన్ని గ్రంథాల్ని తీసుకొని వాటిని తనవైన తూనికరాళ్ళతో పరిశీలించి చక్కని విమర్శ చేశారు లక్ష్మీపతి. కవిత్వవిభాగంలో, డా.ఏనుగునర్సింహారెడ్డి 'మూలమలుపు' సంపుటిలోని కవితలు విస్తారమైన వస్తువిభిన్నతను ప్రదర్శిస్తూ కవిలోని సునిశిత పరిశీలనాశక్తికి, అమితమైన స్పందనాశీలతకు తార్కాణంగా నిలుస్తాయంటారు. ఈ వ్యాసంలో కవిత్వంపై, కవిత్వనిర్మాణంపై సూచనలు, దేశవిదేశాల ప్రముఖ కవుల కొన్ని కవిత్వ చరణాలు ఉన్నాయి. డా.బాణాల 'కుంపటి' దీర్ఘకవితపై రాస్తూ కంసాలి వృత్తిపని, గ్రామీణ సమిష్టిచిత్రంలో ఆ వృత్తిబాధ్యత, కుటుంబ సంబంధాలు, చిన్ననాటి జ్ఞాపకాలు, సాదాసీదా వ్యక్తిత్వాలు, కల్లోలాలు, జీవనసంక్షోభాల్ని చిత్రించడానికి కవి 'కుంపటి'ని ఎంతో ఔచిత్యవంతంగా కవితావస్తువుగా తీసుకున్నాడు అని ఉద్ఘాటిస్తాడు. బి.ఎస్.ఎం.కుమార్ 'నిషాలు, వృత్తాలు, వెళ్తురారిన కళ్ళు' కవిత్వ సంపుటికి ముందుమాటలో కుమార్ ప్రత్యేకమైన వ్యక్తీకరణ పద్ధతిని, శైలిని నిష్పాక్షికంగా అంచనా వేస్తూ, ఆ కవిత్వాన్ని వినసొంపైన స్వాప్నిక రాగాలాపనగా అభివర్ణిస్తూ అతని కవిత్వంలో anarchist expressions ఉన్నప్పటికీ ఆనదింపచేసే విషయాలు చాలా ఉన్నాయంటూ, అది దేనికి అనుకరణ కాదని, కవిపై ఎవరి ప్రభావంలేదని, అద్భుతమైన ప్రతీకల్తో, అనితరసాధ్యమైన మెటఫర్లతో చిక్కని కవిత్వం రాశాడని ప్రశంసిస్తాడు. కానీ సామాన్య పాఠకులకు అర్థం కానంత జటిలమైన కవిత్వం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడతాడు.

సిద్ధార్థ 'బొమ్మలబాయి' నిండా గత దశాబ్దమున్నర కాలాన్ని రూపుకట్టిన కవిత్వముంది, వస్తువైవిధ్యం, తెలంగాణ అస్తిత్వసోయి, ఉద్యమ తీవ్రత, స్వచ్ఛమైన స్థానిక భాషావాడకం, స్పందనల విస్తృతి, వాటి వ్యక్తీకరణల వినూత్నత... ఇవన్నీ కుప్పలు తెప్పలుగా కనపడతాయి అంటూనే, సిద్ధార్థ గత కవిత్వ సంపుటి 'దీపశిల'తో పోలిస్తే 'బొమ్మలబాయి'లో చిక్కదనం, సూటిదనం లోపించినట్లుగా ఉందనీ, అయినా తెలంగాణ కవుల్లో సిద్ధార్థ నిస్సందేహంగా మొదట పేర్కొనదగ్గ ప్రయోగశీల కవి అని చెబుతాడు. తాను Eliotలా రాయలనుకుంటే ఫర్వాలేదుగాని DylanThomasలా, John Berrymanలా రాయలనుకుంటే కవి సామాన్య పాఠకులకు దూరం కాక తప్పదని తనదైన ధోరణిలో సున్నితంగా హెచ్చరిక చేస్తాడు.

'డా. అమ్మంగి కవిత్వం, అనువాదాల గురించిన వ్యాసంలో, డా.ఎలనాగ తన అనువాద పటిమని' 'Faded Leaves and Fire Flies'లో చాలా చక్కగా ప్రదర్శించారని, 'దోమశకం' లోని వ్యంగ్య ధ్వనిని 'Mosquito Era' లోనూ, 'చెట్టు ఆత్మఘోష' లోని ఆర్తిని, ఆవేదనను 'The Soliloquy of a Tree' లోనూ, 'చివరియుద్ధం' లోని డిజిటల్ యుగపు భీభత్సాన్ని 'The Final Battle' లోనూ సంపూర్ణంగా పునఃసృజియించారని కొనియాడతారు. ఈ వ్యాసంలో భాష పుట్టుక, తెలుగు భాష ఆవిర్భావ వికాసాల గురించిన విషయాలు ఆలోచనీయంగా వున్నాయి.

21 వ్యాసాలున్న కథల విభాగం లో ఆయన 'మెతుకు కథలు' సంకలనానికి రాసిన ముందుమాట ఉంది. 'తెలంగాణ కథా సాహిత్యానికి పరిపుష్టి అందించిన రచయితలు ఇక్కడ గణనీయంగా ఉన్నారనటానికి ఈ సంకలనం నిదర్శనం' అంటూ తెలంగాణా సాహిత్య వికాసానికి అవరోధంగా నిలిచిన అంశాల్ని ఏకరువు పెడతారు. ఉప్పల నరసింహం 'మట్టిమనిషి' కథా సంపుటికి రాసిన ముందుమాటలో అతని కథన నైపుణ్యాన్ని పొగుడుతూనే ఇతివృత్త నిర్మాణంలో చాలా తీర్చికైన శైలి, కథన పద్ధతిని అవలంబించడం మూలాన కొన్ని కథలు పాత వాటిలాగా ముక్క వాసన వేస్తుంటాయి అంటారు లక్ష్మీపతి. 'అలుపెరుగని అక్షరశిల్పి' వ్యాసంలో పులికంటి కృష్ణారెడ్డి కథా సాహిత్యాన్ని, బహుముఖ ప్రజ్ఞను క్లుప్తంగా విశ్లేషించి 'పులికంటి సాహితీ సంస్కృతి' పేరు మీద ఉత్తమ సాహిత్యకారుల్ని సత్కరించడాన్ని కొనియాడతారు. 'కూరాడు' కథా సంకలనాన్ని వస్తువైవిధ్యంగల కథల సమాహారంగా విశ్లేషిస్తారు, 'నూనెసుక్క' కథా సంపుటి ముందుమాటలో కొట్టం రామకృష్ణారెడ్డిని Promising short story writer అని అభినందిస్తారు. డా.అయోధ్యరెడ్డి 'అక్కన్నపేట రైల్వేస్టేషన్' కథల్ని విశ్లేషిస్తూ అవి తెలంగాణ జీవితాన్ని చక్కగా పట్టుకున్న కథలనీ, రచయిత కథాశిల్పంపట్ల మంచి పట్టు ఉన్న కథకుడనీ పేర్కొంటూనే, చివర్న కథల్ని ట్రాజెడీగా ముగించే ఆబ్సెషన్‌ను అయోధ్యరెడ్డి వదులుకోవాలని సూచన చేస్తారు. శీలా వీర్రాజు కథల్లోని మనస్తత్వ చిత్రణని ఆకట్టుకునేలా వివరిస్తారు. ఈ విభాగంలోని '2008 కథాసాహిత్య సింహావలోకనం', 'ఆధునిక సాహిత్య ప్రక్రియగా కథ - సంవిధాన, ఉపాంగాల పరిచయం', 'క్రొంగొత్త రంగులు కలబోసిన కాన్వాసు: కథ - 2002', 'సమకాలీన తెలుగు కథ ప్రయోగాలు (2000-2010)', 'సాహిత్యం - వస్తుశైలీ శిల్పాల పరిశీలన', 'సాహిత్యం నీతిశాస్త్రానికి ప్రత్యామ్నాయం కాదు, అరాచకాన్ని ప్రోత్సహించకూడదు'... తదితర వ్యాసాలు రచయితలకు పాఠ్యంశాల్లాంటివి. కథ నిర్వచనం, మంచి కథని తూచే ప్రాతిపదిక, వస్తువు, ప్లాట్, శైలి, శిల్పం , ప్రయోగం... గురించిన వివరణలు, కథానిర్మాణ క్రమంలోని దశల్ని సూచించే 'ఫ్రేటాగ్స్ ట్రయాంగిల్', సమీక్ష-విమర్శల మధ్య తేడా, ఇతర భాషాకథల క్లుప్త పరిచయం... తదితర అంశాలన్నీ మన రచయితల అవగాహనని పెంచే విధంగా వున్నాయి.

> రచయిత పాశ్చాత్య సాహిత్యాన్ని, విమర్శ గ్రంథాల్ని విరివిగా చదివి ఉండటమే కాక ఆ అధ్యయన ప్రభావంతో అలవడిన సరికొత్త చూపుతో తెలుగుసాహిత్యాన్ని విశ్లేషించేందుకు చేసిన ప్రయత్నం 'దిక్చక్రం' ప్రతి పేజిలో మనకు కనపడుతుంది.



నవలల విభాగంలో రాసిన ఏడు వ్యాసాల్లో ముఖ్యంగా 'తెలంగాణ నవల - శిల్పం' లో తెలంగాణా నవలలని సబ్జెక్ట్ వారీగా విభజించి ఇక్కడి రచయితలు రియలిజానికి ప్రాధాన్యం ఇస్తారని తేలుస్తారు. జ్వాలాముఖి నవల 'వేలాడిన మందారం' తెలుగులో మరణశిక్ష రద్దు గురించి రాసిన మొదటి నవలగా పేర్కొంటారు. దీన్ని గంభీరమైన ఇతివృత్తంతో ఉత్కంటభరితంగా సాగిన నవలగా అభివర్ణిస్తారు. గోపీచంద్ ప్రసిద్ధ తాత్విక నవలలు అసమర్థుని జీవయాత్ర, మెరుపుల మరకలు, చీకటి గదులు ప్రత్యేకతను వివరిస్తారు. నవీన్ 'అంపశయ్య' సమస్యల వలయంలో చిక్కుకున్న ఒక యువకుని సంఘర్షణను చిత్రించి subjective mind and objective worldల మధ్య వుండే కార్యకారణ సంబంధ సార్వకాలీనతను స్ఫురింప చేస్తున్న నవలగా తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందంటారు. అసలు సమస్యను స్పృశించడమే రచయిత కర్తవ్యం అంటూ సలీం నవల 'పడగనీడ' గురించి రాస్తూ ఈ నవల మంచి రచయిత రాసింది అయినప్పటికి సమస్య అసలు మూలాల్ని స్పృశించని వెలితి ఈ నవలలో కొట్టొచ్చినట్టు కన్పిస్తుందని ఖరాఖండిగా చెబుతారు. మరో వ్యాసంలో, 'తానా' బహుమతి - 2017' అందుకున్న 'నీల', 'శప్తభూమి', 'ఒంటరి' నవలలపై న్యాయనిర్ణేతగా తన కామెంట్స్ రూపంలో క్లుప్తంగా విశ్లేషణ చేశారు. భాస్కరభట్ల కృష్ణరావు నవల 'వెల్లువలో పూచిక పుల్లలు'లో ఏ కోణంలో అస్తిత్వ వాద ఛాయలున్నాయో చెబుతారు.

14 వ్యాసాలుగా విస్తరించిన 'కొత్త రచనారీతులు, వాదాలు, తాత్విక ధోరణుల విశ్లేషణ' విభాగంలో విశ్వ సాహిత్యంలో అనేక మంది రచయితలు, అనేక ధోరణులకు సంబంధించిన వ్యాసాలు ఉన్నాయి. కాఫ్కా, బెకెట్, బోర్హెస్, కోర్తజార్, మార్క్వెజ్ వంటి ఆధునిక రచయితలపైన, మాజిక్ రియలిజం, ఎగ్జిస్టెన్షియలిజం తదితర అంశాలపై చాలా educativeగా , informativeగా రాశారు. 'దిక్చక్రం'కి ముందుమాట రాస్తూ కె. శివారెడ్డి 'ఆడెపు లక్ష్మీపతి గారు తెలుగు సాహిత్యానికి ఒక పెన్నిధి లాంటి అమూల్య గ్రంథాన్ని అందించారు' అన్న మాట అక్షరాలా నిజం.

■ బాణాల శ్రీనివాసరావు
✆ 94404 71423

తొలి గిరిజన కథకుడు భూషణం మాస్టారు కాదు

సువర్ణముఖి కథల మీద జూన్ 17 నాటి వివిధలో నాగరాజు గారు రాసిన వ్యాసం పరిపూర్ణంగా ఉంది. కానీ అందులో తొలి ఉత్తరాంధ్ర గిరిజన కథకులు అని భూషణం మాస్టారిని పేర్కొన్నారు. గిరిజన జాతుల జీవన సంస్కృతి, వారి పోరాటం, ఉద్యమ స్ఫూర్తితో ఉత్తరాంధ్ర గిరిజన కథ రాసిన భూషణం మాస్టారు తెలుగు కథ సాహిత్యంలో ఎప్పటికీ చిరస్మరణీయులే. కానీ దానికి ముందుగా తొలి గిరిజన కథ 'చెంచి'ను, ఆ రచయిత గూడూరు రాజేంద్రరావును కూడా మనం ఒక్కసారి మననం చేసుకోవాలి. ఇది ఆయన బొబ్బిలి సంస్థానంలో పని చేస్తున్నపుడు రాసిన కథ. అప్పటి పరిస్థితులు నేపథ్యంలో రాసిన కథ. నెల్లూరువాసి కావటంతో సహజసిద్ధంగా నెల్లూరు మాండలీకం వారి కథ నిండా అలుముకుంది. 1932 ఆగస్టు నెల భారతిలో 'చెంచి' కథ ప్రచురితమైన తర్వాత ఐదారు నెలలపాటు ఈ కథ మీద తెలుగు ప్రసిద్ధులందరూ చర్చించటం ఈ కథ విశేష స్థానాన్ని తెలియపరుస్తుంది. గిరిజన బతుకుల్లోని దైన్యస్థితిని, దోపిడీని, లైంగిక వేధింపులను, అప్పుల వాళ్ళ జలగ పీడనా సంస్కృతిని, చెంచి కథలో ప్రస్తావించారు.



రాజేంద్ర కథలే కాకుండా కవితలు నాటకాలు కూడా రచించారు. నెల్లూరు జిల్లా వాసి అయిన గూడూరు రాజేంద్రరావు నెల్లూరు విద్యాభ్యాసం అనంతరం మద్రాసులో ఎమ్మే చేస్తున్న రోజుల్లో షేక్స్పియర్ నాటకాలపై రాసిన విమర్శ ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సి కాలేజీ ఆంగ్ల పండితుల అభిమానాన్ని పొందింది. వీరి ఆంగ్ల పాండిత్యాన్ని గమనించిన బొబ్బిలి రాజా తన సంస్థానంలో నియమించుకున్నారు. షేక్స్పియర్ మర్చంట్ ఆఫ్ వెనిస్‌లో షైలాక్ పాత్రను, వేదం వెంకటరాయ శాస్త్రి ప్రతాప రుద్రీయంలో ప్రతాపరుద్రుడుగాను ఇలా అనేక నాటకాల్లో నటించి కీర్తి పొందారు. 1904 సెప్టెంబర్ 25 తేదీన జన్మించిన వీరు 40 ఏళ్ల జీవిత కాలం పూర్తికాకుండానే 1945 జూలై 17వ తేదీ తనువు చాలించినా, తెలుగు కథా చరిత్రలో మర్చిపోలేని స్థానం పొందారు. ఆయన చెంచి కథ వెలువడి ఇప్పటికి 90 ఏళ్లు అయినప్పటికీ ఇంకా దానిపై పరిశోధనలు జరుగుతున్నాయి. వీరి రచనలు భారతి, శుభోదయం, స్వతంత్ర, జమీన్ రైతు పత్రికలలో 1932-40 ప్రాంతంలో విరివిగా వచ్చేవి. వీరికి ఏమాత్రం కీర్తి కండూతి లేకపోవటంతో, కేవలం సామాజిక నేపథ్యంలో వారు రాసిన కథలు చాలావరకు అందుబాటులో లేకుండా పోయాయి. వీరు నెల్లూరు, కడప, కర్నూలు, పెద్దాపురంలలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేయటం, బదిలీలు, పదోన్నతుల మధ్య జాగ్రత్త పరచలేకపోవటంతో వారి రచనలు చాలా వరకు వెలుగు చూడలేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

■ ఈతకోట సుబ్బారావు
✆ 94405 29887

సింగిల్ పేజీ కథల పోటీ

వంశీ ఇంటర్నేషనల్ 52 ఏళ్ళు పూర్తి చేసుకున్న తరుణంలో సాహితీ కిరణం మాసపత్రిక సౌజన్యంతో సింగిల్ పేజీ కథల పోటీలు నిర్వహిస్తున్నది. మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు. కథ డిటిపిలో ఒక పేజీకి మించరాదు (ఫాంట్ 16, ఎ4 సైజ్ మాత్రమే). ఎంపిక చేయబడిన మరో 50కథలు అంటే మొత్తం 53 కథలను కలిపి వంశీ ఇంటర్నేషనల్ సంకలనంగా ప్రచురిస్తుంది. కథలు అందాల్సిన చివరి తేదీ జూలై 31. కథలు చేరాల్సిన చిరునామా: సాహితీ కిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ - 500102. ఫోన్- 94907 51681.

పొత్తూరి సుబ్బారావు

కె. శివారెడ్డి కవిత్వ స్ఫూర్తి అవార్డు

కె. శివారెడ్డి కవిత్వ స్ఫూర్తి అవార్డు'కు 2023వ సంవత్సరానికి గాను 'ఊహ చేద్దాం రండి' కవితా సంపుటి వెలువరించిన కవి దొంతం చరణ్ ఎంపికయ్యారు. ఆగష్టు 18న ఖమ్మంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం జరుగుతుంది.

ఇబ్రహీం నిర్గుణ్

మా కథలు 2023

వేదగిరి రాంబాబు జయంతి సందర్భంగా, అక్టోబర్ 14న వెలువడనున్న మా కథలు 2023 సంకలనంలో ప్రచురణ కోసం 2023లో పబ్లిష్ అయిన కథలు పంపాలి. ఆఖరి తేదీ ఆగస్ట్ 15. చిరునామా: సి.హెచ్. శివరామ ప్రసాద్, కన్వీనర్, స్వగృహ అపార్ట్‌మెంట్, 'సి' బ్లాక్, జి-2, భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500072. వివరాలకు ఫోన్: 9390085292.

శివరామ ప్రసాద్

కథలకు ఆహ్వానం

కస్తూరి మురళీకృష్ణ, కోడిహళ్ళి మురళీమోహన్‌ల ఆధ్వర్యంలో ఈ దీపావళికి సైనికులు కథాంశంగా వెలువడనున్న కథా సంకలనంలో కోసం కథలను ఆహ్వానిస్తున్నాం. సైనికుల పోరాట పటిమను, కర్తవ్య దీక్షను, త్యాగనిరతిని, దేశభక్తిని విభిన్న కోణాలలో ప్రతిబింబం చేసే కథలు పంపాలి. ఇదివరకు పత్రికలలో ప్రచురితమైన కథలు కూడా పరిశీలిస్తాము. కొత్త కథలను సంచిక సాహిత్య వెబ్ పత్రికలో ప్రచురిస్తాము. కథలను అక్టోబర్ 31 లోగా చిరునామా: కస్తూరి మురళీ కృష్ణ, ఫ్లాట్ నెం.32, ఇం.నెం.8-48, రఘురాం నగర్ కాలనీ, దమ్మాయిగూడ, హైదరాబాద్ 500083కు లేదా ఈమెయిల్: sanchikastorycompilation@gmail.comకు పంపాలి.

కస్తూరి మురళీకృష్ణ

'కాలం కత్తి మొన మీద'

గార రంగనాథం కవిత్వ సంపుటి 'కాలం కత్తి మొన మీద' ఆవిష్కరణ సభ జూలై 28 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలోగల విద్యానికేతన్ పాఠశాలలో పిల్లా తిరుపతి రావు అధ్యక్షతన జరుగుతుంది. సభలో బాల సుధాకర్‌మౌళి, సిరికి స్వామినాయుడు, కంచరాన భుజంగరావు అతిథులుగా పాల్గొంటారు.

రాజాం రచయితల వేదిక



డెలివరీ బాయ్

కాలంతో నువ్వో
నీతో కాలమో
తెలీదు కానీ
మీ పోటీ అబ్బుర పరుస్తుంది

సమస్త ప్రపంచాన్ని మోస్తూ నువ్వు
సకల వినిమయాన్ని కాంక్షిస్తూ నేను

నీ బిడ్డకు పాలు తాగిస్తావో లేదో కానీ
నా సుప్రభాతపు టీ/కాఫీ సేవనంలో
నువ్వు గుబాళిస్తావు
నువ్వు విసిరిన దిన పత్రికలో
ప్రపంచం మొత్తాన్ని దర్శిస్తాను
నీ బతుకు వెతను మాత్రం
పట్టనట్లు ఊరకుంటాను

"30 నిమిషాల్లో డెలివరీ లేకుంటే ఉచితం"

నా ఆర్డర్ నమోదవడమే ఆలస్యం
నువ్వక్కడ పరుగందుకుంటావు
ట్రాఫిక్ చిక్కుల్ని, రోడ్డు ప్రమాదాల్ని,
వాతావరణ భయాల్ని
ఛేదించే ప్రయత్నంలో నువ్వుంటే
నీ ఆలస్యంతో లభించే
ఉచితపు ఊహల్లో
నేను దొర్లుతుంటాను

నా జీవితపు ప్రతి సంతోష క్షణంలోను
నువ్వు వాహికవవుతావు
ఆహారం నుంచి దుస్తుల వరకు
ఎలక్ట్రానిక్స్ నుంచి కొత్తిమీరకట్ట వరకు
నా బతుకంతా నీ నెత్తినేసి
నేను బద్ధకాన్ని ఆహ్వానిస్తాను

నువ్వేమో బతుకుని కాలానికి కట్టి
గెలిచి నిలవాలని ఉరకలెత్తుతుంటావు
నా మోదం నీ ఖేదాల్ని గుర్తించదు

నీ పేరుతోనో, రూపుతోనో
మతాన్ని గుర్తించి అవమానించేందుకో
కుక్కల్ని వదిలేసి
నీ ప్రాణాలు తీసేందుకో
నేనస్సలు సిగ్గుపడను

నీ బతుకు భయం
మాకో ఆట లాగుంటుంది
కాలంతో జరిగే పోటీలో
నువ్వు జారిపడుతుంటావు
ఆసుపత్రిలోనో, ఆనక మార్చురీలోనో
తెల్లగుడ్డొకటి కప్పుకుంటావు

నువ్వు విద్యార్థివో
డ్రాపౌట్‌వో
నిరుద్యోగివో
రోగగ్రస్తుడివో
ఉద్యోగం పోగొట్టుకొని
రోడ్డున పడిన వాడివో
సంసార భారం మోసే కుటుంబ రావువో
చెల్లి పెళ్లి కోసమో, తల్లి వైద్యం కోసమో
రోడ్డెక్కిన త్యాగమయుడవో
ఎవరివో.... నువ్వెవరివో...

■ ఎ. ఆర్. తూములూరి
✆ 97052 07945

"నలభై ఏళ్ల నా సాహిత్య ప్రయాణానికి ఇదొక కనువిప్పు, కుదుపు!" - అఫ్సర్

"పొద్దుటి ఆహారంలో
రొట్టెను తాకగానే--
ప్రతి తునకలో గాజా కనిపిస్తోంది"

- ఇలా చిన్న చిన్న పద్యాల్లో గొప్ప భావసంచలనాన్ని దట్టించాడు అఫ్సర్. ఇటీవల రంజాన్‌కి 'Fasting hymns' పేరుతో రోజుకో పద్యం వంతున 30 పద్యాలు ప్రకటించాడు. ముస్లిం సమాజపు జీవన విధ్వంసాన్నీ దుఃఖాన్నీ, ఎదుర్కొంటున్న వివక్షనూ, యుద్ధం లోహపాదాల కింద నలుగుతున్న పాలస్తీనా కన్నీటినీ కవిత్వం చేశాడు. కవి లోతుగా గాయపడ్డ విషయానికి ప్రతి పద్యం సాక్ష్యం చెబుతుంది.

'ఉపవాస పద్యాలు' పేరుతో పి. శ్రీనివాస్ గౌడ్ అనువదించిన ఈ పద్యాలు రంగులకు అతీతంగా అందర్నీ చుట్టుకుంటాయి. సరళతను గాఢతను ఒకే దారంతో పేని అందించిన శ్రీనివాస్ గౌడ్ అనువాద ప్రతిభను అభినందించకుండా ఉండలేం. ఉపవాస పద్యాల పుట్టుక, మనుగడ, ప్రభావాల గురించి కవి, అనువాదకుడి మాటల్లోనే విందాం.

సాంబమూర్తి లండ
96427 32008

'Fasting Hymns' - ఎన్నాళ్ళుగానో గూడుకట్టుకున్న దుఃఖగీతాలుగా ఎందుకున్నాయి?

అనేక వ్యక్తిగత, సామాజిక అడ్డుగోడల వల్ల కొన్ని విషయాలు మనసు మూలల్లోనే వుండిపోతాయి. ఒక గట్టి సామాజిక సందర్భం వచ్చినప్పుడు వాటిని మనసు విప్పి చెప్పుకునే శక్తి రచయితకి వస్తుందేమో! రంజాన్ లాంటి పండగలు కేవలం ముస్లింల అనుభవం మాత్రమే కాదు. మన సమాజాల్లో అవి మతం అడ్డుగోడల్ని దాటి వచ్చిన సామరస్య సందర్భాలు. అయితే, ఒక డిసెంబర్ ఆరు తరవాత, మరో పాలస్తీనా విషాదం తరవాత ఆ పండగ నా లోపల చాలా దుఃఖాన్ని కూడా నింపింది. దాహార్తికి గుక్కెడు నీళ్ళు ఇస్తే పది పుణ్యాలు దక్కుతాయన్న విశ్వాసం రంజాన్ నెల. ఆ గుక్కెడు నీళ్ళు కూడా దొరక్క చనిపోతున్న పాలస్తీనా పసిపిల్లల ప్రాణాల గురించి ఆక్రోశంలో ఈ 'ఉపవాస పద్యాలు' పుట్టాయి. అవి పుట్టిన చరిత్రనీ, నేపథ్యాన్ని బట్టి చూస్తే, ఇవి రాజకీయ పద్యాలు అని వేరే చెప్పక్కర్లేదు కదా!




ఒక్కో పద్యంలో కవిగా మీరు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ గురించి చెప్పండి?

వీలైనంత సూటిగా, ఎలాంటి అలంకారాలూ లేకుండా, నిజానికి హైకూలు మాత్రమే రాయాలని మొదలు పెట్టాక, ఆ పరిమితుల్లో కొన్ని ఆలోచనలు ఇమడలేదు. మొదటి కవిత రాశాక మిత్రుడు అనంతు కొన్ని సూచనలు చేశారు. అదే సమయంలో శ్రీనివాస్ గౌడ్ స్పష్టత కోసం వేసిన ప్రశ్నలు నా వ్యక్తిగత పరిమితుల్ని దాటించడంలో ఉపయోగపడ్డాయి. అలా రాసే క్రమంలో వచ్చిన ప్రతి మార్పునూ నేను నిష్పూచీగా స్వీకరించాను. మరో మిత్రుడు ఎన్. వేణుగోపాల్ రాజకీయ అంశాల గురించి ఇంకా కొంచెం స్పష్టత రావాలని సూచించడంతో పాలస్తీనా గురించి చాలా చదవాల్సి వచ్చింది. ఇవన్నీ కవితలకి కొత్త రూపాన్ని ఇవ్వడంలో ఉపయోగపడ్డాయి. కవిత్వం అంటే మన లోపల మనం నలిగిపోవడం మాత్రమే కాదనీ, నలుగురినీ కలుపుకొచ్చే వాహిక అని ఇవి రాస్తున్నప్పుడు నాకు బాగా అర్థమైంది. పద్యాల అందం పద్యంలోనే కాకుండా, అవి సృష్టించే రాజకీయ సంభాషణల వల్ల చిత్రిక పెట్టుకుంటుందని తెలిసొచ్చింది. ఆ రకంగా గత నలభై ఏళ్ల నా సాహిత్య ప్రయాణానికి ఇదొక ఆశ్చర్యకరమైన కనువిప్పు, కుదుపు!

> కవిత్వం అంటే మనలోపల మనం నలిగిపోవడం మాత్రమే కాదనీ, నలుగురినీ కలుపుకొచ్చే వాహిక అని ఇవి రాస్తున్నప్పుడు నాకు బాగా అర్థమైంది. పద్యాల అందం పద్యంలోనే కాకుండా, అవి సృష్టించే రాజకీయ సంభాషణల వల్ల చిత్రిక పెట్టుకుంటుందని తెలిసొచ్చింది.

ఈ పద్యాలకు ముస్లిం సమాజం నుండి ఎటువంటి ప్రతిస్పందన వచ్చింది?

Fasting Hymns మొదట ఇంగ్లీషులో వెల్లుబికిన వాక్యాలు. అందువల్ల, ఇది ప్రపంచంలోని వివిధ భాషల వాళ్ళు, ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ దేశాల వాళ్ళు, అమెరికాలోని సాహిత్య అభిమానులు విస్తృతంగా చదివారు. అవి రాస్తున్న క్రమంలోనే ఆయా భాషల్లోకి అనువాదం చేస్తామని వాళ్ళు అడిగారు. బహుశా, వచ్చే రంజాన్ నెలకి కనీసం పది భాషల్లో ఈ కవితలు వెలువడుతాయి. ముఖ్యంగా, అరబీ, ఫారసీ, హిబ్రూ భాషల్లో ఇవి త్వరలో రాబోతున్నాయి. ఈ అనుమతి కోరిన వాళ్ళు ఎక్కువగా ముస్లింలే అని చెప్పలేను. ముస్లిం వేదనని అర్థం చేసుకుంటూనో, లేకపోతే, ముస్లిం సమస్యల మీద పనిచేస్తున్న వాళ్ళు అనో చెప్పలేను. వాళ్ళల్లో ఎక్కువమంది సామాజిక సాంస్కృతిక శాస్త్రాల నిపుణులు. తెలుగు సమాజం కూడా ముస్లిం, ముస్లిమేతర అనే తేడా లేకుండా ఆ పద్యాల్ని అక్కున చేర్చుకుంది.శ్రీనివాస్ గౌడ్ ఎంతో శ్రద్ధతో వాటికి పుస్తక రూపం ఇచ్చాక, అవి ఎక్కువమందికి అందాయి.



"ముస్లిం సమాజ వేదనని ఒడిసిపట్టిన కవిత్వం" - పి. శ్రీనివాస్ గౌడ్

మీ ఇతర అనువాద సృజనతో పోలిస్తే 'ఉపవాస పద్యాలు' ఏవిధంగా విభిన్నం?

ముందు మూల రచన మన హృదయాలని కదిలించగలగాలి. అప్పుడే మనం దాని అనువాదానికి పూనుకుంటాం. ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజం పట్ల ఇతర సమాజాలు వ్యవహరిస్తున్న తీరు పట్ల వేదన చెందిన కవికి రంజాన్ మాసం అనేది ఒక సందర్భం. నెపం. ఆ సందర్భాన్ని ఆసరా చేసుకొని ముస్లిం సమాజం పడుతున్న అనంత వేదనని, వాళ్ళు సామాజికంగా మారాల్సిన అవసరతను అల్పాక్షరాలలో ఒడిసిపట్టిన కవిత్వం ఇది. అందుకే వెంటనే అనువాదం చేసాను. ఇతర అనువాద రచనలు పుస్తకాలుగా రావలసివున్నా 'ఉపవాస పద్యాలు' ముందుగా రావడానికి ఆ పద్యాలకు వున్న తక్షణ అవసరత, తీక్షణత కారణం. ఇతర అనువాదాలకు ఇది ఏ విధంగా విభిన్నమంటే ఇవి వెంటనే ముస్లిం సమాజాలకు, మిగతా పౌర సమాజాలకు జాగు లేకుండా అందవలసినవి.



కొన్ని పదాల విషయంలో కొంచెం స్వేచ్ఛ తీసుకున్నట్టు అనిపించింది?

ఇవి ఇంగ్లీషులో వెలువడిన కవితలు. ముస్లిం పండుగల పారిభాషిక పదాలు అరబ్బీ బాషలో వుంటాయి. అందువల్ల వాటి అర్థాలు మిగతా వారికి అర్థం కావు. కాబట్టి అనువాదంలో మక్కీకి మక్కీ ఇవ్వడం వల్ల వాటి జీవం పోతుంది. కనుకే అవసరమయిన చోట తెలుగు/ అరబ్బీ పదాలు ఉపయోగించాను. అవసరమైన మేరకు ఫుట్ నోట్సు ఇచ్చాను.

అనువాదకుడిగా, కవిగా 'ఉపవాస పద్యాలు' మీకు ఎలాంటి సంతృప్తిని ఇచ్చాయి?

ఈ పద్యాలను చదివినప్పుడు హృదయం ద్రవించిన అనుభూతికి లోనయ్యాను. నా తక్షణ స్పందనగా వాటిని అనువాదం చేసాను. నేరుగా తెలుగు కవిత చదివిన అనుభూతిని ఇచ్చిందని పాఠకులు అనడం ఆ కవితలను అనువాదం చేసిన ఫలితాన్ని, సంతృప్తిని ఇచ్చింది. ఉపవాస పద్యాలు చదివిన దాన్ని బట్టి ఈ కవితల సారాన్ని ఏ ఒక్కరిలోనైనా ముస్లిం సమాజాన్ని చూసేవాళ్ళ దృక్పథంలో కించిత్ మార్పు వస్తే అది నిజమైన సంతృప్తి.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
సోమవారం 22 జూలై 2024



భద్రకాళి నమో నమః



శాకంబరీ అలంకరణలో అమ్మవారు

భక్తులతో పోటెత్తిన భద్రకాళి దేవాలయం

భద్రకాళి నమో నమః.. భద్రకాళి శరణు శరణు.. నామస్మరణతో వరంగల్ భద్రకాళి దేవాలయం మార్మోగింది. ఆదివారం ప్రకృతి శోభతో దేదీప్య మానంగా శాకంబరీ అలంకరణతో అమ్మవారు దర్శనమిచ్చారు. ఐదు టన్నుల కూరగాయలతో, పండ్లతో అమ్మవారి గర్భాలయం దేవాలయ ప్రాంగ ణం మొత్తం అమ్మవారిని అలంకరించారు. ఎడ తెరిపిలేకుండా వర్షం పడుతున్నా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్దసం ఖ్యలో తరలివచ్చారు. కాగా, 16రోజులపాటు కొనసాగిన శాకంబరీ ఉత్సవాలు ఆదివారం హోమం, పూర్ణాహుతితో పరి సమాప్తమయ్యాయి.

- వరంగల్ కల్చరల్

7





గురుభ్యో నమః

జిల్లాలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

గురువులను ఆషాఢశుద్ధ పౌర్ణమి రోజున ఘనంగా పాదుకా పూజలను నిర్వహించుకొనే పర్వదినం గురుపౌర్ణమిని ఆదివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని దత్త మందిరాలు, గురు మందిరాలు, సాయి మందిరాల్లో పూజలు, హోమా లు, అభిషేకాలు, అలంకరణలు, భజనలు, అన్నదానాలు నిర్వహించారు. భద్రకాళి ఆలయ సమీపంలోని సాయిబాబా దేవాలయంలో అభిషేకం, హారతులు, భజనలు, అన్నదానం నిర్వహించారు. హనుమకొండ ఏషియన్ మాల్ పక్కన గల షిరిడీ సాయి బాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

- హనుమకొండ కల్చరల్

8



కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లి వద్ద తెగిన కుంట మత్తడి

గోవిందరావుపేట గుండ్లవాగు ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి జారుతున్న జలాలు





మత్తడి పోస్తున్న కాజీపేట మండలం సోమిడి చెరువు



ములుగు మండలం బొగ్గులవాగు వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు, హెచ్చరిక బోర్డు



మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో పొంగిపొర్లుతున్న మున్నేరువాగు



శాయంపేట మండలం జోగంపల్లిలో మత్తడి పోస్తున్న చలివాగు ప్రాజెక్టు

జోరు వర్షం

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలు

- తడిసిముద్దవుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా
- పలు చోట్ల మత్తళ్లు పడుతున్న చెరువులు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- దెబ్బతిన్న రోడ్లతో వాహనాల దారి మళ్లింపు
- వాగుల వద్ద పోలీసుల పహారా
- జలాశయాలకు చేరుతున్న వరదనీరు
- వరద ఉధృతితో ఉరకలేస్తున్న గోదావరి

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ జనగామ(ఆంధ్రజ్యోతి)/ ములుగు/ మహబూబాబాద్ అగ్రికల్చర్/ భూపాలపల్లిటౌన్ /వరంగల్ వ్యవసాయం, జూలై 21 : బంగాళాఖాతంలో అల్పపీ డనం, ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మూడు నాలుగు రోజులుగా ముసురుపడుతూనే ఉంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు కూడా వర్షం పడుతూనే ఉంది.

హనుమకొండ జిల్లాలో రెండురోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. వర్షం నిదా నంగా పడుతుండడంతో ఎక్కడా వర్షపు నీరు నిలవటం లేదు. వరద సమస్యలు తలెత్తడం లేదు. ఈ వర్షాలకు జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు, బావుల్లోకి క్రమంగా నీరు చేరుతోంది. చిన్న చెరువులు అప్పుడే మత్తడి వరకు వచ్చాయి. కొన్ని చెరువులు మత్తళ్లు పడడం కూడా మొదలైంది. పరకాల, శాయంపేట మండలాల్లో పడుతున్న భారీ వర్షాలకు చలివా గుకు వరద వస్తోంది. జిల్లాలో గత 24 గంటల్లో సరాసరి 55.7 మి.మీ. వర్షపాతం రికార్డయింది. జిల్లాలోని పద్నాలుగు మండలాల్లో మొత్తంగా 777.5 మి.మీ. వర్షం కురిసింది. శాయంపేట మండలంలో అత్యధికంగా 92.1 మి.మీ. పడింది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత మండలంలో ఈ స్థాయిలో వర్షం కురవ డం ఇదే మొదటిసారి. పరకాల, నడికూ డ, ఆత్మకూరు, కమలాపూర్ మండ లాల్లో కూడా వాన దంచికొట్టింది.


చలివాగుకు మత్తడి

శాయంపేట, పరకాల మండలాల్లో కురిసిన భారీ వర్షం ప్రభావం వల్ల చలివాగు మత్తడి పోస్తోంది. ఇదే మండలంలో మాందారిపేట - సూరంపేట మధ్యగల లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపివేశారు. పరకాల మండలంలో నల్లచెరువు, బతుకమ్మ చెరువుతోపాటు పలుచెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. కమలాపూర్ మండలంలోని శ్రీరాములపల్లె వద్ద కల్వర్టు తెగి ఊళ్లోకి వరద నీరు వచ్చి చేరింది. ఎల్కతుర్తి మండలంలో భారీ వర్షం కారణంగా పలు చెరువుల్లోకి నీరువస్తోంది. కాజీపేట మండలంలోని సోమిడి చెరువు, హనుమకొండలోని వడ్డెపెల్లి చెరువులు మత్తళ్లు పోయడం ప్రారంభమైంది. గోపాల్‌పూర్ చెరువులోకి కూడా వరదనీరు చేరుతోంది.

జనగామ జిల్లాను ముసురు వానలు వీడడం లేదు. శుక్రవారం రాత్రి మొదలైన ముసురు వర్షాలు ఆదివారం రాత్రి వరకు కురుస్తూనే ఉన్నాయి. జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు కొన్ని చోట్ల స్వల్ప వర్షం కురవగా మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో మోస్తరు వానల కారణంగా ఇప్పుడిప్పుడే చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతోంది. రెండు రోజులుగా ఏక ధాటిగా ముసురు పడుతుండడంతో పనుల నిమిత్తం బయటకు వెళ్లేవా రికి కొంత ఇబ్బందిగా మారింది.

ములుగు జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి. రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. అత్యధికంగా ములుగు మండలం మల్లంపల్లిలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 114.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అవతలి గ్రామాలతో సంబంధాలు తెగిపో యాయి. ప్రధానదారులను కూడా వరద ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద కరకట్ట కోతకు గురైంది. రెండురోజుల కిందట ఇక్కడకు వచ్చిన కలెక్టర్ దివాకర గుర్తించి మరమ్మతుకు ఆదేశించారు. ఇసుక బస్తాలతో గండిని పూడ్చుతున్నప్ప టికీ గంటగంటకూ గోదావరి వరద పెరుగుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. బస్తాలు కొట్టుకు పోతే కోతకు గురైన అప్రాంతంలో కట్ట తెగిపోతుందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. జిల్లాకేంద్రంలో 163జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. జిల్లాకోర్టు సమీపంలో భారీ వరద రహదారిని ముంచడంతో వాహనదారులు భయభయంగా ముందుకు కదిలారు. డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, పోలీసు సిబ్బంది యంత్రాలతో వరద నీరు వెళ్లేలా ఏర్పాటు చేశారు. గోవిందరావుపేట మండలం

మిగతా 7వ పేజీలో..



22 అడుగులకు చేరిన పాకాల సరస్సు



గంగారం మండలం ఏడుబావుల జలపాతంలో జాలువారుతున్న నీరు



నగరం జలమయం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల నగరంలో ని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాజీపేటలోని నిట్ పెట్రోల్‌బంక్, చైతన్యపురి కాలనీ, దీనదయాల్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాలు జలమ యమయ్యాయి. రోడ్లపై వరద నీరు నిలవడంతో రాకపో కలకు కొంత అంతరాయం ఏర్పడింది. హనుమకొండ బస్‌స్టాండ్, కాకాజీ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం నీరు నిలిచి కొంత సేపు రాకపోక లకు అంతరాయం కలిగింది. కార్పొరేషన్ సిబ్బంది జేసీబీ సాయంతో నీరు నిలిచిన ప్రాంతాలను క్లియర్ చేశారు. ఎడతెరిపి లేకుండా ముసురు పడుతుండడంతో నగరం లోని పలు చిన్న, పెద్ద చెరువులు నిండుతున్నాయి. మరో మూడు నాలుగు రోజులు వర్షాల పరిస్థితి ఇలాగే ఉండనున్నట్టు వాతావరణ కేంద్రం తెలియచేయడంతో వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు అప్రమ త్తం అయ్యారు. డీఆర్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో 24గంటల పాటు పని చేసేలా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బాలరాజు



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న బాలరాజు

హనుమకొండ కలెక్టరేట్, జూలై21: హనుమకొండ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా(ఈడీ) రాపెల్లి బాల రాజు ఆదివారం కలెక్టరేట్ లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఈడీ బాలరాజు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా హనుమకొండ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న మాధవీలత బదిలీపై జనగామ జిల్లాకు వెళ్లారు. మాధవీలత స్థానంలో మహబూబాబాద్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఉన్న బాలరాజు నియామకమయ్యారు. అలాగే జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) బి.నిర్మల బదిలీపై నిజామాబాద్ జిల్లాకు వెళ్లారు. ఈమె స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.

బావిలో జారిపడి మహిళ మృతి

- మృతదేహాన్ని తీసేందుకు ప్రయత్నాలు
- ధర్మసాగర్ మండలం రాపాకపల్లి గ్రామంలో ఘటన



లచ్చమ్మ (ఫైల్)

ధర్మసాగర్, జూలై 21: బావిలో పడి బొంత లచ్చమ్మ (55)అనే వివాహిత ఆదివారం మృతి చెందింది. నీటిలో మృతదేహం జాడ దొరకకపోవడంతో నీటిని మోటార్లతో తోడుతున్నారు. ఈ ఘటన ధర్మసాగర్ మండలం రాపాకపల్లిలో ఆదివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం..

ధర్మసాగర్ మండలం రాపాకపల్లి వడ్డెర కాలనీకి చెందిన లచ్చమ్మ - కొమురయ్య దంపతులు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు అయ్యాయి. కాగా, ఆదివారం మధ్యాహ్నం పొలానికి నీళ్లు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు లచ్చమ్మ వెళ్లింది. విద్యుత్ మోటార్ ఆన్ చేయగా, నీళ్లు రాలేదు. దీంతో లచ్చమ్మ బావిలోకి వంగి చూసింది. ఈ క్రమంలో కాలు జారి బావిలో పడింది. నీళ్లు పెట్టేందుకు బావి వద్దకు వచ్చిన లచ్చమ్మ కనిపించకపోవడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి చూశారు. లచ్చమ్మ బావిలో పడ్డట్టు గమనించి వి షయాన్ని కుటుంబ సభ్యులకు, కాలనీ వాసులకు సమాచారం ఇచ్చారు. వారు బావి వద్దకు చూడగా మృతదేహం కనిపించలేదు. స్థానిక మాజీ సర్పంచ్ వి నోద జయేందర్ పోలీసులకు సమాచారాన్ని అందించడంతో సీఐ మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటికి తీసేందుకు రెండు విద్యుత్ మోటార్ల ద్వారా బావిలోని నీటిని తోడుతున్నారు.



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి గుడిసెవాసులు

- తాళాలు పగులగొట్టి వెళ్లి ఇక్కడే ఉంటామని బైఠాయింపు



తాళం పగుల గొడుతున్న మహిళలు

బాలసముద్రం, జూలై 21: హనుమకొండ బాలసముద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తాళాలను ఆదివారం గుడిసెవాసులు పగల గొట్టారు. అనంతరం ఇళ్లలోకి చేరుకొని శు భ్రం చేసుకొని తాము ఇక్కడే ఉంటామని పట్టుబట్టారు. దీంతో హనుమకొండ అంబేద్కర్ నగర్, జితేందర్‌నగర్‌లో ఉద్రిక్త వాతా వరణం నెలకొంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్, పోలీసులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాం తానికి చేరుకొని లబ్ధిదారులను బయ టకు పంపించేందుకు ప్రయ త్నించారు. దీంతో గుడిసెవాసులు

మిగతా 8వ పేజీలో..







గురువుల సేవలను స్మరించుకోవాలి

▸▸ 'నాకు నచ్చిన గురువు' గ్రంథావిష్కరణలో అందెశ్రీ

హనుమకొండ కల్చరల్, జూలై 21: ప్రతీ ఒక్కరి జీవితంలో ఏదో ఒక దశలో గురువు ప్రభావం కచ్చితంగా ఉంటుందని, ఆ గురువు స్ఫూర్తే జీవితానికి మార్గ దర్శనమని ప్రముఖ కవి డాక్టర్ అందెశ్రీ అన్నారు. ఆదివారం చక్రవర్తుల రాధా కృష్ణారావు, సాహితీ వేదిక అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షతన డాక్టర్ మడత భాస్కర్ సంపాదకత్వంలో ప్రచురించిన నాకు నచ్చిన గురువు వ్యాస సంకలనమును అందెశ్రీ ఆవిష్కరించారు. హనుమకొండలోని సామా జగన్మోహ న్‌రెడ్డి స్మారక భవన్‌లో ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అందెశ్రీ మాట్లా డుతూ.. కేవలం తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయులే గురువు కాదని, నిజ జీవితంలో అడుగడుగునా మార్పునకు నాంది పలికిన వ్యక్తి కూడా గురువేనని అన్నారు. ప్రకృతిలో అనేక ప్రాణులుకూడా గురుతర బాధ్యతను పోషిస్తూ మను షులకు మార్గదర్శనంగా ఉంటాయని అందెశ్రీ తనదైన శైలిలో వక్కాణించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఏఎస్ ఈ గురుకులం వ్యవస్థాపకుడు ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ.. ఎలా ఉండాలో మార్గదర్శనం చేసే వారే కాక, ఎలా ఉండకూడదో చెప్పే వారు కూడా గురువేనని అన్నారు. ప్రతీ ఒక్కరి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేది ముమ్మాటికీ గురువేనని అన్నారు. వందేమాతరం ఫౌండే షన్ వ్యవస్థాపకుడు వందేమాతరం రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరి జీవి తాలను తీర్చిదిద్దే గురువులను మర్చిపోవద్దని, ఇతరులకు మనం కూడా గురు వులుగా మార్గదర్శనం చేయాలన్నారు. డాక్టర్ సాగర్ల సత్తయ్య గ్రంథాన్ని సమీ క్షిస్తూ 72 మంది ప్రముఖులు వారి జీవితంలో ఉన్నత గురువుల మీద రాసిన వ్యాస సంపుటే ఈ గ్రంథమని ఒక్కొక్కరి జీవితాన్ని ఎలా తీర్చిదిద్దారో తెలియ జెప్పిన తీరు ఇతరులకు ఆదర్శంగాఉందని కొనియాడారు.ఆచార్య బన్న ఐలయ్య మాట్లాడుతూ.. వృత్తి విలువలు అంతరిస్తున్న తరుణంలో గురువులపై అద్భుత గ్రంథం వెలువరించిన మడత భాస్కర్‌ను అభినందించారు. కవి, విమర్శకుడు ప్రొఫెసర్ సీతారామ్, ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు, ఎస్ఎల్‌పీఏ నాయకులు చక్రవర్తుల మధు, కె.గౌరీశంకర్‌రావు, కానుగుల భద్రయ్య, అడ్లూరి వెంకటేశ్వర్లు, ముడుంబై ప్రవీణ్, గుండు రవి, షేక్ హాజీ నూరాని, డాక్టర్ శ్రీదేవి, తదితర అనేక మంది ఉపాధ్యాయులు, భాషాభిమానులు పాల్గొన్నారు.


'నాకు నచ్చిన గురువు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవి అందెశ్రీ



వసతి గృహానికి మైనర్ల తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

గిర్మాజీపేట, జూలై 21: ఒడిశా నుంచి కరీంనగర్ గ్రానైట్, మార్బుల్ పరిశ్ర మలో పనిచేసేందుకు రైల్లో తరలిస్తున్న ముగ్గురు బాలురతో పాటుగా వీరిని తరలిస్తున్న మరో మైనర్‌ను వరంగల్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, మహబూబాబాద్‌లోని ప్రభుత్వ వసతి గృహానికి శనివారం రాత్రి తరలించా రు. కాజీపేట ఆర్‌పీఎఫ్ ఎం.సంజీవరావు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బాలకార్మికుల తరలింపును అడ్డుకునే చర్యలలో భాగంగా కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు, వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్, ఎస్సై ఎం.అయిలయ్యలతో కూడిన బృందం శనివారం రాత్రి ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టినట్టు పేర్కొన్నారు. రైలులో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు బాలురతో పాటుగా వారిని తరలిస్తున్న మరో మైనర్‌ను రైల్వే పోలీ సులు అదుపులోకి తీసుకుని కాజీపేట ఆర్‌పీఎఫ్ ఠాణాకు తరలించి విచారిం చినట్లు సీఐ తెలిపారు. ఒడిశాకు చెందిన ముగ్గురు మైనర్లను కరీంనగర్ జిల్లాలోని మార్బుల్, గ్రానైట్ పరిశ్రమలలో పనిచేసేందుకు ఒడిశా చెందిన మరో మైనర్ తరలిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ఆది వారం వరంగల్ జీఆర్‌పీలో కేసు నమోదు చేసి నలుగురు మైనర్‌లను చైల్డ్ లైన్, సీడబ్ల్యూసీ సహకారంతో మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలుర వసతి గృహానికి తరలించినట్లు సీఐ సంజీవరావు తెలిపారు.

ప్రేమ జంటపై దాడి చేసిన వారిపై కేసు

శాయంపేట, జూలై 21 : ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసిన ఘటన శాయంపేటలో జరిగింది. ఎస్ఐ ప్రమో ద్‌కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన బైరి నిఖిల్, జగిత్యాల కు చెందిన దానవీని మణిలు ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా పోలీసులు ఇరువు రు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఈనేపథ్యంలో నిఖిల్ తన భార్య మణితో పాటు తన అమ్మమ్మ గ్రామమైన శాయంపేట మండ లంలోని పత్తిపాక గ్రామానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మణి కుటుంబసభ్యులు ఆదివారం నిఖిల్, మణిలపై దాడిచేసి మణిని తీసుకెళ్లడా నికి ప్రయత్నించారు. ఈక్రమంలో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సర్ది చెప్పారు. జరిగిన ఘటనపై నిఖిల్ ఫిర్యాదు మేరకు మణి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.











ప్రజల కన్నీళ్లే అగ్నిధారగా..

▸▸ జైలుగోడలపై చెరగని ముద్ర

▸▸ నేడు దాశరథి శతజయంతి

▸▸ ముస్తాబైన చిన్నగూడూరు దాశరథి ప్రాంగణం



చిన్నగూడూరు(మహబూబాబాద్ జిల్లా), జూలై 21: తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా నిజాం పాలనపై ఎక్కు పెట్టిన మహోన్నతుడు దాశరథి కృష్ణమాచార్య. ఆయన కవిత్వం ఓ తిరు గుబాటు. అయన పాట ఓ ధిక్కారం. దాశరథిగా ప్రసిద్ధి చెందిన కృష్ణమాచార్యులు తెలంగాణ విము క్తి కోసం అలుపెరుగని పోరాటం చేశారు. నైజాం రాజును వ్యతిరేకిస్తూ దాశరథి కవితలు రాయడం తో ఆయన్ని ఇందూరు జైలులో పెట్టారు. ఆయనకు కళాప్రపూర్ణ బిరుదుతో పాటు 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి, 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి, వేంకటేశ్వర యూనివర్సిటీ గౌరవ డి-లిట్‌ను అందుకున్నారు. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22న చిన్నగూడూరులో జన్మించారు. ధాశరథి తన తండ్రి వెంకటాచార్య నుంచి సంస్కృతం, తల్లి నుంచి భాగవతం నేర్చుకున్నారు. కౌశవర్య శాస్త్రి వద్ద వేదాలు, ఉపనిషత్తులు నేర్చుకున్నారు. 15ఏళ్ల వయస్సులో 25 పద్యాలను అవలీలగా చెప్పి అప్పటి సుబేదార్ నారాయణరావు ప్రశంసలు పొందారు. ఉపాధ్యాయుడిగా, పంచా యతీ ఇన్‌స్పెక్టర్‌గా, ఆకాశవాణిలో ఉద్యోగాలు చేశారు. 1961లో ఇద్దరు వి త్రులు సినిమా ద్వారా సినీరంగ ప్రవేశం చేసి వందలాది పాటలు రాశారు. కృష్ణమాచార్యులను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఘనంగా సత్కరించారు. 1987 నవంబర్ 5వ తేదీన ఆయన పరమదించారు.

ముస్తాబైన చిన్నగూడూరు దాశరథి ప్రాంగణం

దాశరథి శత జయంతి ఉత్సవాలకు చిన్నగూడూరు దాశరథి ప్రాంగణం ముస్తాబైంది. శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి దాశరథి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. ఆ వేడుకలకు ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, దేశపతి శ్రీనివాస్, నందినిసిధారెడ్డి, విరావత్‌అలీ, దేవిప్రసాద్ హాజరుకానున్న ట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు.

నేడు మానుకోటలో దాశరథి శత జయంతి సభ

మహబూబాబాద్ టౌన్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో ఈనెల 22న ఉదయం 10గంటలకు మహాకవి దాశరథి కృష్ణ మాచార్యుల శత జయంతి సభను నిర్వహించనున్నారు. జిల్లాలో దాశరథి శత జయంతి ఉత్సవాలను ఏడాది పొడవున నిర్వహించేందుకు దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో దాశరథి శత జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 22న ఉదయం 9 గంటలకు దాశరథి జన్మస్థలం చిన్నగూడూరులో ఆయన వి గ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అక్కడి నుంచి మహబూబా బాద్ జిల్లా కేంద్రం వరకు బైక్ ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం పట్టణం లోని ఎస్వీఎం ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు దాశరథి శతజయంతి ఉత్సవసభను నిర్వహించనున్నారు. సాహితీప్రియులు, కవులు, దాశరథి అభి మానులు పెద్ద సంఖయలో తరలివచ్చి జయంతి సభను జయప్రదం చేయా లని ఎమ్మెల్సీ దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు తక్కెళ్ల పల్లి రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు.


చిన్నగూడూరులో దాశరథి విగ్రహ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు, వివిధ పార్టీల నాయకులు

బ్యారేజీల వద్ద కొనసాగుతున్న ఉధృతి

- 'మేడిగడ్డ'లో 5.52 లక్షల ఇన్‌ఫ్లో
- అన్నారం బ్యారేజీకి 16,600 క్యూసెక్కులు
- సమ్మక్క బ్యారేజీకి 8,23,450 క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్/కన్నాయిగూడెం, జూలై 21 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి కొనసా గుతోంది. బ్యారేజీకి ఎగువన వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతూ వస్తోంది. శనివారం బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 3.73లక్షల క్యూసెక్కులుగా ఉండగా ఆదివారం సాయంత్రం వరకు 5.52 లక్షల క్యూసె క్కులకు పెరిగింది. దీంతో బ్యారేజీ 85 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. ఆదివారం బ్యారేజీ వద్ద 6 మీటర్ల ఎత్తులో గోదావరి నది ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజీ 66గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల నుంచి నీరు విడుదల చేసి వదులుతుండటంతోపాటు ఆదిలాబాద్, మహారాష్ట్ర సరిహద్దులోని ప్రాణహిత, ఇంద్రవతి నదుల నుంచి ఇన్‌ఫ్లో వస్తుండటంతో సమ్మక్క బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. 8,23,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో గేట్లన్నీ ఎత్తివేసి వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. సమ్మక్క బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 83.00మీటర్లు కాగా ఆదివారం సాయంత్రం 82.20 మీటర్లు నమోదైంది. అలాగే ఇదే మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జెచొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇన్‌టేక్ వెల్ వద్ద 83.60 మీటర్ల నీటిమట్టం నమోదైంది.


సమ్మక్క బ్యారేజీ నుంచి దిగువకు వదులుతున్న నీళ్లు


మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి


వాజేడు మండలం పూసూరు వంతెన వద్ద ఉరకలేస్తున్న గోదావరి

గోదావరి ఉగ్రరూపం

పెరుగుతున్న గోదావరి ఉధృతి

మహదేవపూర్/వెంకటాపురం(నూగూరు)/వాజేడు/మంగపేట/ఏటూరునాగారం, జూలై 21: ఎడతెరిపి లేని వర్షాలకు గోదావరి ప్రవాహం పెరుగుతోంది. భూపాలపల్లిజిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం ఆదివారం 9.50 మీటర్ల ఎత్తులో ప్రవాహం నమోదైంది. గోదావరి, ప్రాణహిత, మంజీరా నది ఉప్పొంగి ప్రవహించడం, ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో గోదావరి ఉధృతి పెరిగింది. కాళేశ్వరం వద్ద 9.50 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలంలో గోదావరి వరద క్రమక్రమంగా పెరుగుతోంది. మంగపేట రోడ్డులోని గోదావరిపాయకు వరద చేరడంతో గోదావరి లంకలోకి రాకపోకలు నిలిచిపోయాయి. వాజేడు మండలంలోని పేరూరు వద్ద గోదావరి క్రమేణా పెరుగుతోంది. ఆదివారం ఉదయం 8 గంటలకు 15.62 మీటర్లు ఉన్న నీటిమట్టం 10గంటలకు 15.71 మీటర్లు, 12 గంటలకు 15.74మీటర్లు, మధ్యాహ్నం2గంటలకు 15.79 మీటర్లు, 4గంటలకు 15.81 మీటర్లు, 6గంటలకు 15.85 మీటర్లు చేరుకుంది. ఎగువన ఉన్న ఇంద్రావతి, శ్రీరాంసాగర్,సమ్మక్కసాగర్‌బ్యారేజీల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో గోదావరికి వరద పెరిగింది. కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బ్యారేజీ, మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నుంచి వరద నీరు తరలిరావడంతో మంగపేట మండలంలోని కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్, పుష్కర ఘాట్ వద్ద గోదావరి పెరిగింది. 8.5 మీటర్ల మేర పరవళ్లు తొక్కుతోంది. ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఆదివారం ఉదయం పుష్కర ఘాట్ వద్ద నీటిమట్టం ఉదయం 7 గంటలకు 13.550 మీటర్లు ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు 14.470 మీటర్లు, సాయంత్రం 6 గంటలకు 14.380కు చేరుకొని మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువ అయింది. పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 14.830 మీటర్లకు చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయనున్నారు.

మోరంచవాగుకు మొదటి ప్రమాద హెచ్చరిక

- ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ


మోరంచవాగు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 21 : భూపాలపల్లి జిల్లాలోని మోరంచ వాగు మొదటి హెచ్చరిక సూచికను దాటి ప్రవహిస్తోందని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భూపాలపల్లి మండలం మోరంచపల్లి వద్ద వాగు ఉధృతిని ఆయన ఆదివారం పరిశీలించారు. గత ఏడాది జూలై 27న ఈ వాగు ఉగ్రరూపం దాల్చడంతో మోరంచపల్లి గ్రామం అంతా నీటమునిగి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లిన విషయం విదితమే. ఎడతెరిపి లేని వర్షాలకు ప్రస్తుతం మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ దానిని పరిశీలించారు. వరద ప్రభావం ఇంకా ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ముందుగానే ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

గత జూలైలో జరిగిన నష్టం పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయనవెంట ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, మురళీధర్‌రావు, ఎంపీడీవో భాస్కర్ తదితరులు ఉన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో మేయర్, కమిషనర్ పర్యటన

- భద్రకాళి బండ్ ప్రాంతంలో అధికారులకు పలు సూచనలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 21: ఇటీవల వరంగల్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మేయర్ గుండు సుధారాణి, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం భద్రకాళి బండ్ ప్రాంతంలో పర్యటించారు. వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మేయర్ సూచించారు. మేయర్ వెంట ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు ఉన్నారు.


భద్రకాళి బండ్ ప్రాంతంలో పర్యటిస్తున్న మేయర్, కమిషనర్

బల్దియా అప్రమత్తం

- ముంపు ప్రాంతాల ప్రజల కోసం కంట్రోల్‌రూమ్
- ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నెంబర్లు
- మూడు షిఫ్టులలో ఆరుగురు ఉద్యోగుల విధులు


బల్దియాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్

వరంగల్ కార్పొరేషన్, జూలై 21: విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైన సందర్భంలో ప్రజలు ప్రమాదాల్లో చిక్కుకుండా బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తుగా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణలో 24/7 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌లో మూడు టోల్ ఫ్రీ నెంబర్‌లతో పాటు వాట్సాప్ నెంబర్‌లను అందుబాటులో ఉంచారు. ఈ క్రమంలో 66 డివిజన్‌ల పరిధిలో ఇప్పటి వరకు 200 ఫోన్ కాల్స్ రాగా, విషయం ఉన్నతాధికారులతో పాటు సంబంధిత అధికారులకు చేరవేస్తున్నారు. డీఆర్ఎఫ్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకుని బాధిత ప్రజలకు చేయూతనిస్తున్నారు. ప్రధానంగా చెట్లు విరిగి రోడ్డుకు అడ్డుగా పడిపోయినా, ఇళ్లలోకి వర్షంనీరు చేరుకున్నా, కాలనీలు వర్షపు నీటితో జలమయమైనా, ప్రజలు నీటిలో చిక్కుకున్నా, విద్యుత్ ప్రమాదాల్లో చిక్కుకున్నా బాధితులు ఫోన్‌లు చేయగానే స్పందిస్తున్నారు. ఇందుకోసం కంట్రోల్ రూమ్‌లో షిఫ్టునకు ఇద్దరి చొప్పున మూడు షిఫ్టులలో నిష్ణాతులైన సిబ్బంది 24గంటలపాటు విధులు నిర్వర్తిస్తున్నారు.

అధికారులు

బల్దియా కంట్రోల్ రూమ్‌లో పని చేసేందుకు ఆరుగురు అధికారులను నియమిస్తూ కమిషనర్ రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్.భాస్కర్, ఎ.కృష్ణారావు, కె.రాకేశ్, బి.ప్రశాంత్, డి.అరుణ్, ఎల్.రాజ్‌కిరణ్‌లతోపాటు 66 డివిజన్‌లకు 66 మంది రెస్క్యూ టీమ్ అధికారులను నియమించారు. వీరిలో ఏఈలు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, డీఆర్ఎఫ్ సిబ్బంది ఉన్నారు.

బల్దియా కట్రోల్ రూం నెంబర్లు
టోల్‌ఫ్రీ నెంబర్: 1800425 1980
వాట్సప్ నెంబర్: 7997100300
సెల్ నెంబర్: 9701999645


రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
శంకర్‌లింగం, బల్దియా డీఎఫ్‌వో



నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి, ఇంకా కురిసే అవకాశం ఉంది గనుక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదంలో చిక్కుకున్నట్టు అనిపిస్తే వెంటనే కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలి. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రమాదాలు జరుగక ముందే ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. విపత్తు స్పందన సిబ్బంది ఎప్పటికీ అందుబాటులో ఉంటారు.

నిరంతరం పనిచేస్తున్నాం..
రాజారపు భాస్కర్, కంట్రోల్ రూమ్ అధికారి



కంట్రోల్ రూమ్‌లో కంటిమీద కునుకులేకుండా పనిచేస్తున్నాం. ఏ సమయంలోనైనా వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తాం. ఇప్పటికే చాలా ఫోన్ కాల్స్‌లో బాధితులు వివిధ సమస్యలను విన్నవిస్తే తక్షణమే అధికారులను సమన్వయం చేసుకుని పరిష్కార మార్గాన్ని చూపించాం. నిత్యం మూడు నెంబర్లు అందుబాటులో ఉంటాయి.

జోరు వర్షం

(5వ పేజీ తరువాయి)

కర్లపల్లి వద్దగల గుండ్లవాగు ప్రాజెక్టు మత్తడి పోస్తోంది. వాజేడు మండలంలో పర్యటించిన కలెక్టర్ గోదావరి ఉధృతి, వరద పరిశీలించారు. మంత్రి సీతక్క వరద పరిస్థితులపై కలెక్టర్, ఎస్పీలకు ఫోన్‌చేసి ఆరా తీశారు. ఏటూరునాగారం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు అతి సమీపంలో 14.350 మీటర్ల ఎత్తులో గోదావరి ఉరకలేస్తోంది. బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది.

స్తంభించిన రాకపోకలు

వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నారు. ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల, దొడ్ల, వాజేడు మండలం గుమ్మడిదొడ్డి, ఎడ్జర్లపల్లి, బొమ్మనపల్లి, చంద్రుపట్ల, మంగపేట మండలం శనిగకుంట, బొమ్మాయిగూడెం, ములుగు మండలం జగ్గన్నగూడెం, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాల్లో కొన్ని చివరి గ్రామాల ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో వాజేడు మండలం టేకులగూడెం వద్ద రేగుమాగు వాగు జాతీయ రహదారిని ముంచెత్తింది. దీంతో పోలీసులు ఆ దారిని మూసివేశారు. ఛత్తీస్‌గఢ్ వెళ్లే వాహనాలను గూడెప్పాడు మీదుగా, ఇటు జంగాలపల్లి మీదుగా భూపాలపల్లి వైపు మళ్లిస్తున్నారు. ములుగు మండలం బండారుపల్లి వద్ద రాళ్లవాగుపై తాత్కాలిక రోడ్డు తెగిపోగా బుద్దారం, గణపురం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపురం మండలం లింగాపూర్, గుర్రంపేట, అన్నంపల్లి వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండంతో హెచ్చరిక బోర్డులు పెట్టిన పోలీసులు వేరే దారులగుండా వాహనాలను మళ్లించారు.

- భూపాలపల్లి జిల్లా జనం విస్తారంగా కురుస్తున్న వర్షాలకు అతలాకుతలం అవుతున్నారు. పలుచోట్ల వాగులు ఉప్పొంగడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద గోదావరి ఉప్పొంగింది. చేలల్లో వర్షపు నీరు నిలిచి పంటలు దెబ్బతినే దుస్థితి నెలకొంది. ప్రమాదపుటంచున లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సిద్ధమయ్యారు. ఎడతెరిపి లేని వర్షానికి సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. జిల్లాలో 67.8 విల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రేగొండలో 92.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. కాళేశ్వరం వద్ద గోదావరి నది ప్రవాహం 9 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తుండగా అధికారులు అప్రమత్తమయ్యారు. సమీప ప్రాంతాల వారిని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోరికొత్తపల్లి మండలంలోని జంషేడ్‌పేట్ వంతెన వద్ద వరద ఉధృతి తీవ్రంగా పెరగడంతో నిజాంపల్లితోపాటు ములుగు వెళ్లే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. టేకుమట్ల, రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య తాత్కాలికంగా పోసిన మట్టిరోడ్డు వరదలకు తెగిపోవడంతో తొమ్మిది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మహాముత్తారం మండలంలోని కాటారం, కేశవాపూర్ గ్రామాల మధ్య పెద్దవాగుపై వరద ఉధృతి పెరగడంతో రాకపోకలు ఆగిపోయాయి. కాటారం మండలంలో 74.4 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గుమ్మళ్లపల్లిలోని మైసమ్మకుంట మత్తడికి గండి పడటంతో కింది భాగంలో ఉన్న పంటల్లోకి నీరుచేరింది. బొర్రవాగు, అలుగువాగు ఉప్పొంగడంతో కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. భూపాలపల్లి మండలంలోని మోరంచవాగు ఉధృతి మూడో హెచ్చరిక దాటడంతో ఆ గ్రామ ప్రజలకు సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు. గణపసముద్రం నీటిమట్టం 17ఫీట్ల ఎత్తుకు పెరిగింది. భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు- 2, 3లలో మూడు రోజులుగా బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఈ రెండు ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా చేరడంతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. సుమారు 19వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో సుమారు రూ.6కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ గనిలో వర్షంనీరు నిలువగా 18వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో సుమారు రూ.4కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.
- మహబూబాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. కొత్తగూడ మండలంలో పలువాగులు పొంగిపొర్లుతుండడంతో గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. చెరువులు మత్తడి పోస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వానలు కురుస్తున్నా.. వర్షాలతో జలపాతాలకు భారీగా వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో శనివారం రాత్రి ఓ మోస్తారు వర్షం కురిసింది. ఆదివారం కూడా పొద్దంతా ముసురు అలుముకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి, మొండ్రాయి మధ్యలో ఉన్న బ్రిడ్జిపై నుంచి నాలుగు ఫీట్ల ఎత్తువరకు వాగు ప్రవహిస్తోండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మొండ్రాయిగూడెం, మోకాళ్లపల్లి, చక్రాలతండా, గుండం, తిమ్మాపురం, ఆదిలక్ష్మీపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కత్తెర్లవాగు కూడా పొంగి ప్రవహిస్తోండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మున్నీవాగు, కొత్తపల్లివాగు, బూర్కపల్లివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో ఉన్న వివిధ గ్రామాల చెరువులకు నీరు చేరి మత్తడిపోస్తున్నాయి.

మహబూబాబాద్-జమాండ్లపల్లి, బయ్యారంలోని మున్నేరువాగుఉధృతంగా ప్రవహిస్తోంది. గంగారం మండలంలో కోమట్లగూడెం, కాటినాగారం చెరువులు అలుగుపడి రహదారిపై వరదనీరు ప్రవహిస్తోండడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. గూడూరు మండలంలోని భీమునిపాదం వద్ద ఎస్సై నగేష్, అటవీశాఖ రేంజ్ అధికారి సురేష్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా బందోబస్తు నిర్వహించారు. కాగా, గూడూరు మట్వాడ శివారు దొరవారి తిమ్మాపురం వద్ద రెండు వాగులు పొంగుతోండటంతో ఆ గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. దొరవారి తిమ్మాపురం గ్రామంలో సరిగ్గా ఫోన్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొర్రూరు మండలంలోని సోమ్లతండాకు చెందిన జాటోతు పాండు, హరిపిరాల గ్రామంలో చిర్రబోయిన రాములుకు చెందిన ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.ఎంపీడీవో సిలార్‌సాహెబ్ ఆ ఇళ్లను పరిశీలించారు. కాగా, జిల్లాలోని వివిధ మండలాల్లో వర్షం కురుస్తూనే ఉంది. రోజు కురుస్తున్న వర్షాలతో మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న, ఇతర పంట చేలలో వర్షపునీరు నిలుస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- వరంగల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 36.7 మిమీ వర్షపాతం నమోదు కాగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మరో 20.6మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు 267.6మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరదనీటితో చెరువులు, కుంటలు నిండుతున్నాయి. వ్యవసాయదారులు ఇంతకాలం వర్షాలు లేక, చెరువులు, కుంటలు నిండక పంటల సాగు విషయంలో ఊగిసలాడారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సాగు పనుల్లో మునిగిపోయారు. ఆరు తడి పంటలకు ఇప్పుడు కురుస్తున్న వర్షాలు ఊపిరిని అందించినట్లయింది. వరంగల్‌లోని భద్రకాళి చెరువు, దేశాయిపేట చిన్న వడ్డెపల్లి చెరువు అలుగు పారుతోంది. దేశాయిపేటలో కేతమ్మకు చెందిన ఇల్లు కూలిపోయి నిరాశ్రయురాలైంది. జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఇళ్లకే పరిమితం కాగా, రైతులు మాత్రం పొలం పనుల్లో మునిగిపోయారు. పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండలో చెరువుకట్ట రోడ్డు కుంగిపోయింది. నర్సంపేట పట్టణంలోని రోడ్లపై భారీగా వరదనీరు నిలవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. పట్టణ శివారు మాధన్నపేట చెరువు నీటిమట్టం 9.3 అడుగులకు చేరడంతో జలకళ సంతరించుకుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఖానాపురం మండలం కొత్తూరులో మద్దూరి యాకయ్యకు చెందిన ఇల్లు ధ్వంసమైంది.


జలకళను సంతరించుకున్న పాకాల సరస్సు

22 అడుగులకు చేరుకున్న పాకాల సరస్సు

ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి 22 అడుగులకు చేరుకుంది. 30 అడుగుల పూర్తి సామర్థ్యంగల సరస్సులోకి 22 అడుగుల నీరు రావడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.

ఎల్‌ఈడీ ట్యూబ్ తయారీపై విద్యార్థులకు రేపు వర్క్‌షాప్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 21 : కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో ఈనెల 23న విద్యార్థులకు ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్ తయారీపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.వాసంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌జీసీ ఎకో క్లబ్ కలిగిన ప్రతీ పాఠశాల నుంచి 8, 9 తరగతుల నుంచి ముగ్గురు చొప్పున పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ వర్క్‌షాప్ కేయూసీ రోడ్ రెడ్డికాలనీలోని వికాస్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచే రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస స్వామిని సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

విద్యాశాఖలో బదిలీలు పూర్తి

- డీఈవోలు, ఆర్జేడీలు మినహా అందరికీ స్థానచలనం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 21 : విద్యాశాఖలో డీఈవోలు, ఆర్జేడీల బదిలీలు మినహా బదిలీలు పూర్తయ్యాయి. శనివారం అర్ధరాత్రి సూపరింటెండెంట్లు, ఏడీల బదిలీల ఉత్తర్వులను విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేశారు. హనుమకొండకు కె.సత్యనారాయణను ఏడీగా బదిలీ చేయగా, వరంగల్ డీఈవో కార్యాలయానికి ఎం.జ్ఞానేశ్వర్‌ను బదిలీ చేశారు. వరంగల్ ఆర్జేడీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎ.ఉమామహేశ్వర్ మబూబాబాబాద్ డీఈవో కార్యాలయానికి బదిలీ కాగా, మహబూబాబాద్ డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేసీఎస్ పాణి వరంగల్ ఆర్జేడీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వరంగల్ డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వి.శ్రీధర్‌స్వామి భద్రాద్రి కొత్తగూడెం డీఈవో కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలోకి భద్రాద్రి కొత్తగూడెం డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ వి.జ్యోతి వరంగల్ డీఈవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇక సీనియర్ అసిస్టెంట్ల విభాగంలో వరంగల్‌లో పనిచేస్తున్న కొమార్ క్రాంతి ఖమ్మం ఎన్‌టీ బుక్స్‌కు, సీహెచ్.శ్రీనివాసరావు మహబూబాబాద్ డీఈవో కార్యాలయానికి, ఆర్జేడీ కార్యాలయం నుంచి కె.శ్రీనివాసరావు ఖమ్మం డీఈవో కార్యాలయానికి, బీఈడీ కళాశాల నుంచి ఎం.రవిబాబు ఖమ్మం డీఈవో కార్యాలయానికి, హనుమకొండ డీఈవో కార్యాలయం నుంచి టి.గాయత్రిదేవి ఖమ్మం డీఈవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఖమ్మం నుంచి కె.ఉష హనుమకొండలోని బీఈడీ కళాశాలకు, మహబూబాబాద్ డీఈవో నుంచి పి.సౌజన్య వరంగల్ ఆర్జేడీ కార్యాలయానికి, ఖమ్మం డీఈవో కార్యాలయం నుంచికె. శశికుమారి ఆర్జేడీ కార్యాలయానికి, జి. నందకిషోర్ వరంగల్ డీఈవో కార్యాలయానికి, షకీల్ అహ్మద్ వరంగల్ డీఈవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. వీరంతా సోమవారం వారికి బదిలీ అయిన కార్యాలయాల్లో రిపోర్టు చేయనున్నారు.


భద్రకాళి ఆలయంలో భక్తుల మొక్కులు


భద్రకాళి దేవాలయ ఆవరణలో వర్షంలో క్యూలో ఉన్న భక్తులు

భద్రకాళి నమో నమః

- శాకంబరీ అలంకరణలో అమ్మవారు
- హోమ పూర్ణాహుతితో ముగిసిన వేడుకలు
- వర్షంలో సైతం బారులుదీరిన భక్తులు

వరంగల్ కల్చరల్, జూలై 21 : ప్రతీ ఏటా ఆషాఢ శుద్ధ అమావాస్య నుంచి పౌర్ణమివరకు నిర్వహించే శాకంబరీ ఉత్సవాలు ఈఏడాది వైభవోపేతంగా జరిగాయి. 6న మొదలైన ఉత్సవాలు 21న ఆషాఢ శుద్ధ పౌర్ణమి ఆదివారం శాకంబరీ అలంకరణతో ముగిశాయి. ఐదు టన్నుల కూరగాయలతో శనివారం కూరగాయల మాలలను దండలుగా తయారుచేసి శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 9గంటల వరకు అమ్మవారి గర్భాలయం, దేవాలయ ప్రాంగణం మొత్తం అన్నిరకాల కాయకూరలు, ఆకుకూరలు,పండ్లతో అమ్మవారిని అలంకరించారు. ఉదయం వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబం, గండ్ర సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు.

వర్షంలోనూ బారులుదీరిన భక్తులు

ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం పడుతున్నా వేలాది మంది భక్తులు అమ్మవారిని శాకంబరీ అలంకరణంలో దర్శించుకోవాలని పెద్దసంఖ్యలో బారులు తీరారు. క్యూలైన్లలో అమ్మవారి నామస్మరణతో పరిసరాలు భక్తిభావంలో ఉప్పొంగాయి. వివిధ ప్రాంతాల నుంచి కూడా రవాణా మార్గం నుంచి అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. భద్రకాళి సేవా సమితి ఐతా గోపీనాథ్ ఆధ్వర్యంలో ప్రసాదాన్ని ఉదయం నుంచి భక్తులకు వితరణ చేశారు. ఆరు క్వింటాళ్ల ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

భక్తులకు ఇక్కట్లు

పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి రాగా సర్వ దర్శనంతో చాలా సమయం దర్శనానికి పట్టడంతో భక్తులు క్యూలైన్లలోనే వేచి ఉన్నారు. దేవస్థానం రూ.100, రూ.50 స్పెషల్ దర్శనం టికెట్లు పెట్టడంతో ధర్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అలాగే అమ్మవారి దర్శనానికి వీఐపీల తాకిడి పెరిగింది. దాతలు, ప్రముఖులు, దేవస్థానానికి నిత్యం వచ్చే భక్తులతో రద్దీ పెరిగింది. దీనికి తోడు పరిచయం ఉన్నవారు కూడా వీఐపీ లైన్ నుంచి దర్శించుకోవడంతో సర్వదర్శనం భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

పోలీసు భారీ బందోబస్తు

ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రధాన దారులు, దేవాలయంలో క్యూలైన్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వర్షంలో ఇబ్బంది కాకుండా ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాల్లో వాహనాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని, శాకంబరీ దర్శనం భక్తులకు సంతోషాన్ని కలిగించిందని ఈవో శేషు భారతి తెలిపారు.

కేయూ బీఫార్మసీ సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు 26

కేయూ క్యాంపస్, జూలై 21: కాకతీయ యూనివర్సిటీ బీఫార్మసీ(సీబీసీఎస్) మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫీజులను జూలై 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుములో జూలై 30వరకు చెల్లింపునకు అవకాశం ఉందని పేర్కొన్నారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు.

కేయూ ఫార్మాడీ పరీక్షల ఫీజు గడువు 27

ఫార్మా-డీ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజులును జూలై 27 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో జూలై 31 వరకు అవకాశం ఉందని స్పష్టంచేశారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు.

అవయవ దానానికి ముందుకు రావాలి


మాట్లాడుతున్న ప్రసాద్‌రావు

హనుమకొండ టౌన్, జూలై 21 : మరణానంతరం ప్రతీ ఒక్కరు శరీర అవయవదానానికి ముందుకు రావాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ గుండె వైద్యనిపుణుడు దాసరి ప్రసాద్ రావు కోరారు. అదివారం 53వ డివిజన్ ఆదర్శకాలనీలో సామాజికవేత్త పరికిపండ్ల వేణు నివాసంలో రాష్ట్ర నేత్ర, శరీర అవయవదాతల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శరీర అవయవ దానంపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మరణానంతరం తన కుటుంబసభ్యులు నేత్ర, దేహ అవయవదానంకు సహకరించేలా ముందే అవగహన కల్పించాలన్నారు. కాళోజీ నారాయణరావు ఆ రోజుల్లోనే తన పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నాడని గుర్తుచేశారు. తెలంగాణ నేత్ర, శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వర లింగం మాట్లాడుతూ.. మెడికల్ విద్యార్థుల పరీక్షల కోసం ప్రతి ఒక్కరూ అవయవదానంకు ముందుకు రావాలన్నారు. అవయవదానం అనేది ఎంతోమందికి పునర్జన్మనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కో- ఆర్డినేటర్ మల్లారెడ్డి, రాష్ట్ర కో- కన్వీనర్ రామచందర్, ఉమ్మడి జిల్లా బాధ్యులు కరేటి శంకర్‌రావు, శ్రవణ్‌కుమార్, కామిడి సతీష్‌రెడ్డి, రాజు, యుగేందర్, ఐ బ్యాంక్ వెంకటేశ్వర్‌రావు, రాధాకృష్ణ, విజయ, మహేందర్‌రెడ్డి, ముచ్చర్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

కేఎంసీలో అధ్యాపకుల కొరత

వరంగల్ మెడికల్, జూలై 21: ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జరిగిన బదిలీలతో కేఎంసీలో అధ్యాపకుల కొరతకు దారితీసిందని టీ జూడా చైర్‌పర్సన్ డా క్టర్ శ్రీనాథ్ పేర్కొన్నారు. ప్రత్యేకత కలిగిన, అనుభ వజ్ఞులైన అధ్యాపకులను తప్పనిసరిగా బదిలీ చేయడం వల్ల ఏర్పడిన ఖాళీలను నింపలేమన్నారు. విద్యార్థులకు, రోగులకు నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు అందించలేమని తెలిపారు. వైద్య కళాశాల, ఆస్పత్రి సమ ర్థతను నిర్వహించడానికి కీలకమైన అనేక విభాగాలు ఇప్పుడు పనిచేయ డంలో విఫలమయ్యే ప్రమాదం పొంచి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రుణమాఫీ రాని రైతులు హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలి

ఐనవోలు, జూలై 21: మండలవ్యాప్తంగా రుణమాఫీ కానీ రైతులు ఐనవోలు రైతు వేది కలో ఏర్పాటు చేసిన రైతు సహాయక కేంద్రం (హెల్ప్ డెస్క్)ను సంప్రదించాలని ఏవో ఆడెపు కవిత తెలిపారు. రూ.లక్ష రుణం ఉండి మాఫీ కానీ రైతులు తమ ఆధార్ జిరాక్స్ కాపీలను వెంటతీసుకవచ్చి అందించాలని సూచించారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 21: సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తు న్న ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యో గుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మొగిలిచర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజును హనుమ కొండలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీని వాస్ మాట్లాడుతూ.. 2023లో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేస్తున్న క్రమంలో టీపీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డితో పాటు ప్రస్తుత ఎమ్మెల్యేలు సందర్శించి హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని గుర్తుంచు కొని రెగ్యులరైజ్ చేయాలన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఎమ్మెల్యే నాగరాజు సానుకూలంగా స్పందిస్తూ కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు జయశ్రీ, శోభారాణి, సుమలత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ ఆటో యూనియన్ అడ్డా ప్రారంభం



వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో కాకతీయ ఆటో యూనియన్ అడ్డాను ప్రారంభిస్తున్న యూనియన్ నేతలు

వడ్డెపల్లి, జూలై 21: హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ ఆటో యూనియన్ అడ్డాను ఆదివారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్, 58వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, జిల్లా నేత తాళ్లపల్లి రవీందర్ (జేకే), తాళ్లపల్లి విజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ఆటో యూనియన్ రాష్ట్ర నేత రాయికంటి రఘు, కాకతీయ ఆటో యూనియన్ వడ్డెపల్లి అడ్డా అధ్యక్షుడు ఇల్లందుల కరుణాకర్, రామకృష్ణ, రాము, ఎండి అక్మల్, మండల సమ్మయ్య,తేళ్ల కిశోర్, ఎండి గౌస్, టి. సతీష్, జున్ను సదానందం,ఎన్. విజయ్, ఎస్. కరుణాకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత అధికారికి సన్మానం



అర్చకుడు, డిప్యూటీ కమిషనర్‌లను సన్మానిస్తున్న ఈవో సదానందం, ఉద్యోగ, అర్చకులు

ఐనవోలు, జూలై 21: గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్, ఎండోమెంట్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ ఆర్.జ్ఞానదేవరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగే శ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, వేద పండితులు గట్టు పురుషోత్తంశర్మ, విక్రాంత్ వినాయకజోషి, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుక ర్‌శర్మ, అర్చకులు నరేష్, దేవేందర్, కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నాయిని జన్మదిన వేడుకలు

కాజీపేట, జూలై 21: కాజీపేట బాపూజీనగర్‌లో ఆదివారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాం గ్రెస్ నాయకులు సిరిల్ లారెన్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిం చారు. రెడ్‌క్రాస్ సమక్షంలో జరిగిన ఈ శిబిరానికి ఎమ్మెల్యే నాయిని హా జరై ప్రారంభించారు. అనంతరం సుమారు 50 మంది రక్తదాతలకు సర్టి ఫికెట్లు అందజేశారు. అ తర్వాత కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొ రేటర్ గొల్కొండ రాంబాబు, నాయకులు సిలువేరు విజయ భాస్కర్, ఇప్ప శ్రీకాంత్, మాతంగి స్వామి, సల్లూరి నాగేశ్వర్ రావు, బి. శ్రీనివాస్, ఒగ్గుల భద్రయ్య తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడు కలను మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ 58, 60 డివిజన్ల పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నం చందర్ ఆధ్వర్యం లో హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని ఒయాసిస్ అనాథాశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం ఆశ్రమం లోని అనాథ పిల్లలకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాం గ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల సమ్మయ్య, తాళ్లపెల్లి రవీందర్, జన గాం శ్రీనివాస్‌గౌడ్, ఎండి అక్మల్, ఎం.శేఖర్, బుస్స నవీన్, శేషు, యుగం ధర్, సాజిద్, కమల్, ప్రసాద్‌తోపాటు ఆశ్రమ నిర్వాహకులు వొద్దిరాజు చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగ ల్ ఉమ్మడి జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేష్‌గౌడ్, ఎం.డి. అంకూషావలి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రతినిధి కల్లూరి పవన్, జిల్లా నేత బొంత రామకృష్ణ తదితరులు హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో మర్యా ద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు.

● న్యూశాయంపేట: ఎమ్మెల్యే నాయిని రాజేం దర్ రెడ్డి జన్మదిన వేడుకలు 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆధ్వర్యంలో డివిజన్‌లోని న్యూశాయంపేటలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్య క్షులు అంకేశ్వరపు సురేందర్, నాయకులు మామిండ్ల సురేష్ పాల్గొన్నారు.

● జూలైవాడ: ఎమ్మెల్యే నాయిని జన్మదిన వేడుకలను స్థానిక కార్పొ రేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ 49వ డివిజన్ ప్రకాశ్‌రెడ్డిపేటలోని తెలంగాణ పాలి క్లినిక్ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కార్పొరేటర్ మానస రాంప్రసాద్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన పుట్టిన రోజును పురస్కరించుకొని ఆదివారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ట్రా ఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ సిబ్బందికి రెయిన్ కోట్స్ అందజే శారు. కార్యక్రమంలో ఈవీ శ్రీనివాసరావు ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, సత్యనా రాయణ, తిరుమల్, సీఐలు షూకూర్, నాగబాబు పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్: నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు గ్రేటర్ వరంగల్ 5వ డివిజన్ కొత్తూరుజెండాలోని డివిజన్ పార్టీ కార్యాల యంలో నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు తాడిశెట్టి విద్యాసాగర్ నేతృత్వంలో కేట్ కట్‌చేసి స్వీట్లు పంచి అన్నదానం చేశారు. ఈ కార్యక్ర మంలో గ్రంధాల సంస్థ మాజీ చైర్మన్ ఎమ్డీ అజీజ్‌ఖాన్, మాజీ కార్పొరే టర్ విద్యాసాగర్, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, చీకటి ఆనంద్, మాజీ కార్పొరేటర్లు నెక్కొండ కిషన్, రవీందర్, నాయకులు సతీష్, సృజన్‌కాంత్, వెంకన్న, బిక్షపతి పాల్గొన్నారు.

● హనుమకొండ(ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం హనుమకొండ వేయిస్తంభాల గుడిలోని శ్రీ రుద్రే శ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి పాశుపత రుద్రాభిషేకం నిర్వహించారు. రాజేందర్‌రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని సతీమణి నీలిమ, కూతురు గోదాదేవితో కలిసి ఆలయా నికి వచ్చారు. అనంతరం పాతుపత రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. పంచా మృతాలు, సుగంధ ద్రవ్యాలు, పసుపుకుంకుమ విలేపనాది చూర్ణాలతో అభిషేకం జరిపారు. శివప్రీతికరమైన బిల్వాలతో అర్చన చేశారు. నీరాజన మంత్రపుష్పాల అనంతరం ఆలయ మండపంలో నాయినికి స్వామి తీర్థ ప్రసాదాలను ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, వేదపండి తుడు గంగు మణికంఠ అందచేశారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. నాయిని వెంట కార్పొరేటర్లు కిషన్, రజాలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు నాయిని లక్ష్మారెడ్డి, బంకా సంపత్ తదితరులు ఉన్నారు.



కొత్తూరు జెండాలో రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



వేయిస్తంభాల గుడిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి



ట్రాఫిక్ సిబ్బందికి రెయిన్ కోట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

హనుమకొండ కల్చరల్, జూలై 21: హ నుమ కొండ ఏషియన్ మాల్ పక్కన గల షిరిడి సాయి బాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుక లను ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భం గా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజ లు చేశారు. ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాన్ని మందిర పూజారులు కిశోర్‌శర్మ, మణిశర్మ, చందులు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మహా అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ మెతుకుపల్లి హరగోపాల్, ధర్మకర్తలు రాకం సదా నందం, నిమ్మల శ్రీనివాస్, వెయ్యిగండ్ల రమేష్, పూ స సురేష్‌కుమార్ తదితరులు పాల్గొని శిరిడి సాయినాథుడిని దర్శించుకున్నారు. సాయంత్రం సంధ్యా హారతి, పల్లకీ సేవా, శేజహారతి కార్యక్ర మంతో గురుపౌర్ణమి మహోత్సవాలు ముగిశాయి.

శ్వేతార్కలో గురుపౌర్ణమి

కాజీపేట: కాజీపేట శ్వేతార్కమూలగణపతి దేవాలయంలో ఆదివారం ఆషాడపౌర్ణమిని పురస్క రించుకుని గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆలయంలోని గురుదత్తాత్రేయ స్వామి, సద్గురు షిరిడీ సాయిబాబ తదితర గురుదేవులకు గురుపూ జోత్సవం నిర్వహించారు. ఐనవోలు సాయికృష్ణ వర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆనంద్‌కుమార్, హరి కృష్ణ స్వామి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృత పంచవర్ణ గంగాజలాలతో అభిషేకం చేసి మంగళహారతులు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

● ధర్మసాగర్: మండలంలోని కేశవనగర్ శివా రు బంజారుపల్లి గ్రామంలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సుప్రభాతం, అభిషేకం, సత్య వ్రత పూజలను నిర్వహించారు. భక్తుల కోసం దేవాలయ కర్త ముత్తి రెడ్డి అమరేందర్‌రెడ్డి అన్నదానం చేశారు. అనం తరం ప్రత్యేక రథంలో షిర్డీ సాయిబాబాను భక్తి గీతాలను ఆలపిస్తూ గ్రామంలో ఊరేగింపు చేశారు.



కాజీపేటలో పూజలు చేస్తున్న భక్తులు



సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి గుడిసెవాసులు

(5వ పేజీ తరువాయి)

అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు గుడిసెవాసులు మాట్లాడుతూ.. ఐదేళ్ల కిందట తమ కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గుడిసెల్లో ఉండలేకపోతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఇవ్వడం లేదన్నారు. ఇళ్లు కేటాయించే వరకు ఇక్కడి నుంచి కదిలే దని లేదని తెగేసి చెప్పారు. అనంతరం గుడిసెవాసులకు తహసీల్దార్, పోలీసులు సర్దిజెప్పి గుడిసెవాసులను అక్కడి నుంచి బయటకు పంపించేశారు.

పోచమ్మ బోనాలు ఎత్తిన హిజ్రాలు

పరకాల, జూలై 21: ప్రతీ సంవత్సరం ఆషాడంలో భా గంగా పరకాల పట్టణానికి చెందిన జంపయ్య ఆధ్వర్యం లో హిజ్రాలు ఆదివారం పోచమ్మ బోనాలను ఎత్తారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి భూపాలపల్లి రోడ్డు మార్గంలోని పోచమ్మ గుడి వరకు డప్పు చప్పుళ్ల మధ్య బోనాలను ఎత్తుకొని నృత్యాలు చేశారు.

మత్తళ్లు పోస్తున్న చెరువులు

సోమిడి, వడ్డెపల్లి చెరువులకు జలకళ

వడ్డెపల్లి, జూలై 21: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు హనుమకొండలోని వడ్డెపల్లి చెరువుకు జలకళ ఉట్టిపడుతోంది. ఎగువ ప్రాంతంలోని కాజీపేట పరిసరాల్లో గల సో మిడి చెరువు మత్తడి పోస్తున్న దృష్ట్యా ఆ నీరంతా వడ్డెపల్లి చెరువు లోకి చేరడంతో ఆదివారం ఉదయం నుంచి వడ్డెపల్లి చెరువు మత్త డి పోస్తుంది. పలువురు మత్తడి అలుగుపోయడాన్ని తిలకించారు.

● కాజీపేట: మూడు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలతో కాజీపేటలో పలు కాలనీలు జలమయమైయ్యాయి. లోతట్టు కాలనీ రోడ్లు, గుంతలలో నీరు చేరి స్థానికుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. కాజీపేట మండలం చుట్టుపక్కల గ్రామాలలో వర్షం నీరు సోమిడి చెరువులోకి చేరడంతో సోమిడి చెరువుకు మత్తడిప డింది. మత్తడి ద్వారా పడుతున్న నీరు చూడడానికి స్థానికులు కు టుంబాలతో సహా చెరువువద్దకు చేరి ఆ దృష్యాలను తిలకించారు. కొందరు మత్తడిలో చేపలు పట్టడానికి ఆసక్తి చూపారు.

● హనుమకొండ బస్టాండ్ జలమయం

బాలసముద్రం: హనుమకొండ ఆర్టీసీ బస్టాండులోకి వరద నీరు చేరి బస్టాండ్ ప్రాంగణమంతా బురదమయంగా మారింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదివారం వరద నీరంతా డ్రెయి నేజీ నీరులో నిండి కిందికి ఉన్న బస్టాండ్ ప్రాంగణంలోకి చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. బస్టాండ్ ప్రాంగణం కిందికి ఉండ డం, డ్రెయినేజీ కాల్వ రోడ్డుసైడు పైకి ఉండటంతో కొద్ది వర్షానికి డ్రె యినేజీ నిండి బస్టాండ్‌లోకి బురద నీరు వస్తోందనీ ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నామమాత్రపు పనులు చేయ డంతో కొద్ది పాటి వర్షానికి బస్టాండ్ ప్రాంగణ వర్షం, డ్రెయినేజీ నీటి తో నిండి ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని జఠిలంగా మారిన సమస్యను చక్కదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మత్తడిపోస్తున్న వడ్డెపల్లి చెరువు



జలమయమైన హనుమకొండ బస్టాండ్ ఆవరణ

జిల్లాలో తగ్గుతున్న లోటు వర్షపాతం

హనుమకొండ, జూలై, 21 : జిల్లాలో లోటు వర్షపాతం క్రమంగా తగ్గుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 316.7 మి.మీ. ఉండాలి. కానీ మూడు రోజులుగా కురిసిన ఒక మోస్తరు భారీ వర్షాల వల్ల 403.6 మి.మీ. పడింది. అంటే సాధారణం కన్నా 98.9 మి.మీ. వర్షం అధికంగా పడింది. బంగాళాఖాతంలో ఏర్ప డిన అల్పపీనడ ప్రభావం పుణ్యమా అని 8 మండలాల్లో సాధారణం కన్నా మించి అధికంగా కురిసింది. ధర్మసాగర్‌లో అత్యధికంగా వర్షపాతం నమోదు అయింది. నడికూడ మండలంలో ఇప్పటికి వర్షపాతం సాధారణంగానే ఉంది.

వర్షపాతం

భీమదేవరపల్లి మండలంలో 27.2 మి.మీ., వేలేరులో 34.2 మి.మీ., ఎల్కతుర్తిలో 49.5 మి.మీ., కమలాపూర్‌లో 68.3 మి.మీ., హసన్‌పర్తిలో 57.2 మి.మీ., ధర్మసాగ ర్‌లో 40.2 మి.మీ., కాజీపేటలో 42.9 మి.మీ., హనుమకొండలో 42.7 మి.మీ., ఐన వోలులో 26.6 మి.మీ., పరకాలలో 84.2 మి.మీ., దామెరలో 74.6 మి.మీ., ఆత్మకూ రులో 63 మి.మీ., శాయంపేటలో 92.1 మి.మీ., నడికూడలో 76.8 మి.మీ., వర్షం కురిసింది. గడిచిన ఈ 24 గంటల్లో జిల్లాలో సాధారణంగా 10.2 మి.మీ., కురవాల్సి ఉండగా, అంతకన్నా మించి 44.5 మి.మీ., అధికంగా కురిసింది.

రైల్వే కార్మికుల సంక్షేమమే ధ్యేయం



పాక రాజ్‌కుమార్

కాజీపేట, జూలై 21: రైల్వే కార్మికులు భద్రత, వారి సంక్షే మమే సంఘ్ కేంద్ర కమిటీ నాయకుడు మర్రి రాఘవయ్య ధ్యేయమని సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం కాజీపేటలో ఎంప్లా యీస్ సంఘ్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావే శంలో రాజ్‌కుమార్ మాట్లాడారు. లోకోపైలెట్‌ల విధి నిర్వ హణ, ప్రాముఖ్యతపై రైల్వే బోర్డు కమిటీ ఏర్పాటుకు రాఘ వయ్య చేసిన కృషి అభినందనీయం అన్నారు. అందుకు లోకో పైలెట్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా అశోకా జంక్షన్

ట్రాఫిక్ సిగ్నల్స్ అస్తవ్యస్తం

అడ్డదిడ్డమైన పార్కింగ్‌తో వాహనదారులు ఇబ్బందులు

హనుమకొండ చౌరస్తా, జూలై 21: హనుమకొండ అశోకా జంక్షన్‌లో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే అశోకా జంక్షన్‌లో లక్షల రూపాయలు వెచ్చించి అత్యాధునిక సాంకేతికత కలిగిన ట్రాఫిక్ సిగ్న ల్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే అవి కొన్ని రోజుల్లోనే పని చేయకపోవ డంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. సిగ్నల్స్ నిర్వహణ లోపం, సరైన ప్రణాళిక, పోలీసుల పర్యవేక్షణ లేమి కారణంగా వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. అశోకజంక్షన్‌లో పాతసిగ్నళ్లు పని చేయకపోవడంతో వాటి స్థానంలోనే కొత్తవి ఏర్పాటుచేశారు. అయితే పాత సిగ్నల్ స్తంభాలను తొలగించకపోవడంతో అటుగా వెళ్లే ప్రయాణి లకు ఆ సిగ్నళ్లు కనబడక ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అదేవి ధంగా జంక్షన్‌లోని ట్రాఫిక్ సిగ్నళ్లు సాంకేతిక లోపం వల్ల ప్రణాళికబ ద్ధంగా వెళ్లే ప్రయాణికులు నియంత్రణ తప్పి ఇష్టానుసారంగా రాకపో కలు జరపడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇంతజరుగు తున్నా అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు వాహదారులు విమర్శిస్తున్నారు.

అడ్డదిడ్డమైన పార్కింగ్‌తో అవస్థలు

హనుమకొండ 8వ డివిజన్ పరిధిలోని అశోకా జంక్షన్ నుంచి కాంగ్రెస్ భవన్ గుండా కుమార్ పల్లి, బుద్ధ భవన్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా ఉంటోంది. అక్కడ ఉన్న వైన్స్ షాపు ఎదుట మందుబాబులు వాహనాలు అడ్డదిడ్డంగా నిలపడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బం దులు పడుతున్నారు. అసలే ఇరుకైన రోడ్లు.. ఈ ప్రాంతంలో పలు వాణిజ్య సముదాయాలు, షాపులు ఉన్న కారణంగా జనం ఇబ్బందులు పడుతుంటే.. మరో పక్క మందు బాబుల అక్రమ వాహనాల పార్కింగ్‌తో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అలాగే మద్యం స్టాక్‌తో వచ్చే పెద్ద పెద్ద వాహనాలను రోడ్డుకు అడ్డుగా నిలిపివేయడంతో పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక రాత్రి వేళలో మందుబాబులు అటుగా వెళ్లే వారి పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తూ గొడవలకు దిగుతుండడంతో అ రోడ్డు మార్గంలో ప్రయాణం చేసే పాదచా రులు కుటుంబలతో వెళ్లే వాహనదారులు జంకుతున్నారు. వాహనాలకు అడ్డూ అదుపు లేకుండా ఇష్టారాజ్యంగా రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారని పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.




అశోక జంక్షన్‌లో పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్



కాంగ్రెస్ భవన్ రోడ్డు మార్గంలోని వైన్స్‌షాపు ఎదుట అక్రమ పార్కింగ్ చేయడంతో స్తంభించిన వాహనాలు

రాత్రి వేళ ఆ రోడ్డు నుంచి వెళ్లలేక పోతున్నాం..



కాంగ్రెస్ భవన్ నుంచి కుమార్‌పల్లి, బుద్ధ భవన్ వైపు వేళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న వైన్స్ షాపు ముందు రోడ్డు పక్కన విచ్చల విడి గా వాహనాలు పార్కింగ్ చేయడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో అటుగా వెళ్లలేక పోతు న్నాం. నిత్యం వివిధ పనుల నిమిత్తం ఈ రోడ్డు గుండా వెళ్లే క్రమంలో మందుబాబులు తమ వాహనాలను అక్రమ పార్కింగ్‌తో రోడ్డు మొత్తం నిండిపోవడం కార ణంగా ఒక్కో సారి గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. సాయంత్రం వేళల్లో వైన్స్ షాపుకు పెద్ద ఎత్తున మందు బాబులు వాహనాలతో తరలి రావడంతో ఉన్న చిన్న పాటి రోడ్డు అ పక్కనే వారి వాహనాలు పార్కింగ్ చేయడంతో అటుగా వేళ్లే వాహనాలతో రోడ్డు మొత్తం నిండుకొని ట్రాఫిక్ జామ్ తో అటు వేళ్లలేక పోతున్నాం.

- డి. శ్రీనివాస్, వాహనదారుడు కుమార్‌పల్లి

న్యూస్ మేకర్

పతకాలకు తుపాకీ గురిపెట్టి



ఇండియన్ షూటర్, హర్యాణా అమ్మాయి, మను భాకర్ రెండోసారి ఒలింపిక్స్ బరిలోకి దిగబోతోంది. టోక్యో ఒలింపిక్స్‌లో సాంకేతిక సవాళ్ల ఫలితంగా తాను పాల్గొన్న మూడు పోటీల ఫైనల్స్‌లో అర్హత సాధించలేకపోయిన మను, ప్యారిస్ ఒలింపిక్స్ కోసం ఎలా సిద్ధపడుతుందో తెలుసుకుందాం!

టోక్యో, 2020 ఒలింపిక్స్ గాయం మానిపోయినా, ఆ ఆనవాళ్లు అలాగే మిగిలి ఉన్నాయి. ఒకప్పటి టీనేజర్‌లో మునుపటి దుందుడుకుతనం స్థానాన్ని హుందాతనం ఆక్రమించింది. ఈసారి మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి, పతకాలను గెలుచుకోవాలనే కృతనిశ్చయం మనులో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్యారిస్‌కు రెండు గంటల ప్రయాణ దూరంలోని చతోహా షూటింగ్ రేంజ్‌లో ఉన్న మను, కోచ్, మాజీ ఏషియన్ గేమ్స్ ఛాంపియన్, జస్పాల్ రాణా ఆధ్వర్యంలో షూటింగ్ సాధన చేస్తోంది. తొలి ఓటమితో కుంగుబాటుకు గురైన మను, ఒక సందర్భంలో ఓటమికి కోచ్‌నే బాధ్యుడిని చేస్తూ, అతని కోచింగ్ నుంచి పక్కకు తప్పుకుంది. కానీ తప్పును తెలుసుకున్న తర్వాత, తిరిగి జస్పాల్‌నే కోచ్‌గా ఎంచుకుంది. "ఒక సందర్భంలో ఆటకు గుడ్‌బై చెప్పేద్దామనుకున్నాను. కానీ అంత త్వరగా ఓటమికి తల వంచడం నాకిష్టం లేదు. అందుకే జస్పాల్ సారధ్యంలో, ఆయన మార్గనిర్దేశంలో రెండోసారి ఒలింపిక్స్‌కు సిద్ధపడ్డాను. కష్టపడతాను, ఫలితాన్ని ఆ భగవంతుడికే వదిలేస్తాను. నా మీద ఒత్తిడి కచ్చితంగా ఉంది. కానీ ఇప్పుడా ఒత్తిడిని అధిగమించి ప్రతిభ కనబరిచే స్థాయికి చేరుకున్నాను. కొన్నిసార్లు ఆందోళనకు కూడా లోనవుతూ ఉంటాను. అలాంటి సందర్భాల్లో ఏదో ఒక సినిమా గురించి లేదంటే ఏదో ఒక సందర్భం గురించి ఆలోచించడం మొదలుపెట్టడం నేర్చుకున్నాను. ఇంతకుముందు ఓటమి నుంచి కోలుకోడానికి నాకు కొన్ని రోజుల సమయం పడుతూ ఉండేది. కానీ ఇన్నేళ్ల సాధనతో ఓటమి గురించి మూడు, నాలుగు రోజుల బాధ పడితే ఫరవాలేదు. అంతకంటే ఎక్కువ రోజులు బాధ పడుతూ కూర్చోవడం వల్ల ఉపయోగం ఉండదనే విషయాన్ని గ్రహించాను. కాలంతో పాటు ప్రజలు మర్చిపోయినట్టే, మనమూ మర్చిపోవాలి. నేనెన్నో పోటీల్లో నెగ్గాను. కానీ టోక్యో ఒలింపిక్స్‌లో ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయినప్పుడు, విపరీతంగా కుంగిపోయాను" అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటూ తన అనుభవాన్ని మీడియాతో పంచుకుంది మను.

> టీనేజీ వయసులోనే అతి తక్కువ కాలంలో ర్యాంకింగ్‌ను పెంచుకుని, భారతదేశపు షూటింగ్ స్టార్‌గా ఎదిగిన మను స్వస్థలం హర్యాణాలోని, జాజ్జర్. బాక్సర్లు, రెజ్లర్లకు పుట్టినిల్లయిన హర్యాణాకు చెందిన మను స్కూలు రోజుల్లో టెన్నిస్, స్కేటింగ్, బాక్సింగ్ క్రీడల్లో పాల్గొంది. థాంగ్ టా అనే మార్షల్ ఆర్ట్స్‌లో కూడా పాలుపంచుకుని జాతీయ స్థాయిలో పతకాలను సైతం గెలుచుకుంది. తర్వాత 14 ఏళ్ల వయసులో, 2016 రియో ఒలింపిక్స్ ముగిసిన సమయంలో, షూటింగ్‌లో తన ప్రావీణ్యాన్ని పరీక్షించాలని నిర్ణయించుకుంది. ఆ పోటీలు ముగిసిన వారం రోజులకే మను తన తండ్రిని స్పోర్ట్ షూటింగ్ పిస్టల్ కొనిపెట్టమని అడగడం, ఆమె తండ్రి రామ్ కిషన్ భాకర్ వెంటనే పిస్టల్‌ను కొనివ్వడం వెంటవెంటనే జరిగిపోయాయి. అలా అప్పట్లో ఆ తండ్రీకూతుళ్లు తీసుకున్న ఒక నిర్ణయం నేడు ఆమె ఒలింపియన్ స్థాయికి ఎదగడానికి తోడ్పడింది.

ముచ్చటగా మూడు పోటీల్లో...

ఈ 22 ఏళ్ల షూటర్ ఒక్క ఒలింపిక్ పతకం తప్ప మిగతా పతకాలెన్నిటినో గెలుచుకుంది. ఈసారి ప్యారిస్‌లో జరగబోతున్న ఒలింపిక్స్‌లో పది మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, పది మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్, ఈ మూడు పోటీల్లో పతకాలను గెలుచుకోవాలని కలలు కంటోంది. "గత ఒలింపిక్స్‌లో పాల్గొన్న సమయంలో నాలో అంత ధైర్యం లేదు. కానీ ఈసారి ధైర్యంగా బరిలోకి దిగాలనుకుంటున్నాను. రొటీన్‌కు కట్టుబడి పూర్తి సామర్థ్యాన్ని, ప్రతిభనూ కనబరచాలనుకుంటున్నాను. ఇక ఫిట్‌నెస్ విషయానికొస్తే, ప్రతి నెలా కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉంటాను. నాది 6/6 విజన్. కళ్లు అలసటకు గురికాకుండా ఉండడం కోసం స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేసుకుంటూ ఉంటాను. రోజు మొత్తంలో కేవలం రెండు గంటల స్క్రీన్ టైమ్‌కే పరిమితమవుతూ ఉంటాను. షూటింగ్ కోసం ఉపయోగించే టైమర్ నా ఫోన్లో ఉంటుంది కాబట్టి దాని కోసమే ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తాను. యూట్యూబ్‌లో మ్యూజిక్ వింటూ ఉంటాను. అలాగే వాట్సాప్ కాల్స్, మెసేజెస్, ఆన్‌లైన్ వయొలిన్ క్లాసెస్ కోసం కొంత సమయాన్ని వెచ్చిస్తాను" అంటూ చెప్పుకొచ్చింది మను.

కోచ్‌తో విభేదాలు

మనుతో దెబ్బతిన్న అనుబంధం గురించి కూడా మను మీడియాకు ఇలా వివరించింది. "మా ఇద్దర్లో ఎన్నో విభేదాలున్నాయి. వాటిని పరిష్కరించుకుని దృఢపడడం కీలకమైన విషయమని నా అభిప్రాయం. ఏది జరిగినా మన మంచి కోసమే అని అందరూ అంటూ ఉంటారు. కానీ మన జీవితంలో అంతా తప్పే జరుగుతున్నప్పుడు, అది కూడా మన మంచికే అని ఎందుకు భావించాలి? నేనిలాంటివి నమ్మను. నాకు భగవంతుడి మీద, గురువు మీద విశ్వాసం ఉంది. జస్పాల్‌తో నాకు మనస్పర్థలు వచ్చాయి. మమ్మల్ని విడదీయాలని ఎంతోమంది విశ్వ ప్రయత్నం చేశారు. అదే జరిగింది. కానీ తప్పు తెలిసొచ్చిన తర్వాత, నా అంతట నేనే ఆయన్ను సంప్రతించాను. 2024 తర్వాత షూటింగ్ నుంచి దూరమవడం లేదా ఆయనతో కలిసి షూటింగ్ కొనసాగించడం.. ఈ రెండిట్లో ఏదో ఒకటి జరుగుతుందని ఆయనతో చెప్పాను. 2024 ఒలింపిక్స్‌లో గెలిచినా, ఓడినా ఆ తర్వాత నుంచి షూటింగ్‌ను వదిలేస్తానని లేదంటే ఆయనతోనే కలిసి షూటింగ్‌ను కొనసాగిస్తాననీ అన్నప్పుడు, ఆయన నాతోనే షూటింగ్‌ను కొనసాగించు అన్నారు. తిరిగి జస్పాల్ సారధ్యంలో సాధన చేయడం సంతోషంగా ఉంది. ప్యారిస్ ఒలింపిక్స్‌లో కచ్చితంగా పతకాలు గెలుస్తాననే నమ్మకం కలుగుతోంది" అంటూ చెప్పుకొచ్చింది మను. ఆ అమ్మాయి మీద భారతదేశం పెట్టుకున్న నమ్మకాలు ఎంతవరకూ నిజమవుతాయో తెలియాలంటే, ప్యారిస్ ఒలింపిక్స్ వరకూ ఆగక తప్పదు.



"రవి వలె కవి కూడా లోకబాంధవుడు" అని సాహిత్యలోకానికి చాటిన చైతన్యశీలి... నిరంకుశత్వ పాలనపై అక్షరాల "అగ్ని ధార"ను కురిపించిన కవి... పీడిత ప్రజావాణికి బలాన్నిచ్చి "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని ఎలుగెత్తి చాటిన సాహిత్యకారుడు... తెలుగు సినీ సాహిత్యానికి సొబగులద్దిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సంవత్సరం ఇవాళ మొదలవుతుంది. ఈ సందర్భంగా దాశరథి జీవితానుభవాలను ఆయన కుమార్తె వంగిపురపు ఇందిర నవ్యతో చెబుతున్నారిలా.!

మా నాన్న 'శాంతమూర్తి'

మహాకవిగా జన నీరాజనాలు అందుకున్న దాశరథి కృష్ణమాచార్య కూతురుగా పుట్టడం నా అదృష్టం. నేను ఇందిరాగాంధీ అంతటి గొప్పదాన్ని అవ్వాలనేమో, మా నాన్న నాకు 'ఇందిర' అని పేరు పెట్టారు. ఆయన నన్ను డాక్టరుగా, తమ్ముడు లక్ష్మణ్‌ను ఇంజినీరుగా చూడాలనుకొన్నారు. అది కుదరలేదు. కనీసం వారి సాహిత్య వారసత్వం కూడా మాకు అబ్బలేదు. సరస్వతీదేవి మమ్మల్ని కటాక్షించలేదని మేమన్నా అప్పుడప్పుడు అనుకుంటాంగానీ, నాన్న మాత్రం ఆ మాట ఎన్నడూ అనలేదు. నన్ను ప్రేమగా 'బుజ్జి' అని పిలిచేవారు. మమ్మల్ని అస్సలు కోప్పడేవారే కాదు. ముఖం మీద చెదరని చిరునవ్వుతో... తెల్లని ధోతీ, కాలరులేని పొడవు చేతుల చొక్కా ధరించిన నాన్న రూపం నా కళ్ళ ముందు ఈనాటికి మెదులుతుంటుంది. సాహిత్య పుస్తకాలు, కాగితాలతో నిండిన బ్రీఫ్‌కేసు ఒకటి ఎప్పుడూ ఆయన వెంట ఉండేది. సభలు, సమావేశాల్లో గంటలకొద్దీ అనర్గళంగా ఉపన్యసించే నాన్న ఇంట్లో మాత్రం మితభాషి. పరుషంగా మాట్లాడరు సరి కదా, కనీసం చిరాకు, అసహనం ప్రదర్శించిన సందర్భం ఒక్కటీ లేదు. తన కవిత్వంలో ఆవేశాన్ని, ఆగ్రహజ్వాలలను అంతగా పలికించిన మా నాన్న నిజ జీవితంలో మాత్రం ఓ శాంతమూర్తి.

మా ఇంటికి మహాకవుల రాకపోకలు ...

నాన్న సినిమాలకు పాటలు రాస్తున్న సమయంలో... 1963 నుంచి 1979 వరకు చెన్నైలో ఉన్నాం. నా చదువు కూడా అక్కడే సాగింది. మొదట నన్ను జర్మన్ స్కూల్లో చేర్పించారు. నాకు తెలుగు రావడంలేదని తర్వాత కేసరి హైస్కూలుకు మార్చారు. మాతృభాషంటే నాన్నకు అంత ఇష్టం. మేము వీఎం స్ట్రీట్‌లోని ఒక అపార్టుమెంటులో ఉండేవాళ్లం. మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గారిది మాది ఎదురెదురు ఫ్లాట్లు కావడంతో, రెండు కుటుంబాల మధ్య మంచి స్నేహం ఏర్పడింది. శ్రీశ్రీ, ఆరుద్ర లాంటి మహాకవుల రాకపోకలతో మా ఇల్లు కళకళలాడుతుండేది. వచ్చిన వారికి మంచినీళ్ళతో పాటు టీ, కాఫీలు అందించడమే కానీ నేనెప్పుడూ వారితో సంభాషించింది లేదు. నాన్న అప్పుడప్పుడు నన్ను మెరీనా బీచ్‌కు, సినిమాలకు తీసుకెళుతుండేవారు. ఒకవైపు సినిమా పాటలు, సాహిత్య కార్యక్రమాలతో ఎంత బిజీగా ఉన్నా మా కోసం తప్పకుండా కొంత సమయం కేటాయించేవారు. చిన్నాపెద్ద భేదాల్లేకుండా తనకు వచ్చిన ప్రతి ఉత్తరానికి తిరిగి జాబు రాయడం నాన్నకు అలవాటు. అలా కొన్ని వందల ఉత్తరాలు, నాన్న చెబుతుంటే నేను రాశాను. చాలా సాహిత్య సభలకు వెంట నేనూ వెళ్లాను. కానీ సినిమా షూటింగులకు తీసుకెళ్ళడం లాంటివి మాత్రం ఎప్పుడూ చేయలేదు.

> **అక్కినేనికి 'గాలిబ్ గీతాలు' అంకితం**
> సినీపరిశ్రమలో మా నాన్నకు అత్యంత ఆత్మీయులంటే అక్కినేని నాగేశ్వరరావు గారే! అన్నపూర్ణ పిక్చర్స్ నిర్మించిన ప్రతి సినిమాలో నాన్న పాట తప్పనిసరిగా ఉండేది. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలోని 'మరో ప్రపంచం' సినిమాకు నాన్న ఒక పాట రాసి పారితోషికం తీసుకోలేదు. మహాత్మా గాంధీ శతజయంత్యుత్సవాల సందర్భంగా ఒక గొప్ప ఆశయాన్ని ప్రతిఫలిస్తూ తీసిన సినిమా కనుక వద్దన్నారు.

> ఓ రోజు ప్రముఖ దర్శక, నిర్మాత ఆర్. నారాయణ మూర్తిగారు సుద్దాల అశోక్‌తేజను వెంటపెట్టుకొని మా ఇంటికి వచ్చారు. "ఆ చల్లని సముద్రగర్భం...' పాట హక్కులు అడుగుతూ, మాకు కొంత డబ్బు కూడా ఇవ్వబోతే మేము తీసుకోలేదు. మా నాన్న ప్రజల మనిషి. ఆయన రాసిన ఆ పాటపై సర్వహక్కులు ప్రజలకే ఉంటాయి అని చెప్పాం.

అప్పుడు చాలా బాధపడ్డారు

అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా నాన్న బాధ్యతలు స్వీకరించాక, చెన్నైలో ఉంటూ తాను ఆ హోదాకు పూర్తి న్యాయం చేయలేననుకున్నారు. దాంతో 1979లో కుటుంబమంతా తిరిగి హైదరాబాద్‌కు వచ్చాం. ఆ సమయంలో చేతినిండా సినిమా అవకాశాలు ఉన్నా, స్వరాష్ట్రంలో సాహిత్య రంగానికి తనవంతు సేవ చేయాలన్న ఉద్దేశంతో వాటిని కాదనుకున్నారు. తాను ఒకటి తలిస్తే, విధి మరొకటి తలచిందన్నట్టు ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆ పదవులను రద్దు చేయడంతో నాన్న చాలా బాధపడ్డారు. ఆస్థాన కవిగా అప్పటి వరకున్న కారు, హోదా లాంటివి పోయినందుకు కాదు, తెలుగు సమాజానికి తనవంతు సేవచేసే అవకాశం కోల్పోయినందుకు కొంత ఆవేదనకు లోనయ్యారు. కానీ అదెన్నడూ ఇంటిలో ప్రదర్శించలేదు. నాన్నకు కష్టాలు కొత్తకాదు కదా.! అదివరకే ఆకాశవాణి ఉద్యోగానికి రాజీనామా చేయడంతో కుటుంబ పోషణ కాస్త కష్టమైంది. అయినా, వెనక్కితగ్గలేదు. ఒకరి దగ్గర చేయి చాచకుండా, మాకు ఏ లోటు రాకుండా కుటుంబాన్ని చూసుకున్నారు. జనం గోడును వినిపించడమేకానీ తన వ్యక్తిగత బాధలకు మా నాన్న ఎప్పుడూ విలువ ఇవ్వలేదు. ప్రముఖ రచయితగా గుర్తింపు వచ్చిన తర్వాత కూడా చాలా సాహిత్య సమావేశాలకు కాలినడకన, మరీ దూరమైతే రిక్షాలో వెళ్లేవారు. నిర్వాహకులు కారు పంపుతామంటే కూడా వద్దు అనేవారు. నాన్న స్థితప్రజ్ఞత, సింప్లిసిటీ చూసి ఒక్కోసారి నాకే ఆశ్చర్యమేసేది.

> **పిల్లలంటే అంత ప్రేమ**
> నా భర్త పేరు వంగిపురపు గౌరీశంకర్. ఆయనది గుంటూరు జిల్లా. సినీ నేపథ్యగాయకుడు ఎమ్మెస్ రామారావు గారికి నా భర్త మేనల్లుడు (బావమర్ది కుమారుడు) అవుతారు. రామారావుగారితో నాన్నకు ఉన్న స్నేహం వల్ల మా పెళ్లి కుదిరింది. అలా ఆంధ్రా ఇంటి కోడలిని అయ్యాను. మాకు ఒక బాబు. వాడికి అరుణ్ కిరణ్ అని మా నాన్న పేరు పెట్టారు.

జైలు జీవితంతో జీవితకాల బాధ

నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న కారణంగా నాన్న 16నెలలకుపైగా ఖైదు అనుభవించారు. కానీ అది ఆయన ఆరోగ్యం మీద జీవితకాలం ప్రభావం చూపింది. జైల్లో రాజకీయ ఖైదీలకు సిమెంటు, సున్నం కలిపి చేసిన రొట్టెలు పెట్టేవారట. అవి తినడం వల్ల నాన్న జీర్ణవ్యవస్థ దెబ్బతింది. తర్వాత కొంతకాలానికి బీపీ, షుగర్ వచ్చాయి. మితాహారం తీసుకుంటూ చాలా క్రమశిక్షణగా ఉండేవారు. అయినా ఆయన ఆరోగ్యం దెబ్బతింది. నా ఒడిలోనే చివరి శ్వాస విడిచారు. నాన్న మాకు దూరమై 36ఏళ్లు దాటినా, తనను తలచుకోని రోజు లేదు. మా అమ్మ 2012లో కన్నుమూశారు. అమ్మానాన్నకు చివరి రోజుల్లో సేవ చేసే భాగ్యం నాకు దక్కింది. రాజకీయాలతో సంబంధంలేకుండా దాశరథి జయంత్యుత్సవాలను తెలంగాణ ప్రభుత్వం కొనసాగిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది దాశరథిగారి శత జయంతి సంవత్సరం. ఆ మహాకవి స్ఫూర్తిని ఈతరానికి తెలిపే ప్రయత్నాలు కొనసాగాలి. అదే ఆయనకు అసలైన నివాళులు.

● సాంత్వన్, ఫొటో: జ్వాలా కోటేశ్

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
4. చలేయా (జవాన్)
5. సోనీ సోనీ (ఇష్క్‌విష్క్ రీబౌండ్)
6. నైనా (క్రూ)
7. ఓ మాహీ (డంకీ)
8. అపనా బనాలే (భేడియా)
9. తేరీ బాతోమే (తేరీ బాతోమే ఐసా ఉల్ఝా జియా)
10. నాదానియా (నాదానియా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్:
కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)

నవ్య | చిత్రజ్యోతి

రెండో సీజన్ వచ్చేస్తోంది

టీసీఏ ఫిబ్రవరిలో సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ మొదటి సీజన్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సీజన్ సూపర్ హిట్ కావడంతో ఇప్పుడు నవంబరు 15, 16వ తేదీలలో రెండో సీజన్‌ను నిర్వహించనున్నారు. ఇందులో పలువురు సెలబ్రిటీలు ఆడనున్నారు. ఈ మ్యాచ్‌ల ద్వారా వచ్చిన మొత్తం డబ్బును ఆస్ట్రేలియాలోని 'రాయల్ చిల్డ్రన్స్ హాస్పిటల్ మెల్బోర్న్'కు విరాళంగా అందజేయనున్నారు. తాజాగా సీజన్ 2 సాఫ్ట్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ సాయికృష్ణ



మాట్లాడుతూ "ఇందులో పాల్గొనే సెలబ్రిటీస్ ఎంతో బిజీగా ఉన్నా చారిటీ కోసం ఈ మ్యాచ్‌లు ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. "ఈ రెండో సీజన్ మొదటి సీజన్ కంటే మరింత పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని హీరో శ్రీకాంత్ అన్నారు. "ఇందులో ఆడే ప్రతీ ఒక్కరికీ క్రికెట్ అంటే ప్రాణం" అని హీరో తరుణ్ చెప్పారు. "సీజన్ 1లో ఆడటాన్ని బాగా ఎంజాయ్ చేశాను. సీజన్ 2 కోసం ఎదురుచూస్తున్నాను" అని సంగీత దర్శకుడు తమన్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ హీరోలు ఆది సాయికుమార్, సుశాంత్, అశ్విన్‌బాబు, సామ్రాట్, ఓమ్‌కార్, ఆర్టిస్ట్ భూపాల్ పాల్గొన్నారు.




దర్శకుడిగా సంతృప్తినిచ్చింది

- ధనుష్

'నటుడిగా నన్ను మీ గుండెల్లో పెట్టుకున్నారు. ఇప్పుడు 'రాయన్' చిత్రంతో దర్శకుడిగా మీ ముందుకు వస్తున్నాను. సినిమా చూసి నచ్చితే తెలుగు ప్రేక్షకులు అంతా మీ ఆశీస్సులు అందించాలి' అని హీరో ధనుష్ కోరారు. ఆయన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'రాయన్'. ఈ నెల 26న విడుదలవుతోంది. సన్‌పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రాని ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ "నేను అదృష్టవంతుణ్ణి. సినిమాల్లోకి వచ్చాక నాకు అన్నీ కలసి వచ్చాయి. మంచి దర్శకులు, నిర్మాతలతో పనిచేసే అవకాశం నాకు దక్కింది. వారందరి కృషి వల్లే నేడు ఈ స్థాయిలో ఉన్నాను. దర్శకుడిగా నాకు సంతృప్తిని ఇచ్చిన చిత్రం 'రాయన్' అన్నారు. సందీప్ కిషన్ మాట్లాడుతూ 'ధనుష్ అన్న నన్ను పిలిచి ఈ సినిమా చేయమన్నాడు. ఆయన మీద నమ్మకంతో కథ కూడా వినకుండా ఈ సినిమా అంగీకరించాను. ధనుష్ తన కోసం రాసుకున్న పాత్రను నాకు ఇచ్చారు. ఆయన దర్శకత్వంలో నటించడం నా అదృష్టం' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'అద్భుతమైన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానగణాన్ని సొంతం చేసుకున్న నటుడు ధనుష్. ఆయనకు 'రాయన్' చిత్రంతో మరో ఘన విజయం దక్కాలి. 'గేమ్‌ఛేంజర్' సినిమాతో క్రిస్మస్‌కు కలుద్దాం' అన్నారు. సురేశ్‌బాబు మాట్లాడుతూ 'ధనుష్ చిన్నప్పటి నుంచే నాకు తెలుసు. రాయన్‌లో ఒక పాటకు లిరిక్స్ కూడా అందించాడు. ఆయనకు సినిమాపై ఉన్న ప్రేమకు ఇది నిదర్శనం. 'రాయన్' సినిమాను తెలుగు రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అన్నారు.

ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించినవాళ్లందరిలో ఓ ఆకలి కనిపిస్తోంది. గొప్ప నటులను ఒకతాటిపైకి తెచ్చాడు ధనుష్. ఆయన ఇప్పుడు ఒక దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. తనలో క్లారిటీ ఉంది. కొన్ని తరాలకు అతనే స్ఫూర్తి' అని చెప్పారు.

రిలీజ్‌కు సిద్ధమైన బచ్చన్



హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతి బాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మాస్ ప్రేక్షకులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సినిమాను విడుదల చేయనున్నట్లు ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సినిమాలో రవితేజ, బిగ్ బీ అమితాబ్ ఫ్యాన్‌గా కనిపించనున్నారు. ఇందులో ఆయన ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ పాత్రను పోషించనున్నారు. యాక్షన్‌తో కూడుకున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ అందరికీ నచ్చుతుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఉజ్వల్ కులకర్ణి, డీఓపీ:ఆయనంక బోస్, సంగీతం: మిక్కీ.జే. మేయర్.

సహృదయాన్ని చాటుకున్న శేష్



సినిమాల్లో తన నటనతో అందర్నీ ఆకట్టుకునే నటుల్లో అడవి శేష్ ఒకరు. ఆయన తాజాగా ఓ చిన్నారి విషయంలో, తన సహృదయాన్ని చాటుకున్నారు. తన అభిమాని అయిన ఓ చిన్నారి క్యాన్సర్‌తో బాధపడుతున్న సంగతి తెలుసుకున్న శేష్, ఆ చిన్నారిని కలసి.. ఒక రోజంతా ఆడుతూ పాడుతూ గడిపారు. ఈ చిన్నారి విషయంలో ఎటువంటి సాయం కావాలన్నా అందుబాటులో ఉంటానని ఆమె కుటుంబ సభ్యులకు హామీనిచ్చారు.

ఘన విజయం సాధించాలి



పులివెందుల మహేశ్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి కృష్ణ, సుమన్, ఆమని కీలక పాత్రలు పోషిస్తున్నారు. నైనీషా, రాహుల్ త్రిశూల్ నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ఈ సినిమా టీమ్‌కు నా అభినందనలు. సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ఈ సినిమాలోని అధిక శాతం షూటింగ్ క్రౌడ్ ఫండింగ్ ద్వారా తెరకెక్కింది. బడ్జెట్ సరిపోకపోవడంతో సినిమాకు కావాల్సిన మిగిలిన మొత్తాన్ని నిర్మాతలు ఇచ్చారు. సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని హీరో, దర్శకుడు పులివెందుల మహేశ్ అన్నారు. "ప్రేక్షకులు మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్ని తప్పక ఆదరిస్తారు. ఈ సినిమా కూడా అలాంటిదే" అని నిర్మాత రాహుల్ త్రిశూల్ చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎన్.హరిబాబు, డీఓపీ: ధర్మ ప్రభ, సంగీతం: హర్ష ప్రవీణ్.



విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. ఈ ముక్కోణపు ప్రేమకథని రవితేజ్ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తుళ్లూరి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ సెట్స్‌లోకి శ్రద్ధా శ్రీనాథ్ అడుగుపెట్టారు.

ట్రెండీ లుక్‌లో స్టైలిష్‌గా

ఆమెను ఆహ్వానిస్తూ.. మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. శ్రద్ధా ఇందులో ట్రెండీ లుక్‌లో స్టైలిష్‌గా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: అన్వర్ అలీ, డీఓపీ: మనోజ్ కటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్.

దిక్సూచి
వరంగల్ • సోమవారం 22 జూలై 2024
diksuchi@andhrajyothy.com



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 2

భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023

బీఎన్ఎస్ఎస్‌లో 531 సెక్షన్లు ఉన్నాయి. పాతచట్టమైన సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండేవి. దీనినుంచి 14 సెక్షన్లను ప్రస్తుతం పూర్తిగా తొలగించి, కొత్త చట్టాన్ని మరికొన్ని సవరణలతో తీసుకువచ్చారు.

కీలకాంశాలు

- బీఎన్ఎస్ఎస్ న్యాయ విచారణలోని వివిధ అంశాలు, దశలకు సంబంధించి కచ్చితమైన కాల అవధులను నిర్ణయించింది. ఉదాహరణకు వాద ప్రతివాదనలు పూర్తయ్యాక 30 రోజుల్లోగా, కొన్ని సందర్భాల్లో 60 రోజుల్లోగా కోర్టులు తీర్పులు వెలువరించాలి. అత్యాచార కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్ చేసిన వైద్యులు ఏడు రోజుల్లోగా నివేదికను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు అందించాల్సి ఉంటుంది. బాధితులకు కేసు దర్యాప్తు పురోగతిని కేసు నమోదు చేసిన తరవాత 90 రోజుల్లోగా అందించాలి. ఇలాంటి అంశాలు గడువులతో సహా నిర్దేశించారు.
- ఏడు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో తప్పనిసరిగా ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరగాలి.
- వారెంటుతో అయినా, వారెంట్ లేకున్నా జరిపే సోదాలను ఆడియో - వీడియో సహితంగా చిత్రీకరించి మెజిస్ట్రేట్‌కు సమర్పించాలి.
- ఫిర్యాదు మొదలు తీర్పు వరకూ అన్ని దశల్లోనూ సాంకేతిక, మాధ్యమ వినియోగం తప్పనిసరి చేశారు. ఉదాహరణకు ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు చేయడం, సమన్లు సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా కూడా అందించడం, దర్యాప్తు, విచారణ ఆసాంతం దృశ్య-శ్రవణ మాధ్యమాల్లో చిత్రీకరించాల్సి ఉండటం.
- ముద్దాయిని అరెస్ట్ చేయడం అన్ని కేసుల్లో తప్పనిసరి కాదు. ప్రత్యామ్నాయంగా పోలీసులు ముద్దాయి నుంచి మెజిస్ట్రేట్ ముందు హాజరవుతానన్న వాగ్దానంతో కూడిన సెక్యూరిటీ బాండ్‌ను తీసుకోవడం ద్వారా అరెస్ట్ చేయకుండా ఉండవచ్చు.
- బాధితులు నేరం జరిగిన ప్రదేశానికి చెందిన పోలీస్‌స్టేషన్‌లోనే కాక తమకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి అవకాశం కల్పించే జీరో ఎఫ్ఐఆర్‌ను సంబంధిత ప్రాధికార పోలీస్‌స్టేషన్‌కు 15 రోజుల్లోగా ఫిర్యాదు అందుకున్న పోలీస్‌స్టేషన్ బదిలీ చేయాల్సి ఉంటుంది.
- కొన్ని కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్‌కు సంబంధించి ఏ స్థాయి పోలీసు అధికారి అయినా విన్నవించవచ్చు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి కన్నా దిగువ స్థాయి కలిగి ఉండవచ్చు.
- కోర్టులు, వాటి ప్రాధికార పరిధిని క్రమానుగత శ్రేణిలో స్పష్టంగా కింది స్థాయి కోర్టులు మొదలు సుప్రీంకోర్టు వరకూ పేర్కొన్నారు.
- ఏదైనా నేరానికి సంబంధించి పడే శిక్షాకాలంలో సగానికి పైగా విచారణ ఖైదీగా పూర్తిచేసిన పక్షంలో పూచీకత్తు బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం గతంలో వలే ఉంది. అయితే, అనేక నేరాల్లో ముద్దాయి అయితే, జీవితఖైదు లేదా మరణదండన విధించే నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు బీఎన్ఎస్ఎస్ ప్రకారం అది వర్తించదు.
- ముద్దాయి అరెస్ట్ కానప్పటికీ అతని చేవ్రాలు, వేలిముద్రలు, రాత, గొంతు రికార్డింగ్ వంటి ఆధారాల సమర్పణకు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.
- ఎవరైనా ముద్దాయి విచారణ నుంచి తప్పించుకోవడానికి పరారీలో ఉన్నప్పుడు, అతన్ని అరెస్ట్ చేసే అవకాశాలు ఇంతలో కనిపించనప్పుడు అతను లేకున్నా న్యాయవిచారణ జరిపి, తీర్పు వెలువరించవచ్చు.
- ఏడు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు శిక్ష పడే అవకాశమున్న నేరాలకు సంబంధించి ఏదైనా కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటే బాధితులకు తమ అభిప్రాయాన్ని కోర్టుకు విన్నవించుకునే అవకాశం ఇవ్వాలి.

విమర్శలు

- విచారణ ఖైదీగా శిక్షాకాలంలో సగానికి పైగా కాలం జైలులో గడిపినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు, జీవితఖైదు, మరణదండన వంటి శిక్షలు విధించబడే నేరాలు చేసినప్పుడు గతంలో వలే బెయిల్ లభించకుండా బీఎన్ఎస్ఎస్ చట్టం నిర్దేశిస్తుంది. అయితే అనేక సెక్షన్లు వర్తించే ఒకే నేరం సాధారణ శిక్షలు పడే నేరం అయినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా పరిగణించి బెయిల్ నిరాకరణకు గురయ్యే అవకాశాలున్నాయి. దీనివల్ల సాధారణ నేరాలకు, తీవ్ర నేరాలకు తేడా లేకుండా పోతుంది. జైళ్లు నిండిపోతాయి.
- అనేక కేసుల్లో చేతి సంకెళ్లు వేయడానికి బీఎన్ఎస్ఎస్ చట్టం పోలీసులను అనుమతిస్తోంది. అయితే ఈవిధంగా సంకెళ్లు వేయడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు, మానవహక్కులకు విరుద్ధం. కాబట్టి ఈ అంశం వివాదాస్పదంగా ఉంది.
- ఈ కొత్త చట్టం ప్రకారం పోలీసు కస్టడీ కోరే దర్యాప్తు అధికారి కారణాలు చూపాల్సిన అవసరం లేదు. పోలీసు కస్టడీ సమయం కూడా గతంలో ఉన్న 15 రోజుల నుంచి బీఎన్ఎస్ఎస్ చట్టం ద్వారా 90 రోజులకు పొడిగించారు. ఈ అంశాల వల్ల పోలీసు అధికారాలు పెరగడం, మానవ హక్కులపై ప్రభావం పడటం వంటి వలసకాలం నాటి(బ్రిటీష్) అణచివేత పరిస్థితులు మరలా తలెత్తుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.
- పరారీలో ఉన్న వ్యక్తులపై న్యాయవిచారణను జరిపి, వారికి శిక్షలు సైతం నిర్ధారించగల అవకాశం ఈ కొత్తచట్టంలో ఉంది. ఇది నిందితులను పట్టుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలన్న ఒత్తిడిని ప్రభుత్వ యంత్రాంగాలపై తగ్గిస్తుంది. అంతేకాక నిందితుల వాంగ్మూలం, అసలు నిజాల వెలికితీత మరుగునపడిపోయే ప్రమాదం కూడా ఉంది.
- ప్రజా జీవనం(పబ్లిక్ ఆర్డర్)కి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలనే బీఎన్ఎస్ఎస్‌లో కూడా కొనసాగించారు. దీనివల్ల విచారణాక్రమం(ట్రైల్ ప్రొసీజర్)కి సంబంధించిన చట్టాలు, పబ్లిక్ ఆర్డర్‌కు సంబంధించిన చట్టాలను, వాటిలోని వైవిధ్యతల కారణంగా విడివిడిగా పరిగణించాలా లేదా ఉమ్మడిగా పరిగణించాలా అన్న సందిగ్ధత నెలకొంది. ఈవిధంగా అనేక ప్రొవిజన్స్ అమలులో సందిగ్ధతలు ఉన్నాయి.
- ఒక నేరానికి సంబంధించి ఆధారాలను సేకరించిన అధికారి స్థానంలో వచ్చిన మరో అధికారికి ఆ ఆధారాలను కోర్టుకు సమర్పించే అధికారాన్ని బీఎన్ఎస్ఎస్ కల్పించింది. అయితే ఆధారాలు సేకరించిన అధికారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాన్ని ఇది దూరం చేస్తుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ

అవస్థాపన సౌకర్యాలు

టీజీపీఎస్సీ /ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఎకానమీ

శక్తి వనరులు

థర్మల్, జల విద్యుత్, పునః వినియోగిత ఇంధన వనరులు తెలంగాణ ప్రధాన శక్తి వనరులు.

విద్యుత్ స్థాపిత సామర్థ్యం

2021-22 సంవత్సరం నాటికి 18,069 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని తెలంగాణ కలిగి ఉంది. అందులో 50 శాతం కంటే ఎక్కువ(10,481 మెగావాట్లు) థర్మల్ విద్యుత్ కాగా, 41 శాతం(7,439 మెగావాట్లు) పునఃవినియోగిత శక్తి వనరుల నుంచి దాదాపు ఒక శాతం(149 మెగావాట్లు) అణువిద్యుత్ ఉన్నది.

స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో పెరుగుదల

2014-15, 2021-22 సంవత్సరాల మధ్య తెలంగాణ స్థాపిత విద్యుత్ సామర్థ్యం 9.67 శాతం సగటు ఉమ్మడి వార్షికవృద్ధిని సాధించి, మొత్తమ్మీద 91 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఇదేకాలంలో ఇండియా స్థాపిత విద్యుత్ సామర్థ్యం సగటు ఉమ్మడి వార్షిక వృద్ధి 5.66 శాతం కావడం గమనార్హం.

2020-21, 2021-22 సంవత్సరాల్లో స్థాపిత విద్యుత్ సామర్థ్య వృద్ధిలో దేశంలో ప్రత్యేకహోదా లేని 18 రాష్ట్రాల్లో తెలంగాణ అయిదో స్థానంలో, దక్షిణాది రాష్ట్రాల్లో ప్రథమస్థానంలో ఉంది. స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని పెంచే క్రమంలో కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 1080 మెగావాట్లు, యాదాద్రిలో 4,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ స్టేషన్లను స్థాపించడానికి తెలంగాణ పూనుకున్నది.



తలసరి విద్యుత్

2014-15 సంవత్సరంలో తెలంగాణలో అందుబాటులో ఉన్న తలసరి విద్యుత్ 1,152 కి.వా. కాగా దేశీయ సగటు తలసరి విద్యుత్ 852 కి.వా. అయితే 2021-22 సంవత్సరంలో తెలంగాణ తలసరి విద్యుత్ అందుబాటు 2,005 కి.వా. కాగా దేశీయ తలసరి విద్యుత్ అందుబాటు 1,115.3 కి.వా. మాత్రమే. దేశంలోని ప్రత్యేక హోదా లేని 18 రాష్ట్రాల తలసరి విద్యుత్ అందుబాటులో తెలంగాణ అయిదోస్థానంలో ఉంది.

ఇదేకాలంలో అందుబాటులో ఉన్న తలసరి విద్యుత్ పెరుగుదల విషయంలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ మొదటిస్థానంలో, ప్రత్యేక హోదా లేని 18 రాష్ట్రాల్లో మూడోస్థానంలో ఉంది. తెలంగాణ విద్యుత్ ఒప్పంద సామర్థ్యంలో రాష్ట్ర వాటా దాదాపు 50 శాతం ఉండగా, కేంద్రప్రభుత్వరంగ వాటా 14.1 శాతం. కాగా మొత్తం ఒప్పంద సామర్థ్యంలో 36.1 శాతం ప్రైవేటురంగ వాటా ఉన్నది.

విద్యుత్ సరఫరా, పంపిణీ

తెలంగాణలో విద్యుత్ సరఫరాను ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ చూడగా విద్యుత్ పంపిణీని తెలంగాణ దక్షిణాది విద్యుత్ పంపిణీ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ ఉత్తరాది విద్యుత్ పంపిణీ కంపెనీ లిమిటెడ్‌లు చూస్తాయి. సరఫరాలో జరిగే నష్టం విషయంలో 2019-20 సంవత్సరంలో తెలంగాణ అతి తక్కువ నష్టం ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో రెండోస్థానంలో, మొత్తం 28 రాష్ట్రాల్లో నాలుగోస్థానంలో ఉంది.

తెలంగాణలో విద్యుత్ సరఫరాలో నష్టం 15.28 శాతం కాగా, దేశంలో అది 20.46 శాతం. అయితే గోవాలో 10.92 శాతం, హిమాచల్‌ప్రదేశ్‌లో 14.31 శాతం, కేరళలో 14.75 శాతం నష్టం మాత్రమే ఉంది.

పర్యావరణ అనుకూల వాహనాల ఉత్పత్తిని ప్రోత్సహించడం కోసం తెలంగాణ ఎలక్ట్రిక్ వాహనాల విధానం 2020-2030ని ప్రకటించింది. 2016 సంవత్సరంలో ప్రకటించిన ఎలక్ట్రానిక్ విధానంలో గల ప్రోత్సాహకాలను, సబ్సిడీలను పై విధానానికి వర్తింపచేస్తున్నారు.

విద్యుత్ వినియోగం తీరు

2014-15 సంవత్సరం తెలంగాణలో వినియోగమైన మొత్తం విద్యుత్ 39,519 మిలియన్ యూనిట్లు. కాగా 2021-22 సంవత్సరంలో 61,267 మిలియన్ యూనిట్లు. అంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత వినియోగంలో వచ్చిన పెరుగుదల 2021-22 సంవత్సరం నాటికి 21,748 మిలియన్ యూనిట్లు. తెలంగాణ విద్యుత్ వినియోగంలో కరోనా కాలమైన 2020-21 సంవత్సరం తప్ప మిగతా కాలం మొత్తంలో ప్రతి ఏడాది వృద్ధి నమోదైంది.

పునఃవినియోగిత విద్యుత్

ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 80 శాతం శక్తి, 66 శాతం విద్యుత్ ఉత్పత్తి శిలాజ ఇంధనాల వల్ల జరుగుతున్నది. ఫలితంగా వెలువడుతున్న మొత్తం గ్రీన్ హౌస్ వాయువులకు 60 శాతానికి ఈ ప్రక్రియనే కారణమవుతున్నది. ఇది శీతోష్ణస్థితిలో వేగవంతమైన మార్పునకు దారులు తీస్తున్నది.

అందువల్ల పర్యావరణ అనుకూల పునఃవినియోగిత ఇంధన వనరులకు ప్రాధాన్యం పెరిగింది. తెలంగాణ మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 41.17 శాతం పునః వినియోగిత విద్యుత్ ఉంది. మొత్తం దేశంలో ఉన్న స్థాపిత పునఃవినియోగిత విద్యుత్ సామర్థ్యంలో 4.8 శాతం వాటాను తెలంగాణ కలిగి ఉంది. ఇండియా సగటు పునఃవినియోగిత విద్యుత్ సామర్థ్యం(39.2శాతం) కంటే తెలంగాణ సామర్థ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ మిగతా దక్షిణాది రాష్ట్రాల కంటే తెలంగాణ స్థాపిత పునఃవినియోగిత విద్యుత్ సామర్థ్యం తక్కువగా ఉంది.

తెలంగాణ సౌర విద్యుత్ విధానాన్ని 2015 సంవత్సరంలో ప్రకటించింది. ఈ విధానంలో పలురకాల ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఫలితంగా 2014-15 సంవత్సరంలో స్థాపిత సౌర విద్యుత్ సామర్థ్యం రాష్ట్రంలో 74 మె.వా. కాగా 2021-22 సంవత్సరంలో 4,432 మె.వా.గా ఉంది.

పర్యావరణ అనుకూల వాహనాల ఉత్పత్తిని ప్రోత్సహించడం కోసం తెలంగాణ ఎలక్ట్రిక్ వాహనాల విధానం 2020-2030ని ప్రకటించింది. 2016 సంవత్సరంలో ప్రకటించిన ఎలక్ట్రానిక్ విధానంలో గల ప్రోత్సాహకాలను, సబ్సిడీలను పై విధానానికి వర్తింపచేస్తున్నారు.

తలసరి విద్యుత్ వినియోగం

2014-15 సంవత్సరంలో తెలంగాణలో తలసరి విద్యుత్ వినియోగం 1356 కి.వా. కాగా 2019-20 సంవత్సరంలో 2072 కి.వా. 2020-21 సంవత్సరంలో 2012 కి.వా.కు తగ్గింది. తిరిగి 2021-22లో 2126 కి.వా.కు పెరిగింది.

విద్యుత్ కనెక్షన్ల కూర్పు

2021-22 సంవత్సరం నాటికి తెలంగాణలో మొత్తం 174.03 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 72.15 శాతం(125.56 లక్షలు) గృహ రంగం, 15.49 శాతం(26.96 లక్షలు) వ్యవసాయ రంగం, 12.36 శాతం(21.51 లక్షలు) పారిశ్రామిక రంగం కనెక్షన్లు ఉన్నాయి.

వివిధ జిల్లాలను చూస్తే 21.89 లక్షల విద్యుత్ కనెక్షన్లతో హైదరాబాద్ జిల్లా మొదటిస్థానంలో ఉండగా, 1.59 లక్షల విద్యుత్ కనెక్షన్లతో మంచిర్యాల చివరిస్థానంలో ఉంది.

గృహరంగ విద్యుత్ కనెక్షన్లు ఎక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్ కాగా, గృహరంగం విద్యుత్ కనెక్షన్ల శాతం ఎక్కువగా(86.29 శాతం) ఉన్న జిల్లా మేడ్చల్-మల్కాజిగిరి.

వ్యవసాయరంగంలో ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు ఎక్కువగా(2.19 లక్షలు) ఉన్న జిల్లా వనపర్తి కాగా, వ్యవసాయరంగ విద్యుత్ కనెక్షన్ల శాతం ఎక్కువగా(31.34 శాతం) ఉన్న జిల్లా యాదాద్రి భువనగిరి. పారిశ్రామికరంగం, ఇతర విద్యుత్ కనెక్షన్ల సంఖ్య, శాతంలో హైదరాబాద్ జిల్లా మొదటిస్థానంలో ఉంది.




డా.ఎం.ఎ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

ఘనము


టీజీపీఎస్సీ /ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

నాన్‌వెర్బల్ రీజనింగ్‌లో ఘనము అనే చాప్టర్ చాలా ముఖ్యమైనది. ఘనమునకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడానికి ముందు ఘనము బేసిక్ ఫీచర్స్‌పై అవగాహన కలిగి ఉండాలి. కింద తెలిపిన విషయాలు దీని బేసిక్ ఫీచర్స్‌పై అవగాహన కలిగిస్తాయి.




ఘనము అనగా మూడు పరిమాణాలు కలిగి ఉంటుంది. (త్రీ డైమెన్షనల్ ఫిగర్) అవి అంచులు (ఎడ్జ్‌లు) మూలలు (కార్నర్లు) ముఖభాగాలు (సర్ఫేస్‌లు).



ఘనానికి 8 మూలాలు (కార్నర్లు ఉన్నాయి) అవి M, N, O, P, Q, R, S, T. 12 అంచులు (ఎడ్జ్‌లు) TS, SR, QR, TQ, MP, NO, PO, MN, TM, QN, SP, OR 6 ముఖ భాగాలు (సర్ఫేస్/ ఉన్నాయి) అవి TSRQ, MPNO, SRPO, TQMN, QRNO, TSMP.

ఒక ఘనమునకు అన్ని వైపుల(అన్ని ముఖ భాగాలపై) రంగును వేసి తదుపరి ఆ ఘనాన్ని సమాన కొలత గల చిన్న చిన్న ఘనాలుగా విభజిస్తే ఏర్పడే డయాగ్రమ్ కింది విధంగా ఉంటుంది.



□ మూడు ముఖాలకు రంగు ఉన్న ఘనాలు

▩ రెండు ముఖాలకు మాత్రమే రంగు ఉన్న ఘనాలు

▨ ఒక ముఖానికి మాత్రమే రంగు ఉన్న ఘనాలు

- మూడు ముఖాలకు రంగు ఉన్న ఘనాలు మూలలు (కార్నర్స్)లో కనిపిస్తాయి.
- రెండు ముఖాలకు మాత్రమే రంగు ఉన్న ఘనాలు అంచులకు కనిపిస్తాయి.
- ఒక ముఖానికి మాత్రమే రంగు ఉన్న ఘనాలు ముఖభాగంపై కనిపిస్తాయి.
- ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు పెద్ద ఘనమునకు లోపలివైపున ఉంటుంది.

ఒక పెద్ద ఘనమునకు అన్ని వైపుల (అన్ని ముఖభాగాలపై) రంగు వేసి దానిని సమాన కొలత గల చిన్న చిన్న ఘనాలుగా విభజించినప్పుడు వివిధ ముఖ భాగాలపై రంగును కలిగి ఉన్న ఘనాలను కనుగొనడానికి ఉపయోగపడే ఫార్ములాలు (సూత్రాలు)

మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే మూలంలో(కార్నర్స్) 3 వైపుల రంగు ఉంటుంది. ఘనము గాని, దీర్ఘ ఘనముగాని మూలలు (కార్నర్స్) 8. కార్నర్స్ పై వైపు 4, కింది వైపు 4. కాబట్టి మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా 8. ఈ విలువ ఘనమైనా, దీర్ఘ ఘనమైనా మారదు.

1. గుర్తించుకోండి: మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా 8. (ఫిక్స్) మారనే మారదు.
2. ఆ విభజన వలన ఏర్పడే ఘనాలు అనగా ముందుగా n విలువ కనుగొని దానిని క్యూబ్ చేయాలి. అనగా n^3.

$$n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}}$$

గుర్తించుకోండి:
'n' విలువ కనుగొని n^3 చేయగా మొత్తం ఘనాలు తెలుస్తాయి.

3. రెండు ముఖాలకు మాత్రమే రంగు కలిగి ఉన్న ఘనాలను కనుగొనుటకు ఉపయోగించే సూత్రం (ఫార్ములా) $(n-2)x12$
4. ఒక ముఖానికి మాత్రమే రంగు కలిగి ఉన్న ఘనాలను కనుగొనుటకు ఉపయోగించే సూత్రం (ఫార్ములా) $(n-2)^2 x 6$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలను కనుగొనడానికి ఉపయోగించే సూత్రం (ఫార్ములా) $(n-2)^3$.

దాదాపుగా ఏ పరీక్షల్లోనైనా పై అయిదు రకాలకు సంబంధించిన ప్రశ్నలు గాని లేదా ఈ అయిదింటిలో ఏదో ఒకదాని గురించిన ప్రశ్నలు గాని వస్తున్నాయి.

I) 3 సెం.మీ. కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల నీలం రంగు వేయడమైనది. ఇప్పుడు ఈ ఘనమును ప్రతి అంచు 1 సెం.మీ. కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించడమైనది. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వలన మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 12 బి) 18 సి) 27 డి) 9


2. మూడు ముఖాలకు రంగు కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 8 బి) 12 సి) 6 డి) 15

3. రెండు ముఖాలకు మాత్రమే రంగు కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 4 బి) 6 సి) 8 డి) 12

4. ఒక ముఖానికి మాత్రమే రంగు కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 8 బి) 4 సి) 6 డి) 12

5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఉన్నాయి?
ఎ) 1 బి) 4 సి) 2 డి) 6

సమాధానాలు:
1. (సి) 2. (ఎ) 3. (డి) 4. (సి) 5. (ఎ)



1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{3}{1} = 3.$

మొత్తం ఘనాలు అనగా $3^3 = 27$

2. మూడు ముఖాలకు రంగు కలిగి ఉన్న ఘనాలు అనగా 8.
3. రెండు ముఖాలకు మాత్రమే రంగు కలిగి ఉన్న ఘనాలు $= (n-2) x 12$
$= (3-2) x 12 = 1 x 12 = 12$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$= (n - 2)^2 x 6$
$= (3 - 2)^2 x 6 = 1^2 x 6$
$= 1 x 6 = 6$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు
$= (n - 2)^3 = (3 - 2)^3$
$= 1^3 = 1$

దీనినే సింపుల్‌గా ఫార్ములా లేకుండా చేయవచ్చు. కాని కొన్ని విషయాలను ఫిక్స్‌డ్‌గా గుర్తించుకోవాల్సి ఉంటుంది. కాబట్టి జాగ్రత్తగా అవగాహన చేసుకోవాలి. ముందుగా ఒక ముఖ భాగాన్ని(వన్ సర్ఫేస్) మాత్రమే రాసుకోవాలి. 3 సెం॥ మీ॥ల ఘనం ఒక్కొక్క సెం॥ మీ॥ చొప్పున విభజించారు. కావున మూడు మూడుగా విభజించిన డయాగ్రామ్‌ను వేసుకోవాలి.

3	2	3
2	1	2
3	2	3

1. మొత్తం ఘనాలు అనగా ఎంతగా విభజింపబడునో ఆ సంఖ్య క్యూబ్ రాసుకోవాలి. ఈ ప్రశ్నలో మూడుగా విభజించారు. కావున $3^3 = 27$.

3		3
3		3

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ మూడు ముఖాలకు సంబంధించినవి. ఈ కార్నర్స్ పైన నాలుగు, కింద నాలుగు ఉంటాయి. కావున కార్నర్స్ x 2 = 4 x 2 = 8. (ఈ విలువ ఎలాంటి కొలత ఉన్న ప్రశ్నకైనా మారదు. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా 8)
3. రెండు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు పై వైపున, కింది వైపున, మధ్య భాగంలో కూడా ఉంటాయి. ఇవి కార్నర్ కాకుండా చుట్టూ మాత్రమే ఉన్న భాగంలో ఉంటాయి.

	2	
2		2
	2	

పై రేఖాచిత్రంలో కార్నర్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించగా 4. పై వైపున, కింది వైపున, మధ్య భాగంలో అనే అర్థంలో ఈ 4ని 3తో గుణించాలి. 4 x 3 = 12.

4.

	1	

ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా చుట్టూ భాగాన్ని తీసివేసి మధ్యలో మాత్రమే ఉన్న ఘనాలు లెక్కించి ఆరు ముఖ భాగాలు కావున 6తో గుణించాలి.

1 x 6 = 6.

5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అనగా ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఈ మూడింటిని కూడి మొత్తం నుంచి తీసివేయాలి.

27 - (6 + 12 + 8) = 27 - 26 = 1.

గుర్తించుకోండి:

- మొత్తం ఘనాలు అనగా ఎంతగా విభజింపబడునో ఆ సంఖ్య ఘనము (క్యూబ్)
- మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా 4 కార్నర్స్ x2 (x2 అనగా అప్ అండ్ డౌన్)
- రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా చుట్టూ ఉన్న భాగంలో కార్నర్స్ కాకుండా మిగిలిన వాటిని లెక్కించి 3తో గుణించాలి.(x 3 అనగా అప్, డౌన్, మిడిల్)
- ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా చుట్టూ తొలగించి మధ్య భాగంలో ఉండే ఘనాలను లెక్కించి 6తో గుణించాలి. (x 6 అనగా 6 సర్ఫేస్‌లు)

ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అనగా ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు కలిగి ఉన్న ఘనాలను కూడి మొత్తం నుంచి తీసివేయాలి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

హాకీ జట్టు లక్ష్యం.. పునర్వైభవం



ఒలింపిక్స్ పురుషుల హాకీలో భారత్‌ది తిరుగులేని ఆధిపత్యం. ఒకటి రెండు కాదు ఏకంగా ఎనిమిది స్వర్ణాలు సాధించడం మన జట్టు సత్తాకు తార్కాణం. కానీ ఇదంతా గతం. 1980 మాస్కో విశ్వక్రీడల్లో మన జట్టు చివరి పసిడి పతకం అందుకున్నాక భారత హాకీ ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. మళ్లీ పుంజుకొని ఒలింపిక్స్ హాకీలో పతకం కోసం నాలుగు దశాబ్దాలకుపైగా వేచి చూడాల్సి వచ్చింది. మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో జట్టు గత టోక్యో క్రీడల్లో చారిత్రక కాంస్య పతకంతో హాకీ ప్రేమికుల్లో నూతనోత్సాహం నింపింది. ఈసారి హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీలో బరిలో దిగుతున్న మన జట్టు మరింత మెరుగ్గా రాణించాలని పట్టుదలగా ఉంది. తద్వారా ఒలింపిక్స్ హాకీలో పునర్వైభవం తీసుకు రావడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది.

టోక్యో గేమ్స్‌లో కాంస్య పతకం గెలిచిననాటి మధుర స్మృతులు మదిలో మెదులుతుండగా పురుషుల హాకీ జట్టు పారిస్‌లో కాలుమోపింది. 41 ఏళ్ల పతక కరువును తీరుస్తూ గత ఒలింపిక్స్‌లో కాంస్య పతకం చేజిక్కించుకున్న నాటి భారత జట్టులోని 11 మంది ఆటగాళ్లు ఈసారీ ఆడుతున్నారు. 2023 ఏషియాడ్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకోవడం ద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నేరుగా క్వాలిఫై అయ్యింది. క్రెయిగ్ ఫుల్టన్ కోచింగ్‌లో మనోళ్ల ఆటతీరు పూర్తిగా మారిపోయింది. ఎదురు దాడికి దిగుతూనే డిఫెన్సుకూ ప్రాధాన్యమిస్తోంది. దాంతో గత ఏడాదిగా ప్రపంచ మేటి జట్లను మట్టికరిపించి విజయాలు అందుకుంది. ఇక, పారిస్ విశ్వక్రీడల్లో భారత జట్టు.. డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, న్యూజిలాండ్, ఐర్లాండ్‌లతో కలిసి గ్రూప్-బి నుంచి తలపడుతోంది. కాగా, భారత్ తదుపరి రౌండ్‌కు చేరాలంటే ఆరుజట్ల ఈ గ్రూప్‌లో టాప్-4లో నిలవాల్సి ఉంటుంది. అనుభవజ్ఞులు, యువకుల సమాహారంతో పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమైన భారత్.. స్వర్ణ పతకాన్ని సాధించి పునర్వైభవం దిశగా అడుగులు వేయాలని కోరుకుందాం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

బాణం దూసుకెళ్లాలి!

ప్రపంచ ఆర్చరీలో ఇన్నాళ్లూ సౌత్ కొరియాదే ఆధిపత్యం. కానీ ఇటీవల వరల్డ్ కప్‌లలో ఆ జట్టుకు చెక్‌పెట్టిన ఘనత భారత్‌ది. ఇదే జోరును విశ్వక్రీడల్లో చూపాలనుకుంటున్న భారత్.. అందుకు తగ్గట్టే ఆరుగురు ఆర్చర్లతో పారిస్‌కు సిద్ధమైంది. ఐదు పతకాలు లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.



తరుణ్‌దీప్ రాయ్

ఒలింపిక్స్ ఆర్చరీలో ఇప్పటి వరకు భారత జట్టు ఒక్క పతకమూ సాధించలేదు. 2004-2020 మధ్య భారత పురుషులు, మహిళలు, మిక్స్‌డ్ జట్లు ఆరుసార్లు విశ్వక్రీడల క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరాయి తప్ప పోడియం ఫినిష్ చేయలేకపోయాయి. ఇక ఈసారి ఒలింపిక్స్‌లో ఆరుగురు సభ్యుల భారత బృందం మొత్తం ఐదు విభాగాల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. విశ్వక్రీడల ఆర్చరీ పురుషులు, మహిళల అన్ని కేటగిరీల్లో భారత్ తలపడనుండడం 12 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం.

ఇనుమడించిన ఆత్మవిశ్వాసం: పారిస్ ఒలింపిక్స్ అన్ని విభాగాల్లో కోటాలు కైవసం చేసుకోవడం ఆషామాషీకాదు. కానీ ఈ ఘనత సాధించిన పురుషులు, మహిళల ఆర్చరీ జట్లు ఇనుమడించిన ఉత్సాహంతో ఈసారి క్రీడల్లో పతకాలు అందుకోవాలని పట్టుదలగా ఉన్నాయి. మన రికర్వ్ ఆర్చర్లు ఇటీవలి కాలంలో అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ ఏడాది మూడు దశల వరల్డ్ కప్‌లలో.. రెండు దశలలో ఆర్చర్లు పతకాలు సాధించారు. ఇది.. తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర (తొలి ఒలింపిక్స్), తరుణ్ దీప్‌రాయ్ (నాలుగో ఒలింపిక్స్), ప్రవీణ్ జాదవ్ (రెండో ఒలింపిక్స్)లో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.



దీపిక నేతృత్వంలో..

నాలుగో ఒలింపిక్స్ బరిలో దిగుతున్న అపార అనుభవజ్ఞురాలు దీపికా కుమారి ఆధ్వర్యంలో మహిళల జట్టు పారిస్‌లో అడుగుపెట్టింది. జట్టులో మిగతా ఇద్దరు భజన్ కౌర్, అంకితా భకత్ విశ్వక్రీడల్లో అరంగేట్రం చేస్తున్నారు. షాంఘై ప్రపంచ కప్‌లో దీపిక రజతం గెలుపొందగా, ధీరజ్‌తో కలిసి భజన్ మిక్స్‌డ్‌లో కాంస్య పతకం నెగ్గడం సానుకూల పరిణామం. అంటాల్యా వరల్డ్ కప్‌లో మహిళల జట్టు, అంకిత వ్యక్తిగత విభాగంలో నాలుగో స్థానంలో నిలవడం పారిస్ క్రీడలకు ముందు ఆత్మవిశ్వాసం నింపేదే. ఇంకా..గత మూడు సంవత్సరాల్లో పారిస్‌లో జరిగిన ప్రపంచ కప్‌లలో మన ఆర్చర్లు పతకాలు సొంతం చేసుకోవడం మరో సానుకూలాంశం.



ధీరజ్ స్కోరు బెటర్

ఆర్చరీలో బాణాల సగటు స్కోరు ఎంతో ముఖ్యం. ఇందులో ధీరజ్ స్కోరు 9.4 కాగా రాయ్‌ది 9.3, జాదవ్‌ది 9.2గా ఉంది. అంతేకాదు ఈ సీజన్‌లో క్వాలిఫికేషన్ రౌండ్లలో 720 గరిష్ఠ స్కోరుకుగాను ధీరజ్ (693), రాయ్ (684), జాదవ్ (674) కెరీర్ బెస్ట్ స్కోర్లు నమోదు చేశారు. ఇంకా..షాంఘైలో జరిగిన వరల్డ్ కప్ స్టేజ్-1 ఫైనల్లో ప్రపంచ విజేత దక్షిణ కొరియాకు షాకివ్వడం భారత పురుషుల జట్టు సత్తాకు నిదర్శనం. వరల్డ్ కప్ స్టేజ్-3 వ్యక్తిగత విభాగంలో కంచు మోత మోగించిన ధీరజ్.. భజన్ కౌర్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యం సాధించాడు. మొత్తంగా ముగ్గురు పురుష ఆర్చర్లు ఒలింపిక్స్‌లో భారత ముఖచిత్రాన్ని మార్చి వేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



1 భారత మహిళల జట్టు తరపున టీ20ల్లో ఎక్కువ పరుగులు (3415) సాధించిన బ్యాటర్‌గా హర్మన్‌ప్రీత్. మంధాన (3378)ను అధిగమించింది.

దంచికొట్టారు

యూఏఈపై భారత్ ఘనవిజయం
చెలరేగిన రిచా, హర్మన్

దంబుల్లా: మహిళల టీ20 ఆసియాకప్‌లో భారత జట్టు నుంచి మరో అద్భుత ప్రదర్శన. ఆదివారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఈసారి బ్యాటర్లు చెలరేగి తొలిసారిగా ఈ ఫార్మాట్‌లో 200+ స్కోరును అందించారు. ఆ తర్వాత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ కారణంగా జట్టు 78 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా రెండో గెలుపుతో భారత్ దాదాపు సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (47 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 66), రిచా ఘోష్ (29 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 64 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో అలరించారు. కవిషకు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో యూఏఈ 20 ఓవర్లలో 7 వికెట్లకు 123 రన్స్‌కే పరిమితమైంది. కవిష (40 నాటౌట్), ఇషా (38) మాత్రమే రాణించారు. దీప్తి 2 వికెట్లు తీసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రిచా నిలిచింది.

చివర్లో జోరు: ఓపెనర్ మంధాన (13) త్వరగానే అవుటైనా..షఫాలీ (37) మెరుపులకు ఓవర్‌కు పది రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. అయితే 52/3 స్కోరుతో ఇబ్బందిపడిన దశలో కెప్టెన్ హర్మన్ కీలక ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. ముందుగా జెమీమా (14)తో కలిసి నాలుగో వికెట్‌కు 54 రన్స్ జత చేసింది. ఆ తర్వాత రిచా బరిలోకి దిగడంతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. 15వ ఓవర్‌లో రిచా 4 ఫోర్లతో 18 రన్స్ రాబట్టింది. అటు 19వ ఓవర్‌లో హర్మన్ 4,4,6తో ధాటిని ప్రదర్శించి ఆఖరి ఓవర్ తొలి బంతికి రనౌటైంది. దీంతో ఐదో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత చివరి ఐదు బంతులను రిచా 4,4,4,4,4గా బాది 25 బంతుల్లోనే తన తొలి ఫిఫ్టీని పూర్తి చేయగా, జట్టు స్కోరు కూడా 200 దాటింది. కాగా, మరో మ్యాచ్‌లో పాకిస్థాన్ ఏడు వికెట్ల తేడాతో నేపాల్‌ను ఓడించింది.

సంక్షిప్త స్కోర్లు
భారత్: 20 ఓవర్లలో 201/5 (హర్మన్ 66, రిచా 64 నాటౌట్, షఫాలీ 37; కవిష 2/36).
యూఏఈ: 20 ఓవర్లలో 123/7 (కవిష 40 నాటౌట్, ఇషా 38; దీప్తి శర్మ 2/23).

ఆసియాకప్‌నకు శ్రేయాంక దూరం

భారత ఆఫ్‌స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ చేతి వేలికి ఫ్రాక్చర్ కావడంతో ఆసియాకప్‌నకు దూరమైంది. పాక్‌తో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో తను గాయపడింది. దీంతో పాటిల్ స్థానంలో రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్న లెఫ్టామ్ స్పిన్నర్ తనూజ కన్వర్‌ను తీసుకున్నారు.



క్రీడాగ్రామంలో యాంటీ సెక్స్ బెడ్స్?

పారిస్: ఒలింపిక్స్ అంటే క్రీడాగ్రామంలో సౌకర్యాలపై చర్చ మొదలవడం సాధారణం. గతంలోలాగే ఈసారీ అథ్లెట్లకు కేటాయించిన బెడ్‌లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శృంగారం కట్టడి కోసం అథ్లెట్ల గదుల్లో తక్కువ సామర్థ్యమున్న బెడ్‌లు అంటే.. 'యాంటీ సెక్స్ బెడ్స్' ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత టోక్యో విశ్వక్రీడల్లో కరోనా వైరస్ దృష్ట్యా అథ్లెట్లు శృంగార కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిరోధించడం కోసం అట్టలతో (కార్డ్‌బోర్డ్‌తో) చేసిన బెడ్‌లను అథ్లెట్ల గదుల్లో ఉంచారన్న వ్యాఖ్యలు వినిపించాయి. అయితే, అట్టలతో చేసినా అవి దృఢంగా ఉంటాయనీ.. యాంటీ సెక్స్ బెడ్స్ మాత్రం కాదని అప్పట్లోనే నిర్వాహకులు వాటిని ఖండించారు. తాజాగా పారిస్‌లోని క్రీడాగ్రామంలో ఇదే తరహా బెడ్‌లు దర్శనమిస్తున్నాయన్న వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈసారి కూడా ఆ తరహా బెడ్‌లే కనిపిస్తున్నా.. వాటిని వందశాతం రీసైకిల్ చేయడానికి అవకాశమున్న కార్డ్‌బోర్డ్‌లను బెడ్‌ల తయారీకి వాడినట్టు నిర్వాహకులు చెబుతున్నారు.



బౌలింగ్ కోచ్‌గా బహుతులే

న్యూఢిల్లీ: శ్రీలంక పర్యటనలో భారత జట్టు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులే వ్యవహరించనున్నాడు. ఈనెల 27 నుంచి జట్టు ఆడే 3 టీ20, 3 వన్డేలకు అతను సేవలందిస్తాడు. వాస్తవానికి దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించే అవకాశం ఉండగా.. అతడు వ్యక్తిగత కారణాలరీత్యా ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండడం లేదు. సెప్టెంబరులో బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు అతడు జట్టుతో చేరనున్నాడు. ఇక గత మూడేళ్లుగా సాయిరాజ్ జాతీయ క్రికెట్ అకాడమీలో బౌలింగ్ కోచ్‌గా ఉంటున్నాడు.

ఇంగ్లండ్‌దే సిరీస్
రెండో టెస్టులో విండీస్ చిత్తు

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు 241 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో దక్కించుకుంది. ఆదివారం నాలుగో రోజు ఆటలో జో రూట్ (122), హ్యారీ బ్రూక్ (109) శతకాలతో ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 425 పరుగులకు ఆలౌటైంది. జేడెన్ సీల్స్‌కు నాలుగు, అల్జారికు రెండు వికెట్లు దక్కాయి. ఇక 385 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన విండీస్ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. స్పిన్నర్ బషీర్ (5/41) ధాటికి 36.1 ఓవర్లలో 143 పరుగులకే కుప్పకూలింది. బ్రాత్‌వైట్ (47), హోల్డర్(37) మాత్రమే రాణించారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 416, విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 457 పరుగులు చేశాయి. ఒక టెస్టులో తొలి మూడు ఇన్నింగ్స్‌లోనూ 400కు పైగా పరుగులు నమోదవడం ఇదే తొలిసారి.



హాల్ ఆఫ్ ఫేమ్‌లో పేస్, విజయ్

న్యూపోర్ట్ (అమెరికా): టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో భారత దిగ్గజాలు లియాండర్ పేస్, విజయ్ అమృతరాజ్‌లకు చోటు దక్కింది. టెన్నిస్‌లో ఆసియా నుంచి ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న క్రీడాకారులు వీరే కావడం విశేషం. 51 ఏళ్ల పేస్ ప్లేయర్ కేటగిరీలో, 70 ఏళ్ల విజయ్ టెన్నిస్‌కు సంబంధించి కంట్రిబ్యూటర్ విభాగంలో హాల్ ఆఫ్ ఫేమ్‌కు ఎంపికయ్యారు.

8 ఐపీఓలు.. 8 లిస్టింగ్‌లు

ఈ వారం ప్రైమరీ మార్కెట్ బిజీ బిజీ

న్యూఢిల్లీ: ప్రైమరీ మార్కెట్లో ఈ వారం చాలా సందడి ఏర్పడనుంది. మొత్తం 8 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) జారీ చేయనుండగా మరో 8 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కానున్నాయి. ఇవన్నీ ఎస్ఎంఈ విభాగంలోనివే కావడం విశేషం. పబ్లిక్ ఇష్యూకి వస్తున్న 8 కంపెనీలు రూ.410 కోట్ల సమీకరణ లక్ష్యం పెట్టుకున్నాయి. వాటిలో ఎస్‌పీఆర్ టెక్నాలజీస్ జారీ చేస్తున్న రూ.150 కోట్ల ఫాలో ఆన్ ఇష్యూ (ఎఫ్‌పీఓ) కూడా ఉంది.

లిస్టింగ్‌కు రానున్న కంపెనీలివే : ప్రైజర్ విజ్‌టెక్, సతీ పోలీప్లాస్ట్, శ్రీ ఎం పేపర్ బోర్డ్స్, ఏలియా కమోడిటీస్, తున్వాల్ ఈ-మోటార్స్, మాకాబ్స్ టెక్నాలజీస్, కటారియా ఇండస్ట్రీస్. ఇవన్నీ ఎంఎస్ఈ విభాగంలోనివి కాగా మొక్కలకు చెందిన పోషకాహార ఉత్పత్తుల తయారీలోని సాన్‌స్టార్ కంపెనీ 26వ తేదీన ప్రధాన ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానుంది.

పబ్లిక్ ఇష్యూకి వస్తున్న కంపెనీల వివరాలివే...

కంపెనీ	సమీకరణ లక్ష్యం	షేరు ధర శ్రేణి (రూ.)	ప్రారంభ-ముగింపు తేదీ
ఆర్ఎన్ఎఫ్ఐ సర్వీసెస్	70.81 కోట్లు	98-105	22-24
ఎస్‌పీఆర్ టెలీవెంచర్	150 కోట్లు	200-210	19-24
వీఎల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్	18.52 కోట్లు	39-42	23-25
వీవీఐపీ ఇన్‌ఫ్రాటెక్	61.21 కోట్లు	91-93	23-25
చేతనా ఎడ్యుకేషన్	45.9 కోట్లు	80-85	24-26
మంగళం ఇన్‌ఫ్రా	27.62 కోట్లు	53-56	24---
క్లినిటెక్ లేబరేటరీ	5.78 కోట్లు	96	25-29
అప్రమేయ ఇంజనీరింగ్	29.23 కోట్లు	56-58	25-29

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ

హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	

ఏఐ, ఎంఎల్ జాబ్స్‌కు డిమాండ్

2022 నుంచి 433% పెరుగుదల : ఇన్‌డీడ్

ముంబై: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఇండస్ట్రీ స్తబ్దుగా ఉంది. నియామకాలకు కంపెనీలు దాదాపుగా ఫుల్‌స్టాప్ పెట్టాయి. క్యాంపస్ రిక్రూట్‌మెంట్లో ఎంపికైన అభ్యర్థులకూ కంపెనీలు ఏదో ఒక సాకుతో రిక్తహస్తం చూపిస్తున్నాయి. అయితే కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి సరికొత్త టెక్నాలజీలపై పట్టున్న ఇంజనీర్లను మాత్రం ఐటీ కంపెనీలు మంచి మంచి ప్యాకేజీలతో ఎగరేసుకుపోతున్నాయి. 2022తో పోలిస్తే ఐటీ రంగంలో ఇలాంటి ఇంజనీర్ల డిమాండ్ 433 శాతం పెరిగింది. ఇదే సమయంలో బిజినెస్ ప్రాసెసింగ్ ఔట్‌సోర్సింగ్ (బీపీఓ) రంగమూ రాణిస్తోంది. ఈ రంగానికి చెందిన ఎగ్జిక్యూటివ్స్ డిమాండ్ గత రెండేళ్లలో 314 శాతం పెరిగింది. ఉద్యోగ నియామకాల తీరుతెన్నులను పరిశీలించే 'ఇన్‌డీడ్' అనే సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది.

ఇతర రంగాలదీ అదే బాట: కొవిడ్ తర్వాత పర్యాటక, ఇతర వ్యాపారాలు బాగా పుంజుకున్నాయి. ఏ మాత్రం టైమ్ దొరికినా ఉద్యోగులు తీర్థయాత్రకో, విహార యాత్రకో చెక్కేస్తున్నారు. దీంతో గత రెండేళ్లలో ట్రావెల్ కన్సల్టెంట్ల గిరాకీ 285 శాతం పెరిగింది. ఇదే సమయంలో ఫ్రంట్ ఆఫీస్ సిబ్బందిలో అతి ముఖ్యమైన రిసెప్షనిస్టుల డిమాండ్ 310 శాతం పెరిగినట్టు ఇన్‌డీడ్ వెల్లడించింది. రియల్టీ బూమ్‌తో శానిటేషన్, నిర్మాణ రంగ నిపుణులు, ఎలక్ట్రీషియన్‌ల గిరాకీ కూడా గత రెండేళ్లలో 121 నుంచి 258 శాతం వరకు పెరిగింది. వీటికి తోడు గత రెండేళ్లలో విద్య, వైద్య పరిశోధన రంగాల నిపుణులకూ గిరాకీ భారీగా పెరిగినట్టు నివేదిక తెలిపింది.



హైదరాబాద్‌లో ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్ల అసెంబ్లింగ్?

మరిగ్నేన్ (ఫ్రాన్స్): ఎయిర్‌బస్ కంపెనీకి చెందిన హెచ్125 హెలికాప్టర్ల అసెంబ్లింగ్‌కు హైదరాబాద్ కేంద్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ హెలికాప్టర్ల తుది అసెంబ్లింగ్ కోసం ఎయిర్‌బస్ కంపెనీ ఇప్పటికే దేశంలో ఎనిమిది ప్రాంతాలను పరిశీలిస్తోంది. అందులో హైదరాబాద్ కూడా ఉన్నట్టు సమాచారం. దీనికి తోడు ఈ హెలికాప్టర్ల తుది అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఎయిర్‌బస్ ఈ ఏడాది జనవరిలో టాటా గ్రూప్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. టాటా గ్రూప్ కంపెనీ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్)కు హైదరాబాద్‌లోని ఆదిభట్ల వద్ద ఇప్పటికే ఒక ప్లాంట్ ఉంది. ఇందులో అమెరికాకు చెందిన సికోర్‌స్కీతో సహా పలు హెలికాప్టర్ కంపెనీలకు విడి భాగాల తయారు చేసి సరఫరా చేస్తున్నారు. దీంతో ఎయిర్‌బస్, టాటా గ్రూప్‌తో కలిసి హైదరాబాద్‌లోనే హెచ్125 హెలికాప్టర్ల పూర్తి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ ఏడాది చివరిలోగా ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఖరారు చేయటంతో పాటు శంకుస్థాపన చేయాలని ఎయిర్‌బస్ యోచిస్తోంది.

వచ్చే ఏడాది ఐపీఓకి ఎన్ఎల్‌సీ రెన్యూవబుల్స్

నైవేలీ (తమిళనాడు): ప్రభుత్వ రంగంలోని ఇంధన సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా రెన్యూబుల్స్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఆర్ఎల్) పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సిద్ధమవుతోంది. ఈ ఐపీఓ వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ఉంటుందని ఎన్ఎల్‌సీఐఆర్ఎల్ మాతృసంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) సీఎండీ మోటుపల్లి ప్రసన్న కుమార్ చెప్పారు. ఐపీఓ ద్వారా సేకరించే నిధులను ఎన్ఎల్‌సీఐఆర్ఎల్ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 1,400 మెగావాట్ల నుంచి 2030 నాటికి 6,000 మెగావాట్లకు విస్తరించేందుకు ఉపయోగిస్తామన్నారు.

బిజినెస్

ల్యాండ్ డీల్స్ 57% డౌన్

ధరల పెరుగుదలే కారణం: అనరాక్

ముంబై: దేశంలోని ప్రధాన నగరాల్లో భూముల ధరలు భారీగా పెరిగాయి. దీంతో కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు బిల్డర్లు, డెవలపర్లు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భూముల కొనుగోలు డీల్స్ 325 ఎకరాలకు పడిపోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 57 శాతం తక్కువ. రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ల్యాండ్ డీల్స్ సంఖ్యా 29 నుంచి 25కు పడిపోయింది. సార్వత్రిక ఎన్నికలు కూడా ఇందుకు ఒక కారణంగా కనిపిస్తోంది. గత త్రైమాసికంలో నమోదైన 25 ల్యాండ్ డీల్స్‌లో 17 డీల్స్ (163 ఎకరాలు) నివాస గృహ ప్రాజెక్టులకు సంబంధించినవని తెలిపింది.

హైదరాబాద్‌లో ఒకే ఒక డీల్

హైదరాబాద్‌లోనూ భూముల ధరలు మరింతగా పెరిగాయి. దీంతో గత త్రైమాసికంలో హైదరాబాద్‌లో 48 ఎకరాలకు సంబంధించి ఒకే ఒక ల్యాండ్ డీల్ జరిగింది. అయితే ఇదే సమయంలో బెంగళూరులో 114 ఎకరాలకు సంబంధించి 9 డీల్స్, గురుగ్రామ్‌లో 77.5 ఎకరాలకు సంబంధించి ఏడు డీల్స్ జరిగాయి.

మద్దతు స్థాయి 24,400

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 24,500 వద్ద ప్రారంభమై 24,850 వరకు వెళ్లినా శుక్రవారం ఆ స్థాయిలో బలమైన రియాక్షన్‌కు గురై 270 పాయింట్ల మేరకు నష్టపోయింది. వారం మొత్తం మీద 28 పాయింట్ల స్వల్ప లాభంతో ముందువారం ముగింపు స్థాయి 24,530 సమీపంలో ఫ్లాట్‌గా ముగిసింది. వారం కనిష్ఠ స్థాయిలో ముగియడం అమ్మకాల ఒత్తిడికి సంకేతం. నిఫ్టీ గత 10 వారాల ర్యాలీలో జూన్ నాల్గవ తేదీన ఏర్పడిన కనిష్ఠ స్థాయి 21,300 నుంచి 3,500 పాయింట్ల మేరకు లాభపడింది. టెక్నికల్‌గా అప్‌ట్రెండ్ కొనసాగుతున్నప్పటికీ కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. గత గురువారం బ్రేకౌట్ సాధించిన నిఫ్టీ శుక్రవారం దిగువకు రివర్సల్ తీసుకోవడం అప్రమత్త సంకేతం. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 1,260 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 550 పాయింట్లు నష్టపోయాయి. అమెరికన్ మార్కెట్లలో ఏర్పడిన కరెక్షన్ కారణంగా మన మార్కెట్ ఈ వారంలో మరింత బలహీనపడే ఆస్కారం ఉంది. 24,400 వద్ద కనిష్ఠ స్థాయిలో పరీక్ష ఎదుర్కొనవచ్చు.



వి. సుందర్ రాజా

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ నిరోధ స్థాయి 24,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 24,850. గత వారం ఇక్కడే కరెక్షన్ ఏర్పడింది. మరింతగా పురోగమించాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవడం అవసరం. ప్రధాన నిరోధం 25,000.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌కు గురైతే 24,400 వద్ద (జూలై 11న ఏర్పడిన కనిష్ఠ స్థాయి) వద్ద మద్దతు ఉంది. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 24,200, 24,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత నాలుగు వారాల్లో 53,000 పాయింట్ల స్థాయిలో నిరోధం ఎదుర్కొంటోంది. గత వారం 52,265 వద్ద ముగిసింది. రికవరీ బాట పడితే నిరోధ స్థాయి 52,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,800. బలహీనపడి ప్రధాన మద్దతు స్థాయి 51,700 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశించవచ్చు.

పాటర్న్: మార్కెట్‌కు 24,400 వద్ద స్వల్పకాలిక డీఎంఏ ఉంది. సానుకూలత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. అదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే మరింత బలహీనత సంకేతంగా భావించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,540, 24,600
మద్దతు	24,400, 24,355

ఈ వారం జర జాగ్రత్త!

కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు ఈ వారం అప్రమత్తంగా వ్యవహరించటం మంచిది. బడ్జెట్ కారణంగా ఈ వారం మార్కెట్ సూచీలు ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. గత వారం బెంచ్‌మార్క్ సూచీలు జీవితకాల గరిష్ఠాలకు చేరినప్పటికీ ప్రైస్ యాక్షన్ మాత్రం భిన్నంగా ఉంది. మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి. మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించిన ఐటీ కంపెనీల షేర్లు మాత్రం లాభాల్లో సాగాయి. ఈ వారం నిఫ్టీకి 24,500 వద్ద మద్దతు, 24,650 వద్ద నిరోధం ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

టైటాన్: జనవరి చివరి వారం నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి అయిన రూ.3,200 స్థాయికి చేరుకుంది. గత వారం తక్కువ వాల్యూమ్‌తో టైట్ రేంజ్‌లో క్యాండిల్స్ ఫామ్ అయ్యాయి. గత శుక్రవారం రూ.3,259 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,250 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,500/3,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,200 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టిటాగఢ్ రైల్వే: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు రెండు వారాలుగా కన్సాలిడేట్ అవుతోంది. శుక్రవారం సూచీలు భారీగా పతనమైన పరిస్థితిలోనూ ఈ షేరు జోరు ప్రదర్శించింది. రానున్న బడ్జెట్‌లో రైల్వేకు పెద్దపీట వేసే అవకాశాలు ఉండటంతో ఇన్వెస్టర్ల చూపు ఈ కౌంటర్‌పై పడింది. గత శుక్రవారం ఈ షేరు 2.87 శాతం లాభంతో రూ.1,655 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,650/1,630 శ్రేణిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆస్ట్రల్: శుక్రవారం నాటి బలహీన మార్కెట్లోనూ ఈ స్టాక్ మంచి ప్రదర్శన కనబరిచింది. ఈ కౌంటర్‌లో స్వల్పకాల దిద్దుబాటు ముగిసినట్టే కనిపిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. క్రితం సెషన్‌లో ఒక శాతం లాభంతో రూ.2,272 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో స్వింగ్ ట్రేడర్లు రూ.2,270/2,250 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,450/2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,210 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రీం ఇండస్ట్రీస్: జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకిన అనంతరం ఈ షేరు 12 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. ఈ వారం కంపెనీ ఆర్థిక ఫలితాలు విడుదల కానుండటంతో ఇన్వెస్టర్లు ఆసక్తిని చూపిస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు 1.09 శాతం లాభంతో రూ.5,783 వద్ద స్థిరపడింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.5,750 వద్ద ఎంటరై రూ.6,200 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,710 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇర్కాన్ ఇంటర్నేషనల్: గత వారం ఈ షేరు మంచి జోరును కనబరిచింది. చివరి సెషన్‌లో ఈ షేరు 1.05 లాభంతో రూ.316 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.315/310 శ్రేణిలో ప్రవేశించి రూ.355/370 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.304 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com +91 98855 59709

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.


తాలిపేరు డ్యాం గేట్లు ఎత్తిన దృశ్యం


మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పత్తి పంట

కృష్ణమ్మ పరుగులు


ఆదిలాబాద్‌లో పరవళ్లు తొక్కుతున్న కుంటాల

(మొదటిపేజీ తరువాయి)

పెడుతోంది. 95,786 క్యూసెక్కులు శ్రీశైలానికి చేరుతోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. కాగా, ఆల్మట్టి జలాశయానికి 1,35,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1,50,000 క్యూసెక్కులను, నారాయణపూర్‌కు 1.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 25 గేట్లను ఎత్తి 1.45 లక్షల క్యూసెక్కులను జూరాలకు వదులుతున్నారు. కృష్ణా ఉప నది తుంగభద్రకూ వరద కొనసాగుతోంది. 1.19 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. మరోవైపు గోదావరి, ప్రాణహిత, మంజీరా ఉప్పొంగడం, ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం వద్ద గోదావరి 9.50 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. మేడిగడ్డ బ్యారేజీకి ఆదివారం సాయంత్రానికి వరద 5.52 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. 85 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. అన్నారం బ్యారేజీకి 16,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ రెండింటికీ తోడు ఆదిలాబాద్, మహారాష్ట్ర సరిహద్దులోని ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి ఇన్‌ఫ్లో వస్తుండటంతో సమ్మక్క బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. 8.23 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. మహారాష్ట్రలో పడుతున్న వర్షాలతో గోదావరి, మంజీరా, హరిదా నదుల ద్వారా ఎస్సారెస్పీలోకి 18,518 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లోకి స్వల్పంగా వరద వస్తోంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా 690 అడుగులు దాటింది. 25,968 క్యూసెక్కుల వరద వస్తోంది. 4 గేట్లను ఎత్తి 18,277 క్యూసెక్కులను గోదావరిలోకి వదులుతున్నారు.

భద్రాచలం వద్ద గోదావరి హోరు

మహారాష్ట్రలో భారీ వర్షాలతో ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తోంది. భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి వరద పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద గోదావరి 45.1 అడుగులను చేరింది ఆదివారం మధ్యాహ్నం తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద మరింతగా పెరిగితే సోమవారం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. ముందుజాగ్రత్తగా ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించారు. మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. వర్షాల కారణంగా మరో 25,069 క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లిలోకి వస్తోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 148 మీటర్లకు 142 మీటర్లకు చేరుకుంది. నల్లగొండ జిల్లా కేతేపల్లిలోని మూసీ ప్రాజెక్టుకు వరద తాకిడి కొనసాగుతోంది. ప్రస్తుత నీటిమట్టం 639 అడుగులు (3.15టీఎంసీలు)గా ఉంది.

నిజామాబాద్ అంతటా 5 సెం.మీ.పైనే

రాష్ట్రాన్ని ఆదివారం కూడా ముసురు వీడలేదు. రోజంతా వర్షం పడుతూనే ఉంది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. చిరు జల్లులకు తోడు గాలులతో చలి తీవ్రత పెరిగింది. హైదరాబాద్‌లో 22.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5.5 డిగ్రీలు పడిపోయాయి. హుస్సేన్‌సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (513.41 మీటర్లు) సమీపానికి నీరు చేరడంతో తూమును తెరిచారు. వర్షాలతో జిల్లాల్లోని చెరువులు, కుంటలు, బావుల్లోకి దండిగా నీరు చేరుతోంది. చిన్న చెరువులు మత్తడి వరకు వచ్చాయి. వరంగల్ భద్రకాళి చెరువు అలుగు పారుతోంది. కాగా, నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం వేంపల్లిలో అత్యధికంగా 18.55 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో 5 సెంటీమీటర్లపైనే వర్షం పడింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 10.15, ఇంద్రవెల్లిలో 8.80, జైనథ్, బేలలో 7 సెం.మీలుపైగా వాన పడింది. మూడు రోజుల పాటు కుంటాల, పొచ్చెర జలపాతాలకు పర్యాటకులకు అనుమతిని నిలిపివేశారు. కాగా, వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో 24 గంటల హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ములుగు మండలంలో 11.43 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఏటూరునాగారం, వాజేడు, మంగపేట, ములుగు, కన్నాయిగూడెం మండలా ప్రజలు జల దిగ్బంధంలో ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో టేకులగూడెం వద్ద రేగుమాగు వాగు జాతీయ రహదారిని ముంచెత్తింది. భూపాలపల్లి జిల్లాలో పలుచోట్ల వాగులు ఉప్పొంగడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. కరీంనగర్ జిల్లాలో 24 గంటల్లో 5.25 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. 15 మండలాల్లో 4 సెం.మీకు పైగానే వర్షం కురిసింది. అత్యధికంగా గంగాధర, హుజూరాబాద్ మండలాల్లో 7.86 సెం.మీ. వాన పడింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కుమరం భీం, వట్టివాగు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద చేరుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్తి చేలల్లో నీళ్లు నిలిచాయి.

ఏపీలో 50శాతం అధిక వర్షపాతం

ఏపీవ్యాప్తంగా 50 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జూన్ నుంచి 199.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 299.1 మి.మీ. వర్షం కురిసింది. అల్లూరి జిల్లా చింతూరు మండలంలో శబరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా జాతీయ రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. పెదవాగుకు గండితో వేలేరుపాడు మండలంలోని 13 గ్రామాల ప్రజలు నష్టపోయారు.

వచ్చే మూడు రోజులూ వానలే..

తెలంగాణలో వచ్చే మూడు రోజులూ వర్షాలు కురుస్తాయని, 30 కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. చిలుకా సరస్సు వద్ద కేంద్రీకృతమైన వాయుగుండం అల్ప పీడనంగా బలహీనపడిందని పేర్కొంది. మంచిర్యాల, ఆదిలాబాద్, కొముురంభీం, భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ 9 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

వరదలో ఇద్దరు గల్లంతు

భద్రాద్రి జిల్లా పినపాక మండలం పోట్లపల్లి వద్ద చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లిన పాయం నగేశ్ గల్లంతయ్యాడు. స్నేహితుడు బడే నాగరాజుతో కలిసి వెళ్లిన ఇతడు.. చేపలు పడుతుండగా ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ఇద్దరూ వాగులో కొట్టుకుపోయారు. నాగరాజు అతికష్టమ్మీద ఒడ్డుకు చేరాడు. నగేశ్ ఆచూకీ దొరకలేదు. ఎన్డీఆర్‌ఎఫ్‌తో గాలింపు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం బొప్పరికుంటకు చెందిన టేకం లక్ష్మణ్ గంగాపూర్ వాగులో గల్లంతయ్యాడు. వాగు ఉధృతంగా పారుతుండడంతో లక్ష్మణ్ మృతదేహం ఇంకా లభ్యం కాలేదు.


మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం

కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్‌లు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆదివారం సాయంత్రం జిల్లాల్లో వరద పరిస్థితిని ఆయన సమీక్షించారు. పునరావాస చర్యల్లో నిమగ్నమై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోదావరి ఉధృతి వల్ల అక్కడి పరివాహక ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెస్క్యూ టీమ్‌లు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను వినియోగించాలనీ సూచించారు. ప్రధానంగా వాగుల వద్ద తగు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ప్రవహించే వాగులను ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.


పెదవాగు ప్రాజెక్టుకు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తుమ్మల

ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి పెదవాగు ప్రాజెక్టుకు మరమ్మతులు

- నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: తుమ్మల

ఖమ్మం, జూలై 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/అశ్వారావుపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు ఏపీ తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అని, దీన్ని గోదావరి వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు పర్యవేక్షిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి ఉమ్మడిగా ఉన్న ఈ ప్రాజెక్టుకు వచ్చే ఏడాదిలోగా మరమ్మతులు పూర్తి చేయిస్తామన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలతో గండిపడ్డ పెదవాగు ప్రాజెక్టును ఆదివారం అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ప్రాజెక్టుకు గండిపడిన విధానం, జరిగిననష్టాన్ని పరిశీలించారు. అనంతరం గుమ్మడివల్లి, కొత్తూరు, రంగాపురం, నారాయణపురంలోని వరద బాధిత గ్రామాల ప్రజలతో మట్లాడారు. ఆ తర్వాత పెదవాగు ప్రాజెక్టు వద్ద జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదవాగు ప్రాజెక్టు గండి పడడానికి కారణాలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వరద పరిస్థితిని అంచనావేసి ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తామని, అయితే మూడో గేటు మోటార్ కాలిపోవడంతో దానిని ఎత్తలేకపోయామని అధికారులు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గోదావరి బోర్డు పర్యవేక్షణలో ఉన్న పెదవాగు ఆయకట్టు 80% ఏపీ, 20% తెలంగాణలో ఉందన్నారు. ఇదే నిష్పత్తిలో మరమ్మతులకు నిధులు కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మూడుగేట్లతో పాటు మరో మూడు గేట్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కాగా, పెదవాగు ప్రాజెక్టుకు గండి పడిన విషయం తెలుసుకుని సకాలంలో సహాయక చర్యలు చేపట్టిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్‌ను మంత్రి తుమ్మల అభినందించారు.

మూసీ సుందరీకరణకు 1.50 లక్షల కోట్లా?!

- సీఎంకు పాలమూరుకన్నా.. మూసీపై మక్కువెందుకో?
- దాంతో ఎన్ని ఎకరాలకు సాగునీరిస్తారు : కేటీఆర్

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్ల ఖర్చయితేనే కాంగ్రెస్ గల్లీ నుంచి ఢిల్లీదాకా గగ్గోలుపెట్టింది. అలాంటిది.. మూసీ సుందరీకరణకు రూ.లక్షా యాభైవేల కోట్లా?' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మూసీప్రాజెక్టుతో మురిసే రైతులెందరు? నిల్వ ఉంచే టీఎంసీలెన్ని? ఎన్ని ఎకరాలు సాగులోకి వస్తుంది? పంటల దిగుబడి ఎంత? ఆ నీటితో తీర్చే పారిశ్రామిక అవసరాలెంత? కొత్తగా నిర్మించే భారీ రిజర్వాయర్లెన్ని?' అంటూ ఎక్స్ వేదికగా ఆదివారం ఆయన నిలదీశారు. మూసీని అందంగా ముస్తాబు చేసేందుకు.. మొన్న.. రూ.50వేలకోట్లు అయితుందన్నారు. నిన్న రూ.70వేల కోట్లు వెచ్చిస్తామన్నారు. ఇప్పుడు ఏకంగా రూ.1.50లక్షల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారు.. పదిహేను పక్కన ఇన్ని సున్నాలా.. అంటూ అంకెలను సూచిస్తూ ఆయన ఎద్దేవా చేశారు. పుట్టిన గడ్డపై మమకారం లేని సీఎం రేవంత్‌రెడ్డికి.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కన్నా.. మూసీ ప్రాజెక్టుపైనే ఎందుకింత మక్కువో చెప్పాలన్నారు. మూసీ అంచనా వ్యయాన్ని సీఎం మూడింతలు పెంచడం కాంగ్రెస్ ధన దాహానికి సజీవసాక్ష్యమని విమర్శించారు.

మేడిగడ్డను బాగుచేయడంలో సర్కారు విఫలం

- ఎన్‌డీఎస్‌ఏ, ప్రభుత్వ అలసత్వంతో రైతులకు నష్టం: హరీశ్

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద అనుకోకుండా మూడు పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయని, వాటిని సకాలంలో బాగుచేయించి సాగునీటిని అందుబాటులోకి తేవడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. వరదలు రాక ముందే మేడిగడ్డ రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఏమాత్రం దృష్టిపెట్టలేదని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు సూచనలు, సలహాలు ఇవ్వడంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సమయం వృథా చేసిందని ఆరోపించారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక పేరిట ప్రభుత్వం అలసత్వం కారణంగా.. రాష్ట్ర రైతాంగం నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎన్‌డీఎస్‌ఏ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై అవాకులు చెవాకులు పేలి.. తన అవగాహన రాహిత్యాన్ని మరోసారి బయట పెట్టుకున్నారని విమర్శించారు. మేడిగడ్డ పునాదిని బలపరిచేందుకు అన్నిచర్యలు తీసుకున్నామంటూనే అక్కడ మట్టిపరీక్షలు సాధ్యపడలేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు మాని కాంగ్రెస్ ప్రభుత్వం పంటలకు సాగునీరు అందేలా చూడాలని.. రైతులకు నష్టం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

జయరాజ్‌ను పరామర్శించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కవి, పాటల రచయిత, గాయకుడు జయరాజ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. జయరాజ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

'సాగర్' కాల్వలకు కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్, జూలై 21: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. ఏపీ, తెలంగాణ వినతుల మేరక ఈనెల 15న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఇరు రాష్ట్రాలకు కేటాయింపులు జరిపింది. తెలంగాణకు 5.5 టీఎంసీలు, ఏపీకి 4.5 టీఎంసీల చొప్పున కేటాయిస్తూ నిర్ణయించింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాల మేరకు ఈనెల 17వ తేదీ నుంచి కుడి కాల్వకు, 19వ తేదీ నుంచి ఎడమ కాల్వకు ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. కుడికాల్వకు రోజుకు సుమారు 5 వేల క్యూసెక్కుల చొప్పున 11 రోజుల్లో 4.5 టీఎంసీలు, ఎడమ కాల్వకు రోజుకు 3 వేల క్యూసెక్కుల చొప్పున 4 రోజుల్లో 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ ప్రస్తుతం 1.5 టీఎంసీలను మాత్రమే వాడుకుంటున్నట్లు వెల్లడించారు.

కవితకు బెయిల్ వచ్చేనా..?

నేటితో ముగియనున్న జ్యుడీషియల్ కస్టడీ

బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ కోర్టులో విచారణ

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో సోమవారం విచారణ జరగనుంది. బెయిల్ పిటిషన్‌తోపాటు సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పైనా విచారణ జరగనుంది. కవిత ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆమె తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించనున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ రూపకల్పనలో కవితది కీలకపాత్ర అని ఆరోపిస్తూ ఈడీ మార్చి 15న ఆమెను అరెస్టు చేసింది. తిహాడ్ జైల్లో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ కూడా అరెస్టు చేసింది. నాలుగు నెలలుగా కవిత జైల్లోనే ఉన్నారు. తొలుత తన కుమారుడికి పరీక్షలు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరగా న్యాయస్థానం తిరస్కరించింది. తర్వాత ఈడీ, సీబీఐ రెండు కేసుల్లో సాధారణ బెయిల్ ఇవ్వాలని కోరగా కోర్టు ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. ట్రయల్ కోర్టు తీర్పును కవిత ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా అక్కడా ప్రతికూల ఫలితమే ఎదురైంది. ఈ నేపథ్యంలోనే ట్రయల్ కోర్టులో సీబీఐ మధ్యంతర చార్జిషీట్ దాఖలు చేసింది. చార్జిషీటే సరిగా లేదని, బెయిల్ ఇవ్వాలని మరోసారి కవిత పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇప్పటికే వాదనలు జరగ్గా, సోమవారం మళ్లీ విచారణ జరగనుంది. తనకు అనారోగ్య సమస్యలు ఉన్నాయంటూ కవిత గతంలోనే బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. ట్రయల్ కోర్టుతోపాటు హైకోర్టులోనే నిరాశే మిగిలింది. ఇక తిహాడ్ జైల్లో ఉన్న కవిత సుమారు పది రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. గత మంగళవారం అస్వస్థతకు గురికావడంతో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆస్పత్రికి తరలించారు. సీబీఐ కేసులో గురువారంతో జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో వర్చువల్ విధానంలో కవితను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. జైల్లో వైద్య సిబ్బంది సరిగాలేరని, తనకు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు అనుమతి ఇవ్వాలని కవిత కోరగా, జడ్జి అనుమతి ఇచ్చారు. శుక్రవారం ఎయిమ్స్‌లో కవితకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ రిపోర్టులను కోర్టుకు సమర్పించనున్నారు. సోమవారంతో ఆమె జ్యుడీషియల్ కస్టడీ ముగియనుంది. అనారోగ్య సమస్యల నేపథ్యంలో కవితకు బెయిల్ వస్తుందా? లేదా? అనేది వేచి చూడాల్సిందే.

పార్లమెంటులో రైతాంగ సమస్యలపై చర్చించాలి

ఎంపీ మల్లు రవికి సంయుక్త కిసాన్ మోర్చా విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సమావేశాల్లో రైతాంగ సమస్యలపై చర్చించాలని ఎంపీ మల్లు రవికి సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు పశ్యపద్మ, శంకర్‌ప్రసాద్, శోభన్‌లు ఆదివారం మల్లు రవిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. పంటలకు మద్దతు ధర చట్టం కోసం కృషి చేయాలన్నారు. రైతులు సుదీర్ఘంగా ఢిల్లీలో ఉద్యమం చేశారని... వారి డిమాండ్లను కేంద్రం నెరవేర్చేలా లోక్‌సభ, రాజ్యసభల్లో డిమాండ్ చేయాలని కోరారు. స్పందించిన ఎంపీ పార్లమెంటులో రైతుల సమస్యలపై చర్చిస్తామని హామీనిచ్చారు.

హరిత రిసార్టులు, హోటళ్లు ప్రైవేటు పరం?

ఇప్పటికే ప్రైవేట్‌కు అప్పగించిన కడెం రిసార్టు.. జాబితాలో తారామతి-బారాదరి.. నిజామాబాద్, అనంతగిరి హిల్స్

- వరంగల్‌లోని రిసార్టులు కూడా..
- బేగంపేట టూరిజం ప్లాజానూ ప్రైవేటుకు అప్పగించాలని ప్రతిపాదన!
- కోట్లాది రూపాయల ఆదాయమున్నా.. నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకోనున్న పర్యాటక సంస్థ!



హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పర్యాటక సంస్థకు కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూరుస్తున్న హరిత హోటళ్లు, మరికొన్ని రిసార్టులు ప్రయివేట్‌పరం కానున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఆహ్లాదాన్ని అందిస్తున్న హోటళ్లు, రిసార్టుల నిర్వహణను ప్రయవేట్ సంస్థలు, వ్యక్తులకు అప్పగించేందుకు పర్యాటక సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హోటళ్లు, రిసార్టులలో ఆయా విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న సుమారు 45 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్టు సమాచారం. ఏటా సుమారు కోటి రూపాయలకుపైగా ఆదాయాన్ని సమకూర్చుతున్న నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు సమీపంలో ఉన్న హరిత రిసార్ట్, హోటల్‌ను గత నెలలోనే ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ సమీపంలో సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అభివృద్ధి చేసిన తారామతి-బారాదరి రిసార్టు, హోటళ్లు దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 30 గదులు, రెండు ఫంక్షన్ హాళ్లు, బార్ తదితర సకల సౌకర్యాలతో ఉన్న ఈ రిసార్టు, హోటళ్ల నుంచి పర్యాటక సంస్థకు నెలకు సుమారు రూ.1.5 కోట్లకు పైగా ఆదాయం లభిస్తోంది. కానీ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఈ రిసార్టు ఆదాయాన్ని కోల్పోతున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నిర్వహణ బాధ్యత నుంచి పర్యాటక సంస్థ తప్పుకునేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. సుమారు 50 గదులతో విస్తరించిన నిజామాబాద్ హరిత రిసార్టు సైతం ప్రయివేట్ వ్యక్తుల స్వాధీనం కానున్నట్టు సమాచారం. ఏటా సుమారు రూ.2.5 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చుతున్న ఈ రిసార్టును హస్తగతం చేసుకునేందుకు కొంతమంది రాజకీయ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలిసింది. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ సమీపంలో పర్యాటక సంస్థ 30 గదులతో అభివృద్ధి చేసిన హరిత రిసార్ట్ సైతం ప్రయివేట్‌పరం కానున్నట్టు సమాచారం. ఈ రిసార్టు ద్వారా ఏటా మూడున్నర కోట్లకు పైగా ఆదాయం వస్తున్నట్టు తెలిసింది. ఇక వరంగల్‌లో రెండు ఫంక్షన్ హాళ్లు, 50 గదులు, బార్ తదితర సౌక ర్యాలతో విస్తరించిన పర్యాటక సంస్థ రిసార్టును సైతం ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. హైదరాబాద్ బేగంపేట టూరిజం ప్లాజాను సైతం ప్రయివేట్ పరం చేయాలని ప్రతిపాదించినట్టు సమాచారం.


నల్లగొండ జిల్లా గోపలాయపల్లి గుట్టపై నిర్వహించిన సుదర్శన సహిత రుద్రయాగం పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రెండేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ పూర్తిచేస్తాం

- మార్చిలో బ్రాహ్మణవెల్లెంల ప్రారంభిస్తాం: మంత్రి కోమటిరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 21: నల్లగొండ జిల్లాలోని ఎస్‌ఎల్‌బీసీ(శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సహా కీలక ప్రాజెక్టులకు గ్రీన్‌చానల్ ద్వారా నిధులిచ్చి రెండేళ్లలో పూర్తిచేయిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానంలో నిర్వహించిన సుదర్శన సహిత రుద్రయాగం పూర్ణాహుతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. యజ్ఞగుండం వద్ద కూర్చుని పూజలు చేసిన అనంతరం వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... వచ్చే మార్చిలోగా బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను పూర్తిచేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి ఈ ప్రాంత రైతుల కాళ్లను కృష్ణానీటితో కడుగుతామని పునరుద్ఘాటించారు. ప్రజలు, పాలకులు సుభిక్షంగా ఉండాలని వేణుగోపాలస్వామిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. సర్వ మానవాళి హితాన్ని కాంక్షిస్తూ గోపలాయపల్లి క్షేత్రంపై వచ్చే ఏడాది ఆయుత చండీయాగాన్ని ప్రభుత్వం తరఫున నిర్వహించేందుకు కృషి చేస్తానని, ఇందు కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని చెప్పారు. కేంద్ర మంత్రి గడ్కరీతో తనకున్న చొరవతోనే హైద్రాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించే పనులను మంజూరు చేయించానని, ఈ పనులకు ఆగస్టులో టెండర్లు పిలుస్తామని ప్రకటించారు. ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు.

డైరెక్టర్ ఆఫ్ వర్క్స్‌లోనూ అక్రమ బదిలీలు!

- 6-7 ఏళ్ల సర్వీసు పూర్తయినా 'తప్పనిసరి' జాబితాలో చేర్చలేదంటున్న ఉద్యోగులు

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీల్లో రోజుకో శాఖలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా ఆర్థిక శాఖ పరిధిలోని 'డైరెక్టర్ ఆఫ్ వర్క్స్' విభాగంలోనూ నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సాధారణ బదిలీల మార్గదర్శకాల మేరకు ఒక ప్రదేశంలో నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన ప్రతి ఉద్యోగిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ విభాగంలో ఉద్యోగుల సీనియారిటీని సక్రమంగా లెక్కించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ఉద్యోగులు ఒకే ప్రదేశం(స్టేషన్)లో 6-7 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా వారిని 'తప్పనిసరి బదిలీ'ల జాబితాలో చేర్చలేదని ఉద్యోగులు అంటున్నారు. వారికంటే తక్కువ సర్వీసు ఉన్నవారిని 'ఒకే క్యాడర్‌లో 40 శాతం బదిలీలు' నిబంధన కింద తీసుకుని బదిలీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 'వర్కింగ్ స్టేషన్ సీనియారిటీ' ప్రకారం ఒక ప్రదేశంలో ఎక్కువ కాలం పని చేసిన సీనియర్ ఉద్యోగులకు పూర్తి వెకెన్సీలను చూపడం లేదని, ఆ ప్రదేశాల్లో జూనియర్లను నియమిస్తున్నారని చెబుతున్నారు. దీంతో బదిలీ జాబితాలో ముందున్న తాము నష్టపోతున్నామంటున్నారు. ఉదాహరణకు.. హనుమకొండలోని మిషన్ భగీరథ కార్యాలయంలో ఓ జిల్లా అకౌంట్స్ ఆఫీసర్ ఆరేళ్లకుపైగా పని చేస్తున్నారని, అయినా ఆయన పేరు బదిలీల జాబితాలోలేదని చెబుతున్నారు. ములుగు ఇంజనీరింగ్ కార్యాలయంలో క్లియర్ వెకెన్సీని 'వర్కింగ్ స్టేషన్ సర్వీస్' ప్రకారం సీనియర్ ఉద్యోగులకు చూపకుండా వరంగల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో పని చేస్తున్న మరో జూనియర్ జిల్లా అకౌంట్స్ ఆఫీసర్‌ను నియమించారని అంటున్నారు.


పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరసన తెలుపుతున్న చిన్నారులు

‘రేవంత్ అంకుల్.. వీధి కుక్కల నుంచి కాపాడండి’

హైదరాబాద్ పేట్‌బషీరాబాద్ పీఎస్ ఎదుట చిన్నారుల నిరసన

కొంపల్లి పురపాలక కమిషనర్‌పై పోలీసులకు ఫిర్యాదు

పేట్‌బషీరాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల బారి నుంచి రక్షించండంటూ హైదరాబాద్‌కు చెందిన పలువురు చిన్నారులు రోడ్డెక్కారు. రేవంత్ అంకుల్ (సీఎం రేవంత్ రెడ్డి) మమ్మల్ని కాపాడండి.. అంటూ నినాదాలు చేస్తూ పోలీసుస్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అంతేనా.. వీధి కుక్కల సమస్యను పరిష్కరించని తమ ప్రాంత పురపాలక సంఘం కమిషనర్‌పై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. వీధి కుక్కల సమస్య తీవ్రతను చూపెట్టే ఈ ఘటన హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీసుస్టేషన్ వద్ద ఆదివారం జరిగింది. హైదరాబాద్, కొంపల్లి పురపాలక సంఘం పరిధి ఎన్‌సీఎల్ నార్త్ కాలనీకి చెందిన చిన్నారులు ఈ పని చేశారు. రేవంత్ అంకుల్, కమిషనర్ అంకుల్, వివేక్ అంకుల్(స్థానిక ఎమ్మెల్యే వివేకానంద) మా ప్రాణాలకు రక్షణ ఏదీ ?’ అని రాసి ఉన్న ప్లకార్డులు పట్టుకుని తల్లిదండ్రులతో కలిసి ర్యాలీగా పోలీసుస్టేషన్‌కు వచ్చి నిరసన తెలిపారు. పురపాలక సంఘం కమిషనర్ శ్రీహరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోరాట జ్వాలలు రగిల్చిన దాశరథి: రేవంత్

హైదరాబాద్, న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నా తెలంగాణ కోటి రతనాల వీణ.. అంటూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట జ్వాలలు రగిల్చిన యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలుగు, ఉర్దూ, సంస్కృతం, ఆంగ్ల భాషల్లో పండితుడైన దాశరథి తన కలంతో ఓ వైపు విప్లవాగ్నులను రగుల్చుతూనే, మరోవైపు అనువాద, ప్రణయ కవిత్వాలను, సినీ గీతాలను వెలువరించిన సవ్యసాచి అని పేర్కొన్నారు.

ప్రశ్నించే తత్వమే కవి లక్షణం: జూకంటి



సిరిసిల్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ‘కన్నీటి చెమ్మను కదిలించలేని కవిత్వాన్ని నేను ఊహించలేను. మనిషి వినియోగదారుడై.. కేవలం వస్తువుగా రూపమెత్తినపుడు.. ప్రశ్నలు పోగొట్టుకొని తలవంచుకొని నిలబడటం కవి, కవిత్వ లక్షణం కాదు’ అని ప్రముఖ కవి జూకంటి జగన్నాథం పేర్కొన్నారు. నేటి కవిత్వం వర్తమానంలో ప్రజల పక్షంలో నిలబడలేక బాల్యంలోకి పోతోందని అన్నారు. మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూకంటి.. దాశరథి అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు. ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించడం తన సాహిత్య జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టమని తెలిపారు.

జూకంటి సాహిత్య ప్రస్థానం..

జగన్నాథం 1955లో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో జన్మించారు. సిరిసిల్లలో ఆయన సాహిత్య ప్రస్థానం 1970 నుంచి మొదలైంది. 1970లో ‘ఆంధ్రజ్యోతి’ వీక్లీలో ఆయన మొదటి కవిత ప్రచురితమైంది. జగన్నాథం కవితలు కన్నడ, తమిళ, హిందీ, ఇంగ్లిష్ భాషలోకి అనువాదం అయ్యాయి. సాహిత్య కార్యక్రమాలను ముందుకు తీసుకవెళ్లడంలోనూ ఆయన ముఖ్య పాత్ర పోషించారు. 2007 నుంచి 2013 వరకు తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా ఉన్నారు. 2019లో కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. 2014 నుంచి అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సిరిసిల్లలో నయనం ప్రచురణల సంస్థను స్థాపించి ఎన్నో కథల పుస్తకాలను వెలువరించారు. ఆంధ్రజ్యోతి కథల పోటీల్లో జూకంటి బహుమతి పొందారు.

తెలంగాణ పోరుకు వేగుచుక్క దాశరథి: గోరటి

నిజామాబాద్ రూరల్, జూలై, 21: తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన దాశరథి కృష్ణమాచార్య తెలంగాణ పోరాటానికి వేగుచుక్కగా నిలిచారని ప్రముఖ కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. నిజామాబాద్ టీఎన్జీవో భవన్‌లో ఆదివారం జరిగిన ‘దాశరథి 99వ జయంతి సభకు వెంకన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల అకృత్యాలను నిరసిస్తూ తెలంగాణ ప్రజల కోసం దాశరథి తన గొంతుకను విప్పారని గుర్తు చేశారు.


విజయ్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొంగులేటి

టీఎస్‌ఐడీసీ చైర్మన్‌గా ముప్పా విజయ్‌బాబు బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ముప్పా విజయ్‌బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, వేముల వీరేశం, తెల్లం వెంకట్రావు, మనోహర్‌రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సివిల్స్‌లో దివ్యాంగుల కోటా అవసరమా?

(మొదటి పేజీ తరువాయి)

అవసరమని సబర్వాల్ చెప్పారు. కొన్నిసార్లు కఠిన సమయాల్లో పని చేయాల్సి ఉంటుందని తన ట్విటర్ పోస్టులో ప్రస్తావించారు. వైకల్యం ఉన్న వారిని గౌరవిస్తున్నానని, కానీ వైకల్యం ఉన్న పైలట్‌ను విమానయాన సంస్థలు నియమించుకుంటాయా? వైకల్యం ఉన్న సర్జన్ సేవలను మీరు విశ్వసిస్తారా? అని ఆమె ప్రశ్నించారు. ఆమె వ్యాఖ్యలపై ట్విటర్‌లో, బయటా పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. దివ్యాంగ రిజర్వేషన్లపై స్మిత చేసిన వ్యాఖ్యల్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ సివిల్ సర్వెంట్, సివిల్స్ పోటీ పరీక్షల శిక్షకురాలు బాలలత డిమాండ్ చేశారు. ఏ అధికారంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారని ప్రశ్నించారు. ప్రత్యేక చట్టం ద్వారా అమల్లోకి వచ్చిన ఈ కోటాపై ఉన్నత బాధ్యతల్లో ఉన్న ఒక అధికారి ఈ విధంగా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఆమె వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ప్రకటించారు. ఇలాంటి వ్యాఖ్యల కారణంగా దివ్యాంగుల పట్ల సమాజంలో చిన్నచూపు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దివ్యాంగుల హక్కుల కోసం పోరాడుతున్న వసుంధర కొప్పుల, నల్లగొండ శ్రీనివాసులు, అడివయ్య, వెంకట్ తీవ్రంగా స్పందించారు. సబర్వాల్ వెంటనే దివ్యాంగులకు క్షమాపణను చెప్పాలని డిమాండ్ చేశారు.

రాహుల్ వరంగల్ సభ 28న!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభం కానుండగా.. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభవుతున్నాయి. అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీ సమావేశాలకు ఇబ్బంది రాకుండా ఈ నెల 28న ఆదివారం వరంగల్ కృతజ్ఞతా సభను నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీతో రేవంత్ భేటీ తర్వాత దీనిపై స్పష్టత రానుంది. రాహుల్‌గాంధీతో పాటుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర అగ్రనేతలనూ రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌లు కలిసి ఆహ్వానించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. 23న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం సీఎం, మంత్రులు భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు పలువురు కేంద్ర మంత్రులనూ కలవనున్నారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై వారికి విజ్ఞాపన పత్రాలను సమర్పించనున్నారు. రేవంత్, నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌లు సోమవారం సాయంత్రం 4 గంటలకు కేంద్ర జల వనరుల మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసే అవకాశం ఉంది. పెండింగ్ ప్రాజెక్టుల గురించి ఆయన దగ్గర ప్రస్తావించాలని భావిస్తున్నారు.

మంత్రివర్గ విస్తరణపై?

రాహుల్‌గాంధీ.. ఆదివారం రాత్రి లేదా సోమవారం ఢిల్లీలో నేతలకు అందుబాటులోకి రానున్నట్లు ఏఐసీసీ ఇచ్చిన సమాచారం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయమే ఢిల్లీకి బయలుదేరి వెళ్లిపోయారు. భట్టి, ఉత్తమ్‌లు కూడా అప్పటికే ఢిల్లీలో ఉండడంతో మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపైనా అధిష్ఠానం పెద్దలతో చర్చిస్తారా అన్న చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. పార్లమెంటు సమావేశాల్లో అధిష్ఠానం, అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర నాయకత్వం బిజీ అవుతున్న నేపథ్యంలో ఈ చర్చ ఉత్పన్నం కాదని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. సోమవారం దీనిపై స్పష్టత వస్తుందని అంటున్నారు.


నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

మేడిగడ్డపై సీఎం సమీక్ష

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు, పరీక్షలు, కమిషన్ విచారణ తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆదివారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌తో కలిసి సమీక్షించారు. నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ హాజరయ్యారు. ఢిల్లీలో శనివారం జరిగిన ఎన్‌డీఎస్‌ఏ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలను మంత్రి ఉత్తమ్, అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అంశాలపై ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను వారికి తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జరిగే ఎన్‌డీఎస్‌ఏ సమావేశానికి హాజరుకానున్న అధికారులు, ఇంజినీర్లకు సీఎం రేవంత్‌రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. తర్వాత కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీతో భేటీ అయ్యారు.

కేంద్రం కనికరించేనా!

కొత్త బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆశలు.. ఇప్పటికే కేంద్రం దృష్టికి పలు డిమాండ్లు

- మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులు
- వెనుకబడిన జిల్లాలకు రూ.2,250 కోట్లు
- పీఎంఏవై కింద 25 లక్షల ఇళ్లకు విన్నపం
- సీఎస్ఎస్ నిధులను పెంచాలని అభ్యర్థన

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రంతో గత ప్రభుత్వంలా కాకుండా.. ఇప్పుడు సఖ్యతగా ఉంటున్నాం. పలు కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. వివిధ పథకాల అమలుకు రాష్ట్రం తరఫున పూర్తి సహకారం అందిస్తున్నాం. వీటన్నింటినీ కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందా? కేంద్ర బడ్జెట్‌లో ఈసారైనా రాష్ట్రానికి వరాలు కురిపిస్తుందా? అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రధానికి, కేంద్ర మంత్రులకు చేసిన విజ్ఞప్తులపై స్పందిస్తుందా? కొన్ని ప్రాజెక్టులకైనా నిధులు ఇస్తుందా? ప్రత్యేక గ్రాంటు, సీఎస్ఎస్‌ల కింద నిధులు కేటాయిస్తుందా? అని రాష్ట్ర ప్రభుత్వం ఆశగా ఎదురు చూస్తోంది. ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండడంతో.. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై భారీగా ఆశలు పెట్టుకుంది. ఇదివరకటిలా కాకుండా ఈసారి తమపై కనికరం చూపాలని కోరుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్రం ప్రవేశపెట్టిన ‘ఓట్-ఆన్-అకౌంట్’ బడ్జెట్‌లో కేటాయింపులపై స్పష్టత రానందున.. ఈ పూర్తి స్థాయి బడ్జెట్‌లోనైనా నిధులు వస్తాయని ఆశిస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క.. పలుమార్లు ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర డిమాండ్లను వివరించారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా తమ గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం సరిగా వినియోగించుకోలేదని తెలిపారు. సీఎస్ఎస్‌ల కింద కేంద్రం నిధులను మంజూరు చేసినా.. రాష్ట్రం తన మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయకపోవడంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని చెప్పారు. తాము సీఎస్ఎస్‌లకు మ్యాచింగ్ గ్రాంట్లను విడుదల చేస్తామన్నారు. ఈ దృష్ట్యా సీఎస్ఎస్‌ల కింద గ్రాంట్లను మరింత పెంచి విడుదల చేయాలని కోరారు.

పీఆర్ఎల్ఐకి జాతీయ హోదా ఇవ్వండి

తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత ఒక్క సాగునీటి పారుదల ప్రాజెక్టుకు కూడా కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వం గుర్తు చేస్తోంది. ఈ దృష్ట్యా ‘పాలమూరు-రంగారెడ్డి’ ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరుతోంది. దీని ద్వారా.. కరువు, ఫ్లోరైడ్ పీడిత జిల్లాలైన నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉందని తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆరు జిల్లాల్లోని 1,226 గ్రామాలతోపాటు హైదరాబాద్ మహా నగరానికి తాగు నీటిని సరఫరా చేయాల్సి ఉందని చెబుతోంది. ఇక మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును రూ.లక్షన్నర కోట్లతో చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయించాలని రాష్ట్రం కోరుతోంది. మూసీ పరివాహక ప్రాంతంలో అమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్ బిజినెస్ ఏరియా, దుకాణ సముదాయాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెబుతోంది. మరోవైపు విభజన చట్టంలో ఇచ్చిన హామీల మేరకు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ‘వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి(బీఆర్‌జీఎఫ్)’ కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులివ్వాలని రాష్ట్రం కోరుతోంది. రాష్ట్రంలోని తొమ్మిది పాత ఉమ్మడి జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున ఏటా రూ. 450 కోట్లు రావాలని గుర్తు చేస్తోంది. 2019-20 నుంచి ఐదేళ్లకు సంబంధించి మొత్తం రూ.2,250 కోట్లు రావాల్సి ఉందని తెలిపింది. వీటిని ఈ బడ్జెట్‌లో కేటాయించాలని కోరుతోంది.



ఐటీఐఆర్‌ను పునరుద్ధరించాలి

2010లో నాటి యూపీఏ ప్రభుత్వం హైదరాబాద్, బెంగళూరు నగరాలకు సమాచార సాంకేతిక పెట్టుబడుల ప్రాంతాల (ఐటీఐఆర్)ను మంజూరు చేసిందని ప్రధాని మోదీకి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఐటీ రంగంలో నూతన కంపెనీలు, డెవలపర్లను ప్రోత్సహించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం 3 క్లస్టర్లలో అందుకు అవసరమైన భూమిని గుర్తించిందని పేర్కొన్నారు. 2014 తర్వాత ఐటీఐఆర్ ముందుకు సాగలేదని, హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను పునరుద్ధరించాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరుతోంది. మరోవైపు రాష్ట్ర పునర్విభజన సమయంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో స్టీల్ ప్లాంటును ఏర్పాటు చేస్తామని నాటి ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని కూడా ప్రధాని దృష్టికి రేవంత్ తీసుకెళ్లారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి బదులు పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు 2023 జూలైలో రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించిందని తెలిపారు. దేశంలోని ఇతర ప్రాంతాలకు కోచ్ ఫ్యాక్టరీలు మంజూరు చేసిన రైల్వే శాఖ.. కాజీపేటలో మాత్రం సాధ్యం కాదనడం సరికాదన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని కోరారు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని కూడా ప్రధానికి గుర్తు చేశారు. ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్రం కోరుతోంది. ఇక రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన ప్రారంభించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరుతోంది. నిర్మాణానికి అవసరమైన నిధులను ఎన్‌హెచ్ఏఐకు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తోంది. రాష్ట్రంలోని 15 రాష్ట్ర రహదారుల(స్టేట్ హైవేల)ను జాతీయ రహదారులు (నేషనల్ హైవేలు)గా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం కోరుతోంది. ఈ రోడ్ల వివరాలను ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. తెలంగాణలోని ప్రధాన పట్టణాలు, పుణ్య క్షేత్రాలకు పెరిగిన రవాణా అవసరాల దృష్ట్యా ఈ రోడ్లను ఉన్నతీకరించాలని అడుగుతోంది. వీటితోపాటు హైదరాబాద్-బెంగళూరు రహదారిని 12 లేన్లుగా విస్తరించే పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, దీనికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరుతోంది. ఇక హైదరాబాద్-విజయవాడ రహదారిలో ఆరు లేన్ల విస్తరణ పనులకు టెండర్లను ఆహ్వానించాలని కోరుతోంది. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ పూర్తి కాలేదని, ఇటీవల కేంద్రం.. పాత కాంట్రాక్టును రద్దు చేసి, కొత్తగా టెండర్లను ఆహ్వానించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆ పనులను వేగంగా చేపట్టాలని కోరింది.

రాష్ట్ర ప్రభుత్వ ఇతర డిమాండ్లు

- రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)ను ఏర్పాటు చేయాలి. ఇప్పటివరకు ఒక్క ఐఐఎం కూడా రాలేదు.
- కొత్త జిల్లాలకు నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. మొత్తం 24 నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలి.
- ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రావాల్సిన రూ.347.54 కోట్లను ఇవ్వాలి.
- స్మార్ట్ సిటీల కింద వరంగల్, కరీంనగర్‌లకు నిధులు ఇవ్వాలి.

భూ సర్వేకు 300 కోట్లు కేటాయించాలి

రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే, భూ రికార్డుల డిజిటలైజేషన్, రికార్డుల అప్‌డేట్ తదితర కార్యక్రమాలు చేపట్టేందుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం కోరుతోంది. ఈ మేరకు సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డు కమిషనర్ కార్యాలయం ప్రతిపాదనలు రూపొందించింది. కేంద్రం అన్ని రాష్ట్రాల్లో భూ సర్వే చేపట్టి భూ రికార్డులను అప్‌డేట్ చేసేందుకు డీఐఎల్ఆర్ఎంపీ (డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డు మోడ్రనైజేషన్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ ప్రక్రియను 2025-26 మార్చి 31 నాటికి పూర్తి చేయాలని గడువు విధించింది. అందులో భాగంగా రాష్ట్రానికి రావల్సిన నిధులతో పాటు అదనపు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం కోరుతోంది.

పారిశ్రామిక కారిడార్లకు నిధులివ్వండి

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి రెండు పారిశ్రామిక కారిడార్లను నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉందని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. వీటిని పూర్తి చేస్తే కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని అంటోంది. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ మీదుగా విజయవాడ వరకు నూతన పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ఆమోదం తెలపాలని కోరుతోంది. హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు కూడా తుది అనుమతులు మంజూరు చేయాలని అడుగుతోంది. దీంతో రాష్ట్రానికి రూ.2,300 కోట్లు విడుదలవుతాయని ఆశిస్తోంది. ఇక కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద ఎక్కువ ఇళ్లను మంజూరు చేయాలని కోరుతోంది. కేంద్ర నిబంధనల మేరకే తాము ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధానిని కలిసిన సందర్భంగా చెప్పారు. ‘ఓట్-ఆన్-అకౌంట్’ బడ్జెట్‌లో పీఎంఏవై కింద మొత్తం 2 కోట్ల ఇళ్లను కేంద్రం ప్రకటించింది. రూ.80,967 కోట్లతో వీటిని చేపడతామని పేర్కొంది. దీంతో పూర్తి స్థాయి బడ్జెట్‌లో తెలంగాణకు 25 లక్షల ఇళ్లను కేటాయించాలని రాష్ట్రం కోరుతోంది. కాగా, కరీంనగర్, జనగాం జిల్లాల్లో లెదర్ పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూములున్నాయని, ఈ పార్కులకు కేంద్రం నిధులు మంజూరు చేస్తే.. భూములు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. దీంతోపాటు పీఎం మిత్ర పథకంలో భాగంగా వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కుకు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఇచ్చిందని, దానికి గ్రీన్ ఫీల్డ్ హోదా ఇవ్వాలని కోరుతోంది. దీంతో గ్రాంట్ల రూపంలో అదనంగా రూ.300 కోట్ల నిధులు వస్తాయని చెబుతోంది.

రాష్ట్రంలో బాల్ బేవరేజ్ ప్యాకింగ్ యూనిట్

- 700కోట్ల పెట్టుబడి..

500 మందికి ఉపాధి: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులను పెట్టేందుకు మరో కంపెనీ ముందుకొచ్చింది. బీర్లు, శీతల పానీయాలు, పర్‌ఫ్యూమ్‌ల కంపెనీలకు అల్యూమినియం టిన్నులను సరఫరా చేసే బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ యూనిట్‌ను తెలంగాణలో నెలకొల్పేందుకు ‘బాల్ ఇండియా’ కంపెనీ ముందుకొచ్చిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కంపెనీ రూ.700 కోట్ల మేర పెట్టుబడులతో ఉత్పాదన యూనిట్‌ను ఏర్పాటు చేయనుందన్నారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే 500 మందికి ఉపాధి లభిస్తుందని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ‘బాల్ ఇండియా’ కంపెనీ ప్రతినిధి గణేశన్‌తో సచివాలయంలో భేటీ అయ్యామని పేర్కొన్నారు. తెలంగాణలోనూ టిన్నుల బీర్ వినియోగానికి ఎక్సైజ్ పాలసీలో మార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చిస్తామన్నారు. 500మిల్లీ లీటర్ల పరిమాణంలోని బీర్లను అల్యూమినియం టిన్నుల్లో ప్యాకింగ్ చేయడం వలన ఎక్సైజ్ డ్యూటీ తగ్గుతుందని, తద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.285కోట్ల అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో రూ.1000 కోట్లతో ఏర్పాటయ్యే కోకాకోలా కోక్ ప్యాకింగ్(బాటిలింగ్) యూనిట్‌కు ‘బాల్ ప్యాకేజింగ్ యూనిట్’ సంస్థ అల్యూమినియం టిన్నులను సరఫరా చేస్తుందని మంత్రి తెలిపారు.

ఓపెన్ కాస్ట్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వండి

లద్నాపూర్ ఓపెన్‌కాస్ట్‌మైన్ కోసం సింగరేణి సేకరించిన భూమిలో ఇళ్లు నిర్మించుకున్న 280 మందికి పరిహారం చెల్లింపు విషయమై లబ్ధిదారులతో చర్చలు జరపాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మంథని నియోజకవర్గం లద్నాపూర్‌లో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ మైన్ కోసం 2012లో సేకరించిన భూమికి సంబంధించి నిర్వాసితులుగా చెబుతున్న 280 మందికి ఆర్ అండ్ఆర్ చెల్లింపులో చట్టపరమైన అడ్డంకులున్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వారందరితో మాట్లాడి మానవతా దృక్పథంతో పరిహారం అందించి సమస్య పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

మాజీ డీహెచ్ గడల బదిలీ!

ఇప్పటికే వీఆర్ఎస్‌కు దరఖాస్తు.. ఆమోదించని రాష్ట్ర సర్కారు

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య విభాగం మాజీ సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనకు స్థానచలనం కల్పించారు. ఆయన ప్రస్తుతం అదనపు జిల్లా ప్రజారోగ్య అధికారి హోదాలో ఉన్నారు. డీహెచ్ పోస్టు నుంచి తప్పుకొన్న తర్వాత ఆయన విధులకు హాజరుకాలేదు. స్వచ్ఛంద పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వం ఆమోదించలేదు. రెండోసారి వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి స్పందించలేదు. సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌లో సుదీర్ఘకాలం (లాంగ్ స్టాండింగ్) ఉన్నారనే కారణంతో బదిలీల జాబితాలో గడల పేరును కూడా చేర్చారు. శనివారం కౌన్సెలింగ్ నిర్వహించగా ఆయన హాజరుకాలేదు. దీంతో ఆ తర్వాత వారికి పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన కేడర్‌లో నిర్మల్, మహబూబాబాద్ మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఆ రెండు జిల్లాల్లో ఒక చోటకు పంపే అవకాశం ఉంది. సంబంధిత ఉత్తర్వులు నేడో, రేపో వస్తాయని వైద్యవర్గాలు తెలిపాయి. ఇక అదే హోదాలో 10 మంది ఉండగా.. 40 శాతం బదిలీల్లో భాగంగా నలుగురిని బదిలీ చేశారు. జాబితాలో తొలిపేరు గడల శ్రీనివాసరావుదే. మరోవైపు నిర్మల్ ఏడీపీహెచ్‌వోగా ఉంటూ శేరిలింగంపల్లి డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న మల్లికార్జున్‌ను జనగామకు బదిలీ చేశారు.

పలువురు డీఎంహెచ్‌వోల బదిలీ

సుదీర్ఘకాలంగా ఒకే చోట సివిల్ సర్జన్లుగా పనిచేస్తున్న వారిని కూడా వైద్య శాఖ బదిలీ చేసింది. వాస్తవానికి సివిల్ సర్జన్లకు ప్రభుత్వమే నేరుగా పోస్టింగులు ఇస్తుంది. కానీ, తొలిసారి వారిని కూడా బదిలీ చేయడం విశేషం. ఈ జాబితాలో పదిమంది ఉండగా.. అందులో కొందరు డీఎంహెచ్‌వోలు, మరికొందరు ఆర్ఎంవోలు ఉన్నారు. ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కృష్ణ వేరే జిల్లాకూ ఇన్‌చార్జిగా ఉండడంతో ఆయన్ను ఒరిజినల్ పోస్టులో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఏళ్ల తరబడి ఉన్నవారు మారలే..

హైదరాబాద్‌లో డీఎంహెచ్‌వోగా ఆరేళ్లుగా పనిచేస్తున్న వెంకట్‌ను బదిలీ చేయలేదు. తొలుత నిజామాబాద్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఆయన.. తర్వాత పదోన్నతి పొంది హైదరాబాద్‌లో పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఇక నీలోఫర్ ఆస్పత్రిలో ఆర్ఎంవోగా పనిచేస్తున్న లాలు ప్రసాద్ 12 ఏళ్లుగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. సంఘం నేత కావడంతో ఆయనకు స్థానచలనం కలగలేదు. అదే ఆస్పత్రిలో ఆర్ఎంవోగా ఉన్న దామోదరరావు 22 ఏళ్లుగా అక్కడే ఉన్నారు. మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్న శశికాంత్ 13 ఏళ్లుగా అక్కడే ఉన్నా.. బదిలీ చేయలేదు. పదిన్నరేళ్లుగా నాగర్‌కర్నూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న వెంకట్‌దాస్, ఖమ్మంలో ఆరేళ్లుగా పనిచేస్తున్న సైదులు కూడా అలాగే ఉన్నారు. వీరంతా అసోసియేషన్ లేఖలతో అక్కడే ఉండిపోయారని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇక యాదాద్రి జిల్లాలో పనిచేస్తున్న సుప్రియను హైదరాబాద్‌లోని కుషాయిగూడకు బదిలీ చేశారు. విచిత్రమేమిటంటే.. ఆమె ఉద్యోగంలో చేరి రెండేళ్లు కూడా పూర్తి కాలేదు. సాధారణ బదిలీలు ఆమెకు వర్తించవు. అయినా బదిలీ చేసేశారు. ఇలా అనేక విచిత్రాలు జరిగాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అసోసియేషన్ పేరుతో లేఖలు తెచ్చుకొని, అదే స్థానంలో కొనసాగుతున్న వ్యవహారంపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని వైద్య సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.


వైద్య శాఖ బదిలీల్లోనే ఎందుకిలా?

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశంపై దృష్టి సారించినట్లు తెలిసింది. వైద్య శాఖలోనే ఇలాంటి పరిస్థితి ఎందుకు నెలకొన్నదో తెలుసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించినట్లు సమాచారం. బదిలీల వ్యవహారంపై సమగ్ర నివేదిక కోరినట్లు తెలిసింది. సాధారణ బదిలీ ప్రక్రియలో ఏ శాఖలో లేని ఆందోళనలు ఇక్కడే ఎందుకు జరుగుతున్నాయని రేవంత్ ఆరా తీసినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. వైద్య శాఖ బదిలీల తీరు సర్కారుకు మచ్చ తెచ్చేలా ఉందని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీఎం ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే సకాలంలో ప్రక్రియ పూర్తి చేయకపోవడం వల్ల బదిలీల తేదీలను పెంచడానికి వైద్యశాఖే కారణమైందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. తేదీలను పెంచడంతో కొత్త తలనొప్పులు మొదలయ్యాయి. కొందరు కోర్టుకు వెళ్లి బదిలీలపై స్టే తెచ్చుకుంటున్నారని ఓ ఉన్నతాధికారి ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రజారోగ్య విభాగంలో జరిగిన బదిలీలపై తీవ్ర చర్చ జరుగుతోంది. స్టాఫ్‌నర్స్ సీనియారిటీ జాబితాను నాలుగుసార్లు మార్చినా, తప్పులు దొర్లాయని నర్సులు చెబుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల వ్యవహారంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని, లేకుంటే కాంగ్రెస్ సర్కారుకు ఇది మచ్చలా మారుతుందని సీనియర్లు పేర్కొంటున్నారు. మరోవైపు యూనియన్ల పేరిట అప్పటికప్పుడు లేఖలు తెచ్చుకొని తమ స్థానాలను కాపాడుకుంటున్న ఉద్యోగులపై ఇతర ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీవో, టీఎన్‌జీవో, ఐఎన్‌టీయూసీ సంఘాలు తమకు గుర్తింపు ఉందని ఎడాపెడా లేఖలు ఇచ్చాయి. కొందరు ఈ లేఖల ముసుగులో పెద్దయెత్తున డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో సర్కారు ఇంటెలిజెన్స్‌ను రంగంలోకి దింపినట్లు తెలుస్తోంది. డబ్బులు ఎలా వసూలు చేశారన్న దానిపై ఇప్పటికే కొందరిని విచారించినట్లు సమాచారం.

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి కెప్టెన్ చైర్

» గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో విశేష కృషికి జాన్స్ హాప్‌కిన్స్ విశ్వవిద్యాలయం గుర్తింపు



హైదరాబాద్ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా అమెరికాలోని జాన్స్ హాప్‌కిన్స్ విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మక, చారిత్రక ప్రాధాన్యత ఉన్న 'కెప్టెన్ చైర్'ను అందజేసింది. ఈ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ప్రొఫెసర్ సర్ విలియం ఓస్లర్.. 1874 నుంచి తమ రంగాల్లో విశేష కృషి చేసిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులకు 'కెప్టెన్ చైర్'ను అందజేయడమనే సంప్రదాయం నెలకొల్పారు. ఈ విశ్వవిద్యాలయం గ్యాస్ట్రో ఎంటరాలజీ, హెపటాలజీ విభాగం డైరెక్టర్ అన్నీ మేరీ లెన్నాన్.. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి 'కెప్టెన్ చైర్'ను అందజేశారు. ప్రత్యేకమైన కలపతో కళాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ కుర్చీ.. నైపుణ్యానికి ప్రతీకగా తళుకులీనుతూ ఉంటుంది.

మహావీర్ ఆస్పత్రిలో రూ.2లక్షలకే ఓపెన్ హార్ట్ సర్జరీ

» రూ.10 వేలకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు

ఖైరతాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని మహావీర్ ఆస్పత్రిలో గుండె సంబంధిత సమస్యల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్డియాలజీ విభాగాన్ని ఆదివారం ప్రారంభించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ విభాగం ద్వారా రోగులకు తక్కువ ఖర్చుకే మెరుగైన వైద్యం అందిస్తామని ఆస్పత్రి చైర్మన్ మహేంద్ర రాంకా ఈ సందర్భంగా తెలిపారు. తమ కార్డియాలజీ విభాగంలో యాంజియోగ్రామ్ సహా గుండె సంబంధింత సమస్యల నిర్ధారణకు చేసే పరీక్షలను రూ.10వేలకే నిర్వహిస్తున్నామని, ఓపెన్ హార్ట్ సర్జరీని రూ.2లక్షలకే చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్డియాలజీ విభాగం ప్రారంభ కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ బాలకృష్ణ, సహాయ కమిషనర్ అమిత్‌కుమార్, ఆస్పత్రి వైస్ చైర్మన్ సుశీల్ కపాడియా తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ ప్రాంతాల పరిరక్షణకు కృషి

» యునెస్కో సదస్సులో మంత్రి జూపల్లి

న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పలు ప్రసిద్ధ వారసత్వ కట్టడాలు, చారిత్రక ప్రాంతాల పరిరక్షణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆదివారం ఢిల్లీలోని భారత మండపంలో వారసత్వ కట్టడాల పరిరక్షణే ధ్యేయంగా పనిచేసే యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సెషన్ ప్రారంభమైంది. ఈ సమావేశాలకు మన దేశం ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి. యునెస్కో డైరెక్టర్ జనరల్ ఓడ్రే అజులై, కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తోపాటు 150కి పైగా దేశాల నుంచి 2 వేల మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సుకు తెలంగాణ నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై.. తెలంగాణ పర్యాటక స్టాల్‌తో పాటు, ఆసియా దేశాలకు చెందిన పలు స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు మన రాష్ట్రానికి చెందిన ముఖ్యమైన సాంస్కృతిక, వారసత్వ ప్రాంతాల పరిరక్షణకు, అభివృద్ధి చర్యలు తీసుకోవడానికి ఇలాంటి సమావేశాలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. 2021లో చైనాలోని ఫ్యూజీలో జరిగిన ప్రపంచ వారసత్వ కట్టడాలు, ప్రాంతాల కమిటీ సమావేశంలో రామప్ప దేవాలయాన్ని వారసత్వ సంపద జాబితాలో చేర్చుతూ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశానికి ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, పర్యాటకశాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, పురావస్తుశాఖ డైరెక్టర్ భారతీ హోలికేరి హాజరయ్యారు. ఈ నెల 31 వరకు సమావేశాలు కొనసాగనున్నాయి.

రుణమాఫీ వైఫల్యాన్ని అసెంబ్లీలో ఎండగడతాం

» రైతు భరోసా ఇచ్చే ఉద్దేశం సర్కారుకు లేదు: ఏలేటి

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ఎండగడతామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కొంత మంది రైతులకే రుణమాఫీ అమలు చేసి మిగతా వారికి షరతులు విధించడమేంటని ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతు పాసు పుస్తకం ఆధారంగా రుణమాఫీ అని చెప్పి.. రేషన్‌కార్డును ప్రామాణికం చేస్తుండటంతో వేలాది మందికి లబ్ధి చేకూరలేదని విమర్శించారు. అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు భరోసాను అమలుచేసే ఉద్దేశం సర్కారుకు లేదని మహేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో తమ పేరు లేదని చాలా గ్రామాల్లో రైతులు ఆందోళనతో ఉన్నారని పార్టీ చీఫ్ విప్ పాల్వాయి హరీశ్ బాబు తెలిపారు.

'కమాండ్ కంట్రోల్'కు డీజీపీ కార్యాలయం!

» అధికారుల కార్యాలయాలూ తరలింపు

» ఇక్కడి నుంచే విభాగాల కార్యకలాపాలు

» రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం.. త్వరలో మార్పు




హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): లక్డీకాపూల్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయాన్ని బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీ)కు తరలించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. డీజీపీతోపాటు ఇతర కీలక అధికారుల కార్యాలయాలూ అక్కడికి మారనున్నాయి. ఐసీసీ నిర్మాణ సమయంలోనే డీజీపీతోసహా అన్ని పోలీసు విభాగాలు, ఇతర కీలక ప్రభుత్వ విభాగాలు ఇక్కడి నుంచి పని చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే అక్కడ హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌తోపాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో కొనసాగుతున్నాయి. డీజీపీ కార్యాలయం అక్కడికి మార్చడం వల్ల అన్ని కీలక విభాగాలు ఒకే చోట నుంచి పనిచేసే అవకాశం ఉంటుంది. కాగా, మొన్నటి వరకు ఏపీ సీఐడీ ఆధీనంలో ఉన్న లక్డీకాపూల్‌లోని భవనం తెలంగాణ ఆధీనంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం ఐసీసీలో కొనసాగుతున్న సీపీ కార్యాలయంలో కొంత భాగం అక్కడికి మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు ట్రాఫిక్ కంట్రోల్ రూం భవనం పక్కనే మొన్నటి వరకు కొనసాగిన సీసీఎస్ కార్యాలయం బషీర్‌బాగ్‌లోని పాత సీపీ కార్యాలయానికి మార్చారు. అయితే ఇక్కడ అధికారులు, సిబ్బంది కూర్చుని రోజువారి విధులు నిర్వహించేందుకు అనుకూలంగా గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరిని పాత బిల్డింగ్‌కు లేదా మరో భవనంలోకి మారుస్తారని సమాచారం. హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక కేసుల విచారణ సమయంలో నిందితుల్ని అదుపులోకి తీసుకుని విచారించేందుకు ఉపయోగిస్తున్న సిట్ కార్యాలయానికి పెద్ద మొత్తంలో అద్దె చెల్లిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి ఉపయోగించే కార్యాలయానికి అనవసరంగా అద్దె చెల్లించే బదులు సిట్ కార్యాలయాన్ని పోలీసు భవనాల్లోకి మార్చే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ మొత్తం మార్పులు చేర్పులు డిసెంబరు నాటికి పూర్తి చేసే అవకాశం ఉంది.

సీఎం సమావేశాలు ఇక్కడే...

ఐసీసీ కేంద్రంగా సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు కీలక సమావేశాలు నిర్వహించారు. మంత్రులు, సీఎస్, డీజీపీ, ఆయా విభాగాల అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. ఇకపై తరచూ ఇక్కడి నుంచే సమావేశాలు నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో డీజీపీ, సీఎస్, ఇతర ముఖ్య అధికారుల కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల సమావేశాలకు మరింత ఉపయోగకరంగా మారనుంది.

బై బైడెన్!



(మొదటి పేజీ తరువాయి)

ఉన్న డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి ముందే.. ఆయన విజయావకాశాలు 60% దాకా ఉండగా.. కాల్పుల ఘటన తర్వాత ఒక్కసారిగా 78శాతానికి పెరిగిపోయాయి. అప్పటి నుంచి డెమోక్రాట్లు బైడెన్ ఉంటే ఓటమి తప్పదని ప్రకటనలు చేస్తూ వచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ట్రంప్‌ను ఎదుర్కోవడం బైడెన్ వల్ల కాదంటూ.. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఇతర సీనియర్లు వ్యాఖ్యానించారు. ఇలా డెమోక్రాట్ల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్నా.. 'తగ్గేదే లే' అన్న బైడెన్ అనూహ్యంగా ఆదివారం తన నిర్ణయాన్ని ప్రకటించారు. గురువారం రాత్రి తనకు కొవిడ్-19 సోకిందని ప్రకటించిన బైడెన్.. ప్రస్తుతం తన ఇంట్లో స్వీయ-క్వారంటైన్‌లో ఉన్నారు. తన తాజా నిర్ణయంపై ఓ లిఖిత పూర్వక ప్రకటన చేశారు. "ప్రియమైన అమెరికన్లకు.. అమెరికా అధ్యక్షుడిగా సేవ చేయడం నా జీవితంలో గొప్ప గౌరవం. గడిచిన మూడున్నరేళ్లలో మనం చాలా అభివృద్ధిని సాధించాం. ఈరోజు అమెరికా ప్రపంచంలోనే శక్తిమంతమైన ఆర్థిక శక్తిగా ఉంది. దేశ పునర్నిర్మాణంలో మనం ఎంతో కృషి చేశాం. డ్రగ్స్‌ను నిరోధించాం. తుపాకీ సంస్కృతికి చెక్ పెట్టేలా చట్టాన్ని తీసుకువచ్చాం. మొట్టమొదటిసారిగా ఆఫ్రికా మూలాలున్న అమెరికా మహిళను సుప్రీంకోర్టులో నియమించాం. కొవిడ్ సమయంలో ఆత్మనిర్భరంతో ముందుకు వెళ్లాం. ఆర్థిక ఒడిదుడుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకున్నాం. పార్టీ నిర్ణయం మేరకు.. దేశ ప్రయోజనాల కోసం ఇప్పుడు అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నా" అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. అదే సమయంలో డెమోక్రాట్లను ఉద్దేశించి ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. "నా ప్రియతమ డెమోక్రాట్లకు.. నేను నా నామినేషన్‌ను ఆమోదించకుండా.. పరిపాలనపైన దృష్టి పెట్టాలనుకుంటున్నాను. 2020లో నేను అధ్యక్షుడినైన వెంటనే మొదటగా చేసింది.. కమలా హారిస్‌ను ఉపాధ్యక్షురాలిగా నియమించడం. ఈ మూడున్నరేళ్ల పాలనలో ఆమె నాకు ఎంతగానో సహకరించారు. నా వారసురాలిగా ఆమెను ఆమోదిస్తున్నాను. ఆమెకు నేను పూర్తిస్థాయిలో మద్దతిస్తాను. ప్రియతమ డెమోక్రాట్లారా.. ఇదే తరుణం. మనం కలిసికట్టుగా ట్రంప్‌ను ఓడిద్దాం" అని ఆ ట్వీట్‌లో పిలుపునిచ్చారు.

పాతిక రోజుల క్రితం..

పాతిక రోజుల క్రితం.. అంటే జూన్ 27 వరకు కూడా బైడెన్ గట్టి పోటీదారు అని అంతా అనుకున్నారు. అయితే.. జూన్ 27న ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో బైడెన్ తీవ్రంగా తడబడ్డారు. ఆ డిబేట్ నుంచే బైడెన్ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ప్రపంచమంతా ఆసక్తిగా గమనించిన ఆ చర్చలో.. ఒకరిపై మరొకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నా.. ట్రంప్‌దే పైచేయిగా తేలింది. ఆ తర్వాత బైడెన్ పలు సభల్లోనూ తడబడుతూ.. తప్పులు మాట్లాడారు. దీంతో.. ఆయన నరాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారని, మానసికంగా స్థిరంగా లేరని సొంత పార్టీ నేతలే విమర్శించారు. ట్రంప్‌ను ఉపాధ్యక్షుడని ఓ సమావేశంలో పేర్కొన్నారు. మరో సందర్భంలో 'బ్యాలెట్ ఫైట్' బదులుగా 'బాటిల్(యుద్ధం) ఫైట్' అంటూ తడబడ్డారు. ఈ దశలో ఆయన అధ్యక్ష రేసులో ఉంటే ఓటమి ఖాయమని డెమోక్రాట్లు ఒక అంచనాకు వచ్చేశారు. అప్పటి నుంచి తప్పుకోవాలంటూ బైడెన్‌పై ఒత్తిడి పెంచారు. ఒబామాతోపాటు.. డెమోక్రాట్ సెనేట్ మెజారిటీ లీడర్ చక్‌షుమోర్, డెమోక్రటిక్ హౌస్ లీడర్ హకీమ్ జాఫ్రీస్ స్వరం పెంచారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 30 మంది కాంగ్రెస్ సభ్యులు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో బైడెన్ తలొగ్గక తప్పలేదని స్పష్టమవుతోంది.

రేసులో కమలాహారిస్ ముందంజ



అభ్యర్థిత్వం నుంచి తప్పుకొన్నట్లు బైడెన్ ప్రకటించారు సరే! మరి.. ఆయన స్థానంలో అధ్యక్ష పదవికి పోటీ పడబోయే అభ్యర్థి ఎవరు? ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అభ్యర్థిత్వానికి మద్దతిస్తానని బైడెన్ చెప్పారుగానీ.. అది ఆయన అభిప్రాయం మాత్రమే. అభ్యర్థిగా ఎవరు ఉండాలనేది డెమొక్రాట్లందరూ కలిసి తీసుకోవాల్సిన నిర్ణయం. కమలాహారిస్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే కొందరు బహిరంగ వ్యాఖ్యలు కూడా చేశారు. 'బైడెన్‌ను తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నామంటే.. కమలాహారిస్ అభ్యర్థిత్వాన్ని ఒప్పుకొంటున్నట్టు కాదు' అన్నది వారి వాదన. సాధారణంగా.. అధ్యక్ష పదవికి తమ పార్టీ నుంచి ఎవరు పోటీలో ఉండాలో తేల్చుకోవడానికి అమెరికాలో పార్టీలు ప్రైమరీలు, కాకస్‌లు నిర్వహిస్తాయి. ప్రైమరీలంటే.. బ్యాలెట్ ద్వారా జరిపే ఓటింగ్. కాకస్ అంటే చర్చల ద్వారా జరిపే ఓటింగ్. డెమొక్రాట్ సభ్యుల్లో ఎవరి మద్దతు ఎవరికి ఉందో? ఎవరికి అత్యధికుల మద్దతు ఉందో? ప్రైమరీలు, కాకస్‌ల ద్వారా తేలిపోతుంది. ఆ తర్వాత జరిగే పార్టీ జాతీయస్థాయి సదస్సులో ఎక్కువ మంది మద్దతు పొందిన అభ్యర్థి పేరును లాంఛనంగా ప్రకటిస్తారు. షెడ్యూలు ప్రకారం డెమొక్రాట్ల జాతీయస్థాయి సదస్సు ఆగస్టు 19న జరగనుంది. సమయం ఇంత తక్కువగా ఉన్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రైమరీలు నిర్వహించడం సాధ్యం కాదు కాబట్టి కొన్ని రాష్ట్రాల్లో నిర్వహించి (మినీ ప్రైమరీలు) అభ్యర్థిని ప్రకటించే అంశంపై డెమొక్రాట్లు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. డెమొక్రాట్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని కాంక్షిస్తున్నవారిలో మిషిగన్ గవర్నర్ గ్రెచెన్ విట్మర్, క్యాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ఉన్నట్టు సమాచారం. కానీ, వారికి కమలాహారిస్‌ను మించి మద్దతు రాకపోవచ్చని పార్టీ సభ్యులే అభిప్రాయపడుతున్నారు. మిషెల్ ఒబామా పేరు కూడా వినిపిస్తోంది. అంతిమంగా పార్టీసభ్యులు వీరిలో ఎవరిని ఎంచుకుంటారో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికైతే రేసులో కమలా హారిసే ముందంజలో ఉందని చెప్పొచ్చు. ఒకవేళ ఆ పార్టీ సభ్యులు కమలాహారిస్‌నే అభ్యర్థిగా ఎంచుకుంటే మాత్రం అమెరికా చరిత్రలోనే అదో మైలురాయిగా నిలిచిపోతుంది. ఒక నల్లజాతి, భారతీయ మూలాలు కలిగిన మహిళ అధ్యక్ష పదవికి పోటీ పడడం చరిత్రాత్మకమే అవుతుంది!! కాగా.. బైడెన్‌తో పోలిస్తే కమలాహారిస్‌ను ఓడించడం తనకు చాలా సులువు అవుతుందని డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించినట్టు సీఎన్ఎన్ వార్తాసంస్థ రిపోర్టర్ ఒకరు 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

ఆర్టీసీ విలీన ప్రక్రియకు బ్రేక్!

(మొదటి పేజీ తరువాయి)

మారింది. ఆర్టీసీలో కార్మికుల యూనియన్లను రద్దు చేసి, సంక్షేమ బోర్డుల పేరుతో అధికారుల పెత్తనాన్ని పెంచి పోషించారు. ఉద్యోగులు ఎదురు తిరిగే పరిస్థితులు రావడంతో ఎట్టకేలకు ఎన్నికల ముందు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తామని ప్రకటించారు. ఈ మేరకు గత ఏడాది ఆగస్టు 6న అసెంబ్లీలో బిల్లును ఆమోదించగా.. సెప్టెంబరు 14న అప్పటి గవర్నర్ తమిళిసై ఆమోద ముద్ర వేశారు. ఆ తర్వాతి రోజే ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఆ తర్వాత ఆర్టీసీ విలీనంపై విధి విధానాలు ఖరారు చేయడానికి సీఎస్ నేతృత్వంలో ఆర్థిక, కార్మిక, రవాణా శాఖ ముఖ్యకార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా.. జీవో విడుదల చేయలేదు. ఇంతలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో విలీన ప్రక్రియకు బ్రేక్ పడింది. ఇక, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా... ఆర్టీసీ విలీన ప్రక్రియపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయింది. విలీనానికి సంబంధించిన చట్టపరమైన అంశాలన్ని పూర్తి అయినందున అపాయింటెడ్ తేదీని ప్రకటించాలని ఆర్టీసీ ఉద్యోగుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, విలీన ప్రక్రియపై మళ్లీ సమీక్షించాల్సిన అవసరం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో విలీన ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బకాయిల భారంతో సతమతం

2013 నాటి పీఆర్‌సీకి సంబంధించి 50శాతం బాండ్స్ బకాయిలు రూ. 280కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా.. అందులో రూ.80కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో ఆర్టీసీ యాజమాన్యం సుమారు 14వేల మంది డ్రైవర్లకు మాత్రమే బకాయిలు చెల్లించింది. ఈ అంశంపై మిగతా కార్మికులు, ఉద్యోగులు మండిపడుతున్నారు. అలాగే, ఎస్ఆర్‌బీఎస్‌కు సంబంధించి రూ. 600 కోట్లు, ఎస్‌బీటీకి సంబంధించి మరో రూ.600 కోట్లు, సీసీఎస్‌కు రూ. 800కోట్లకు పైగా ఆర్టీసీ యాజమాన్యం చెల్లించాల్సి ఉన్నట్టు తెలిసింది. ఇవి కాకుండా పీఎఫ్‌కు సంబంధించి మరో రూ.1300 కోట్ల దాకా బకాయిలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఆర్టీసీకి వచ్చే ఆదాయం సరిపోక అందినకాడికి అప్పులు చేస్తున్నట్టు తెలిసింది. గతంలో రోజుకు రూ. 14-16 కోట్ల మేర ఆదాయం వచ్చేది. మహాలక్ష్మి పథకంతో అది రూ. 20-22కోట్లు పెరిగినట్లు చూపిస్తున్నా.. ఇందుకు సంబంధించిన బకాయిలు ప్రభుత్వం నుంచి సకాలంలో విడుదల కావడం లేదు. మహాలక్ష్మి పథకం రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం నుంచి సుమారుగా రూ.1700కోట్లు రావాల్సి ఉన్నట్టు తెలిసింది. ఇవి విడుదల చేసిన పక్షంలో బ్యాంకుల సాయం లేకుండా నేరుగా సంస్థ ఉద్యోగులకు జీతభత్యాలు అందించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయహోదా కల్పించాలి

» కేంద్రాన్ని కోరిన మాజీ ఎంపీ వినోద్

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించాలని మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్ కోరారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో.. తెలంగాణ ప్రగతికి ఉపయోగపడే విధంగా కేంద్రం ప్రకటనలు చేయాలని ఆదివారం ఒక ప్రకటనలో విన్నవించారు. పునర్విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఫిరాయింపుల చట్టాన్ని మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం అనుభజ్ఞులైన ఎంపీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. పార్లమెంటు సమావేశాల్లో అన్ని పార్టీలకు తగినంత సమయాన్ని కేటాయించాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.